PRAJASAKTI Regd.No. 15795/68
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
సిటీ
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 206 | విజయవాడ, శుక్రవారం 1 మార్చి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Friday 1 March 2024 | Rs

సాగర్ నుంచి ఎపికి 3 టిఎంసిలు: కెఆర్ఎంబి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు మూడు టిఎంసిల నీటిని విడుదల చేయనున్నారు. ఈమేరకు కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) అనుమతినిచ్చింది. సాగర్ కుడికాల్వ హెడ్‌రెగ్యులేటర్ ద్వారా శుక్రవారం ఉదయం 11 గంటలకు నీరు విడుదల చేయాలని నిర్ణయించింది. కెఆర్ఎంబి అధికారుల సమక్షంలో నీటి విడుదల జరుగుతుందని ఉత్తర్వుల్లో బోర్డు పేర్కొంది.

ఓట్లను తొలగించిందీ లేనిదీ చెప్పండి

- ఎన్నికలు సంఘానికి హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి, అమరావతి

ఓటర్ల జాబితా నుంచి పిటిషనర్ల పేర్లను తొలగిస్తూ ఎన్నికల అధికారుల ఉత్తర్వుల తీరును హైకోర్టు ఆక్షేపించింది. పిటిషనర్ల అభ్యంతరాలు పరిగణలోకి తీసుకున్నారో లేదో, ఓట్లను తొలగించిందీ లేనిదీ వివరిస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ రఘునందన్‌రావులతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఆదేశాలచ్చింది. విచారణను మార్చి 5కి వాయిదా వేసింది. నోటీసు ఇవ్వకుండా ఓటర్ల వివరణ తీసుకోకుండా ఫారం 7 ఆధారంగా ఓటర్ల పేర్లను జాబితాల నుంచి తొలగిస్తున్నారంటూ పర్చూరు మండలం, తిమ్మరాజుపాలెంకి చెందిన బి గౌతమి సహా 11 మంది పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే.

బిజెపిని సాగనంపితేనే దేశానికి రక్ష

- రాజ్యాంగాన్ని కాలరాసే బిజెపిని, దాన్ని బలపరిచే పార్టీలనూ ఓడిద్దాం
- 'రాజ్యాంగ పరిరక్షణ' సదస్సులో వక్తలు



సదస్సులో అభివాదం చేస్తున్న మణిశంకర్ అయ్యర్, వడ్డే శోభనాద్రీశ్వరరావు, యోగేంద్ర యాదవ్, విజయరావు, లక్ష్మీనారాయణ, వి.శ్రీనివాసరావు, చలసాని శ్రీనివాసరావు, జెవి.సత్యనారాయణమూర్తి, జగ్గునాయుడు తదితరులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశంలో ఏ మూలకు వెళ్లి.. ఎవరిని ప్రశ్నించినా గత పదేళ్లలో ధరలు పెరిగిపోయి బతకలేకపోతున్నామని చెబుతున్నారని, మోడీ పాలన పోయి భవిష్యత్తులో మంచి రోజులు వస్తాయనే ఆశతో ఎదురుచూస్తున్నామని అంటున్నారని పలువురు వక్తలు తెలిపారు. రాజ్యాంగాన్ని, లౌకిక విలువలను బిజెపి నాశనం చేసిందని, అందుకే వచ్చే ఎన్నికల్లో ముద్దా(సమస్య)లా ? మోడీయా ? అన్న విషయాన్ని దేశ ప్రజలు తేల్చుకుని, నూటికి 90 శాతం ప్రజలు ఓట్లేసి బిజెపిని అధికారం నుంచి వెళ్లగొట్టాల్సి ఉందని పిలుపునిచ్చారు. గురువారం ఉదయం విశాఖలోని డాబాగార్డెన్స్ వద్దనున్న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో కిసాన్ సంయుక్త మోర్చా కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన 'బిజెపి కో హఠావో.. దేశ్ కో బచావో' నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ కోసం ఉత్తరాంధ్ర ప్రాంతీయ సదస్సు జరిగింది. కాంగ్రెస్ జాతీయ నాయకులు మణిశంకర్ అయ్యర్, స్వరాజ్య పార్టీ జాతీయ నాయకులు యోగేంద్ర యాదవ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణమూర్తి, జై భారత్ పార్టీ నాయకులు వివి.లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. ముఖ్య వక్తగా హాజరైన మణిశంకర్ అయ్యర్ మాట్లాడుతూ.. దేశాన్ని బిజెపి, ఆర్ఎస్ఎస్ బారి నుంచి రక్షించుకోవడమే మిగతా 2లో

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంటర్మీడియట్ పరీక్షలు నేటి (శుక్రవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,559 కేంద్రాల్లో జరగనున్న ఈ పరీక్షలకు 10,52,221 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. మొదటి సంవత్సరంలో 5,17,617 మంది రాయనున్నారు. ద్వితీయ సంవత్సరంలో 5,34,604 మంది విద్యార్థులు పరీక్షలు రాయను న్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష సమయానికి 30 నిమిషాల ముందు కేంద్రాల్లోకి విద్యార్థులకు అనుమతి ఉంటుంది. హాల్ టిక్కెట్లపై ప్రిన్సిపాల్ సంతకంఉండాల్సిన అవసరం లేదని ఇంటర్మీడియట్ బోర్డు ఇప్పటికే ప్రకటించింది. విద్యార్థులు పాత హాల్ టిక్కెట్ నెంబర్ గానీ పుట్టిన రోజు వివరాలతో గానీ డౌన్‌లోడ్ చేసుకోవచ్చునని వెల్లడించింది. బోర్డు వెబ్‌సైట్ bieap.apcfss.in ద్వారా అభ్యర్థులు హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షకు హాజరు అయ్యే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా 57 సమస్యాత్మక కేంద్రాలను బోర్డు గుర్తించింది. మొదటి సంవత్సరంలోని ప్రధాన సబ్జెక్టుల పరీక్షలు మార్చి 14తో, ద్వితీయ సంవత్సరం పరీక్షలు 15వ తేదీతో ముగుస్తాయి. గుంటూరు జిల్లా తాడేపల్లిలో ఉన్న బోర్డు కార్యాలయంలో కంట్రోల్ రూం అధికారులు ఏర్పాటు చేశారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యార్థులు ఫిర్యాదులు అందించవచ్చు. అదేవిధంగా 08645-277707, 18004251531 నెంబర్ల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు. పరీక్షా కేంద్రాల వద్ద తక్షణ వైద్యసేవలు అందించేందుకు మెడికల్ సెంటర్లు ఏర్పాటు చేశారు.




2

'అద్దె' కట్టని సచివాలయం

- సిఆర్‌డిఏకు రూ.200 కోట్లపైనే బకాయి

మోడీ సర్కారు మాయ!

- ఎన్నికల వేళ జిడిపికి రెక్కలు
- మూడవ త్రైమాసికంలో 8.4 శాతం పెరిగినట్టు ప్రకటన



ప్రజాశక్తి - బిజినెస్ డెస్క్

నరేంద్రమోడీ ప్రభుత్వం ఎన్నికల వేళ మరో మాయాజాలానికి పాల్పడింది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కుదించుకుపోవడంతో పాటు పెరుగుతున్న ధరలతో విలవిలలాడుతున్న సామాన్యుడి ఆగ్రహాన్ని పక్కదోవ పట్టించేలా, దేశ ఆర్థిక వ్యవస్థ బ్రహ్మాండంగా ఉన్నట్లు చూపుతోంది, దీనిలో భాగంగా క్షేత్రస్థాయి వాస్తవాలతో సంబంధం లేకుండా కాగితాలపై వృద్ధి లెక్కలను భారీగా పెంచివేసింది. ఒక్కసారి ఇంత వృద్ధి ఎలా సాధ్యమైందన్న ప్రశ్నలకు తావు లేకుండా చూసేందుకు గడిచిన ఆరు నెలల కాలపు వృద్ధి లెక్కలను కూడా పెంచుతూ సవరించింది. అనూహ్యంగా వెలువడిన ఈ గణాంకాల పట్ల దేశ వ్యాప్తంగా ఆర్థికరంగ నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌బిఐతో పాటు, వివిధ రంగాల నిపుణులు వేసిన అంచనాలకు, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వృద్ధికి పొంతన లేకపోవడమే వారి ఆశ్చర్యానికి కారణం. కృత్రిమ వృద్ధి లెక్కలు దేశానికి భవిష్యత్తులో తీవ్ర హాని చేస్తాయని వారు హెచ్చరిస్తున్నారు. అయితే, బిజెపి నాయకులు, వారి మద్దతు దారులు మాత్రం భారీ వృద్ధి పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిడిపి ఎంత...?

ప్రస్తుత ఆర్థిక సంవత్సరపు (2023-24) తృతీయ త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో జిడిపి 8.4 శాతం పెరిగినట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు నేషనల్ స్టాటిస్టికల్ ఆఫీసు (ఎన్ఎస్ఒ) గురువారం సాయంత్రం నివేదికను విడుదల చేసింది. అదే సమయంలో మొదటి, రెండవ త్రైమాసికపు గణాంకాల లెక్కలను కూడా సవరించింది. మొదటి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో 7.8శాతం జిడిపి నమోదైనట్లుగా గతంలో ప్రకటించగా తాజాగా దానిని 8.2శాతంగా సవరించింది. రెండవ త్రైమాసికం (జులై-సెప్టెంబర్)లో 7.6 శాతంగా ఉన్న వృద్ధిని 8.1 శాతంగా పెంచింది. వీటి కొనసాగింపుగా తృతీయ త్రైమాసికంలో 8.4శాతానికి చేరినట్లు పేర్కొంది. ఈ కాలంలో తయారీ, మైనింగ్, నిర్మాణాలు పుంజుకోవడంతో ఈ వృద్ధి సాధ్యమైందని ఈ నివేదిక పేర్కొంది. 2011-12 స్థిర ధరలతో పోల్చితే గడిచిన డిసెంబర్ త్రైమాసికంలో జిడిపి విలువ రూ.43.72 లక్షల కోట్లకు పెరిగింది. 2022-23 ఇదే త్రైమాసికంలో 4.5 శాతంగా వృద్ధి రేటు (రూ40.35 లక్షల కోట్లు)గా ఉంది. దాంతో పోలిస్తే తాజా నిర్ధారణ 8.4 శాతం చాలా ఎక్కువ కావడం గమనార్హం ఈ లెక్కల కోసం నిర్మాణ రంగం ఏకంగా 10.7 శాతం, మిగతా 2లో



మహా వికాస్ అఘాది (ఎంవిఎ) నేతలు

మహారాష్ట్రలో సయోధ్య

- 48 సీట్లపై చర్చలు పూర్తి : ఎంవిఎ

ముంబయి : మహారాష్ట్రలోనూ ప్రతిపక్ష కూటమి మహా వికాస్ అఘాది (ఎంవిఎ) ఐక్యంగా బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. మొత్తం 48 లోక్‌సభ స్థానాలపై చర్చలు పూర్తయ్యాయని గురువారం ప్రకటించింది. ముంబయిలోని శరద్‌పవార్ నివాసంలో గురువారం జరిగిన సమావేశంలో కాంగ్రెస్, శివసేన (యుబిటి), ఎన్‌సిపి నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు బాలాసాహేబ్ థోరట్ మీడియాతో మాట్లాడుతూ 48 సీట్లపై చర్చలు ముగిసాయని చెప్పారు. ఎన్నికల్లో పార్టీల ఓటింగ్ ఆధారంగా సీట్ల పంపకాల ప్రక్రియను పూర్తి చేసినట్లు తెలిపారు. పూర్తి వివరాలను ఎంవిఎ అగ్రనాయకులు త్వరలో వెల్లడిస్తారని చెప్పారు.

సంక్షేమానికి, సర్కారు నిర్వహణకు నిధులెలా?

- ఆర్థిక సలహాదారులు, అధికారులతో సిఎం కీలక సమావేశం
- మ్యానిఫెస్టోపైనా చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్షేమ పథకాలతో పాటు ప్రభుత్వ నిర్వహణకు అవసరమైన నిధుల సమీకరణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి దృష్టి సారించారు. గురువారం సాయంత్రం ఈ అంశంపై కీలకసమావేశం నిర్వహించారు. ప్రస్తుత మున్న సంక్షేమ పథకాలతో పాటు, భవిష్యత్తులో మరిన్ని తీసుకువస్తే ఆర్థికస్థితి ఎలా ఉంటుందన్న అంశంపై ఈ సమావేశంలో చర్చించినట్లు తెలిసింది. మ్యానిఫెస్టోలో పెట్టాలని భావిస్తున్న అంశాలపై సలహాలను కూడా తీసుకున్నట్లు సమాచారం.ఈ సమావేశంలో సిఎం ఆర్థిక సలహాదారు దువ్వూరి కృష్ణతో సహా పలువురు ప్రత్యేక ప్రధానకార్యదర్శి స్థాయి అధికారులు పాల్గొన్నారు.రోజువారీ ప్రభుత్వ నిర్వహణ, ఉద్యోగుల వేతనాలు, ఇటీవల జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో ఉద్యోగులు లేవనెత్తిన ఆర్థికపర అంశాలపై చర్చ జరిగినట్లు తెలిసింది. ప్రతివారం జరిగే సమావేశం అయినప్పటికీ తాజా సమావేశంలో సమావేశంలో అత్యంత కీలకమైన విషయాలనూ చర్చించారని తెలిసింది.యువత, రైతులు, మహిళలు, విద్యార్థులకు అమలు చేయబోయే సంక్షేమ పథకాలు, వాటికి అయ్యే ఖర్చు, ప్రస్తుత నిర్వహణకు కావాల్సిన ఆర్థిక మొత్తాలు ఎలా సమకూర్చుకోవాలనే అంశాలు ఈ చర్చలో చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఇటీవల ఉద్యోగులతో జరిగిన సమావేశంలోనూ ఈ నెలలో ఆర్థిక అంశాల ప్రస్తావన తేవొద్దని మంత్రులు, సలహాదారులు స్పష్టంగా చెప్పారు. ఇదే అంశాలను సిఎం ముందు కూడా ఉంచారు. రాబడి ఎంత, ఖర్చు ఏమిటి, ఈ మూడు నెలల్లో ఎంత ఆదాయం వస్తుందనే అంచనాలను సిఎం అధికారులను అడిగి తెలుసుకున్నారు.

అలాగే ఇప్పటి వరకూ వేర్వేరు రూపాల్లో తీసుకున్న నిధులు, ఇంకా ఏ రూపంలో వచ్చే అవకాశం ఉందనే అంశాలను దువ్వూరి కృష్ణ సిఎంకు తెలిపినట్లు సమాచారం. అదాయాలను దృష్టిలో ఉంచుకుని మ్యానిఫెస్టోలో చేర్చే అంశాలపైనా సమగ్ర నివేదిక తయారు చేయాలని సలహాదారులకు సిఎం సూచించినట్లు తెలిసింది.

హిమాచల్‌లో ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

సిమ్లా : రాజ్యసభ ఎన్నికల్లో బిజెపికి క్రాస్ ఓటింగ్ వేసిన హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుపడింది. ఎమ్మెల్యేలు రాజిందర్ రాణా, సుధీర్ శర్మ, ఇందర్ దత్ లఖన్‌పాల్, దేవీందర్ భుట్టో, రవి ఠాకూర్, చైతన్యశర్మలను అనర్హులుగా స్పీకర్ కుల్దీప్ పటానియా గురువారం ప్రకటించారు. బుధవారం ఆ ఆరుగురు సభ్యులు సభకు హాజరయ్యారని, అసెంబ్లీలో ఆర్థిక బిల్లును ప్రవేశపెట్టినప్పుడు సభలో లేరని స్పీకర్ తెలిపారు. పార్టీ విప్‌ను ఉల్లంఘించినందున ఫిరాయింపుల నిరోధక చట్టం కింద ఆరుగురు ఎమ్మెల్యేల సభ్యత్వాన్ని రద్దు చేస్తున్నామని ఇది తక్షణం అమలులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆరుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ చేయడంతో రాష్ట్రం నుంచి ఉన్న ఒకే ఒక్క రాజ్యసభ స్థానానికి జరిగిన ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి అభిషేక్ సింఘ్వీ ఓటమి పాలవగా, బిజెపికి చెందిన హర్ష్ మహాజన్ గెలుపొందిన సంగతి తెలిసిందే.

ఎన్‌జిఓ సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా శివారెడ్డి, పురుషోత్తం నాయుడు

పదవి విరమణ పొందిన బండి శ్రీనివాసరావు


నూతన నాయకత్వాన్ని అభినందించిస్తున్న ఎన్‌జిఓలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపి నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్(ఎన్‌జిఒ) అసోసియేషన్ నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా కెవి శివారెడ్డి, చౌదరి పురుషోత్తం నాయుడు ఎన్నికయ్యారు. విజయవాడలోని ఎపి ఎన్జీవో హోంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశంలో వీరిని కో ఆప్షన్ విధానంలో ఎన్నుకున్నారు. సహాయ అధ్యక్షులుగా వి దస్తగిరి, ఉపాధ్యక్షులుగా బి వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. ఇప్పటి వరకు అధ్యక్షులుగా కొనసాగిన బండి శ్రీనివాసరావు పదవి విరమణ కావడంతో ఈ ఎన్నిక జరిగింది. సమావేశం అనంతరం నూతన నాయకత్వ పేర్లను బండి ప్రకటించారు. ఇప్పటి వరకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు తనకు చక్కటి సహకారం అందించారని బండి చెప్పారు. 12వ పిఆర్‌సి సాధించే బాధ్యత కొత్త నాయకత్వంపై ఉందన్నారు. శివారెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సంబంధించిన 49 డిమాండ్లను పరిష్కరించాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి బుధవారం వినతిపత్రం అందించామని చెప్పారు. తాము ప్రతిపాదించిన డిమాండ్లలో ఆర్థిక అంశాలపై ప్రధాన కార్యదర్శి సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎలాంటి నష్టం జరిగినా ఎపిఎన్‌జిఒ, ఎపిజెఎసి అండగా ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు కృష్ణారెడ్డి, సుబ్బారెడ్డి, కోశాధికారి రంగారావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జగదీష్, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్, పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, వార్డు, సచివాలయాల ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జానీబాషా, ఎన్ఎంయు అధ్యక్ష కార్యదర్శులు రమణారెడ్డి, శ్రీనివాసరావు, ఎన్టీఆర్ జిల్లా ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విద్యాసాగర్, ఎండి ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



నోటిఫికేషన్ విడుదల చేస్తున్న సిఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి, అధికారులు

తెలంగాణలో మెగా డిఎస్‌సి

- 11,062 పోస్టులతో నోటిఫికేషన్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో 11,062 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మెగా డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదలైంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఐలయ్యతోపాటు విద్యాశాఖ అధికారులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. 5,089 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి గతేడాది సెప్టెంబర్ ఆరో తేదీన డిఎస్‌సి నోటిఫికేషన్‌ను గత ప్రభుత్వం విడుదల చేయగా కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని రద్దు చేసింది. కొత్తగా 4,957 ఉపాధ్యాయ పోస్టులు, స్పెషల్ ఎడ్యుకేషన్‌లో 796 సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్‌జిటి), 220 స్కూల్ అసిస్టెంట్ (ఎస్‌ఎ) కలిపి మొత్తం 5,973 పోస్టుల భర్తీకి అనుమతి ఇస్తూ గతనెల 26న ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పాత, కొత్త పోస్టులతో కలిపి 11,062 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డిఎస్‌సి నోటిఫికేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మహిళలకు సమాంతర రిజర్వేషన్ల విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈనెల నాలుగో తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ, ఏప్రిల్ మూడున తుది గడువు విధించింది. దరఖాస్తు ఫీజు రూ.వెయ్యి చెల్లించాలని, గతంలో దరఖాస్తు చేసిన అభ్యర్థులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని అధికారులు స్పష్టం చేశారు. అభ్యర్థుల వయస్సును 42 నుంచి 46 ఏండ్లకు పెంచారు. ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సిబిఆర్‌టి)ను నిర్వహించనున్నారు. రాతపరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని అధికారులు పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.

రుషికొండ భవనాలు ప్రారంభం

- పాల్గొన్న మంత్రులు రోజా, అమర్‌నాథ్
- ప్రత్యేక పూజలు చేసిన స్వరూపానంద సరస్వతి



భవనాల ప్రారంభ శిలాఫలకం వద్ద మంత్రులు అమర్‌నాథ్, రోజా, స్వరూపానంద సరస్వతి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రుషికొండపై నిర్మించిన వివాదాస్పద భవనాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. గురువారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రులు రోజా, గుడివాడ అమర్‌నాథ్‌లతో పాటు విశాఖ శారదా మఠం పీఠాధిపతి స్వరూపనంద సరస్వతి పాల్గొన్నారు. నూతన భవనాల్లో స్వరూపానంద ప్రత్యేక పూజలు చేశారు. శిలాఫలకాన్ని మంత్రి రోజా ఆవిష్కరించారు. అనంతరం పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మట్లాడుతూ ఆ భవనాలను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై త్వరలోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. వీటినిపర్యాటకం కోసం వినియోగించాలా? ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం కోసం ఉపయోగించాలా ? అన్న అంశంపై త్వరలోనే స్పష్టత వస్తుందన్నారు. రుషికొండపై 9.88 ఎకరాలలో టూరిజం ప్రాజెక్టు నిర్మించామని, గతంలో ఈ ప్రాంతంలో ఉన్న హరిత రిసార్ట్స్ స్థానంలోనే ఈ నిర్మాణాలు జరిగాయని తెలిపారు. ఈ భవన నిర్మాణాలకు అనేక అడ్డంకులు కల్పించేందుకు ప్రతిపక్ష పార్టీలు కుట్రలు పన్నాయని, వాటన్నింటినీ దాటుకుంటూ ప్రాజెక్ట్‌ను అన్ని అనుమతులతో పూర్తి చేశామని చెప్పారు. విశాఖపట్టణాన్ని రాజధానిగా చేయాలని సంకల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ విషయమై ఇప్పటికే ముగ్గురు సీనియర్ ఐఎఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో వైసిపి రీజనల్ కో ఆర్డినేటర్ వైవి.సుబ్బారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

సర్క్యూట్ టూరిజం బస్సులు ప్రారంభం

బీచ్ రోడ్డులో పర్యాటక శాఖ ఏర్పాటు చేసిన 12 సర్క్యూట్ టూరిజం బస్సులను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కె.రోజా జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడలో మరో ఆరు బస్సులను దేవాదాయ శాఖ మంత్రి ప్రారంభించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎపి పర్యాటక అభివృద్ధి సంస్థ యాత్రికులకు సంతృప్తికరంగా సౌకర్యాలు అందిస్తోందన్నారు. పర్యాటక ప్యాకేజీలను మెరుగుపరచుకోవడంతోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాలలో యాత్రికుల కు నాణ్యమైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.

ఒడిశాలో అంగన్‌వాడీల వేతనాల పెంపు

భువనేశ్వర్ : ఒడిశాలోని లక్షా 48 వేల అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాలను పెంచుతున్నట్లు ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. త్వరలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బిజెడి ప్రభుత్వం గురువారం ఈ నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ వర్కర్ల నెలవారీ వేతనాన్ని రూ.7,500 నుంచి రూ.10,000కు, మినీ అంగన్‌వాడీ వర్కర్లకు రూ.5,375 నుంచి రూ.7,250కు పెంచారు. అంగన్‌వాడీ సహాయకులకు రూ.3,750 నుంచి రూ.5,000కి పెంచారు. 2023 అక్టోబర్ నుంచి వేతనాల పెంపు అమల్లోకి వస్తుందని, నాలుగు మాసాల ఇంక్రిమెంట్లను బ్యాంక్ అకౌంట్లలో జమ చేస్తామని ప్రభుత్వం తెలిపింది. అలాగే ఎగ్జిట్ పాలసీకి సంబంధించి అంగన్‌వాడీ వర్కర్లు విధుల నుంచి విరమించుకున్నప్పుడు ఇచ్చే 40 వేల రూపాయలను లక్ష రూపాయలకు, మినీ వర్కర్లకు రూ. 30 వేలను రూ. 75వేలకు, అసిస్టెంట్లకు రూ.20 వేలను రూ. 30 వేలకు పెంచారు. అలాగే విధుల్లో ఉండగా చనిపోతే చెల్లించే ఎక్స్‌గ్రేషియాను రూ.2 లక్షలుకు, పాక్షికంగా అంగవైకల్యం సంభవిస్తే అందించే సాయాన్ని లక్ష రూపాయలకు పెంచారు.



సినీ గాయకుడు వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ సినీ, నేపథ్య గాయకుడు, జానపద బ్రహ్మ వడ్డేపల్లి శ్రీనివాస్ కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గురువారం ఉదయం సికింద్రాబాద్ చిలకలగూడలోని ఆయన నివాసంలో మృతి చెందారు. అనంతరం ఆయన అంత్యక్రియలు సీతాఫల్‌మండి శ్మశాన వాటికలో జరిగాయి. అంత్యక్రియలకు సంగీత దర్శకులు విప్లవ్ కిషోర్, జానపద కవి, గాయకులు నేర్నాల కిషోర్, గాయని గాయకులు స్వర్ణక్క, బోగాల ప్రకాష్, సంపత్, మల్లిక హాజరై సంతాపం తెలిపారు. వడ్డేపల్లికి భార్య, ఒక కూతురు ఉన్నారు.

వరంగల్ జిల్లాలో జన్మించిన వడ్డేపల్లి చిన్నప్పుడే హైదరాబాద్‌కు వచ్చి తెలంగాణలో మొట్టమొదటి జానపద కళాకారుడిగా పేరు తెచ్చుకున్నారు. సుద్దాల అశోక్ తేజ రాసిన 'గరం గరం పోరి నా గజ్జెల సవ్వడి' అనే పాటతో 'నమస్తే అన్న' చిత్రం ద్వారా సినీ నేపథ్య గాయకుడిగా పరిచయమయ్యారు. అనంతరం నాగార్జున నటించిన కింగ్ సినిమాలో 'గింత గింత పాలసుక్కకే' అనే పాట పాడి ఎంతో మంది హృదయాలను గెలుచుకున్నారు. పవన్‌కళ్యాణ్ హీరోగా నటించిన గబ్బర్‌సింగ్ సినిమాలోని 'పిల్లా నువ్వులేని జీవితం' పాటతో వడ్డేపల్లి శ్రీనివాస్‌కు ఎంతో పేరు వచ్చింది. ఈ పాటకు ఆయనకు ఫిలిం ఫేర్ అవార్డ్ కూడా వచ్చింది. దాదాపు 100కు పైగా సినీ గీతాలు, ప్రయివేట్‌గా ఎన్నో ఫోక్ సాంగ్స్ ఆయన ఆలపించారు. అలాగే ఎన్నో అవార్డులు అందుకున్నారు. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం ప్రకటించారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికగా ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది. 94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పిన వాటిని క్షుణ్ణంగా పరిశీలిస్తాం. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

మోడీ సర్కారు మాయ!

(మొదటిపేజీ తరువాయి)

తయారీ రంగం 8.5 శాతం పెరిగినట్టు కేంద్ర ప్రభుత్వం చూపింది.

ఇవీ అనుమానాలు

రేటింగ్ ఎజెన్సీలతో పాటు దిగ్గజ ఆర్థిక సంస్థల పరిశోధన సంస్థల అంచనాను మించి జిడిపి పెరుగుదల చోటు చేసుకోవడంతో ఎన్నికల మాయాజాలమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆర్‌బిఐ వేసిన అంచనాల ప్రకారం మూడవ త్రైమాసికంలో 6.5శాతం మాత్రమే వృద్ధి నమోదయ్యే అవకాశం ఉంది. ఎస్‌బిఐ రిసెర్చి గ్రూపు 6.7 -6.9 మధ్య వృద్ధిని అంచనా వేసింది. ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చి సంస్థ 6.5శాతానికే వృద్ధి పరిమితమయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఎకనామిక్ టైమ్స్ 15 మంది నిపుణులతో నిర్వహించిన పోల్ 6నుండి 7.2 శాతం మధ్య వృద్ధి వుండే అవకాశం ఉందని అంచనా వేసింది. 17 మంది ఆర్థికవేత్తల అభిప్రాయాలను ఆధారంచేసుకుని 6.64 శాతం కు వృద్ధి పరిమితమయ్యే అవకాశం ఉందని మింట్ పేర్కొంది. అన్ని సంస్థలు గత త్రైమాసానికన్నా తక్కువ వృద్ధినే అంచనా వేయగా, కేంద్ర ప్రభుత్వం మాత్రం భారీగా పెరిగిందని పేర్కొనడం గమనార్హం. ఆర్థిక వ్యవస్థలో గొప్ప సానుకూలాంశాలు లేవని, పెట్టుబడులు పెద్దగా పెరగలేదని నిపుణులు చెబుతున్నారు. కేంద్ర ప్రభుత్వం గొప్పగా చెప్పుకున్న తయారీ, నిర్మాణ రంగంలో కూడా భారీ వృద్ధి లేదని, గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులకు పెరుగుతున్న డిమాండే దీనికి నిదర్శనమని వారు వివరిస్తున్నారు.

ఐదేళ్లుగా అరకొర వేతనాలే

- ఒక్కటంటే ఒక్క ఇంక్రిమెంటు కూడా ఇవ్వని ప్రభుత్వం
- కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ధర్నా
- కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఎంప్లాయిస్, టీచర్స్, వర్కర్స్ జెఎసి మద్దతు
- సమస్యలు తక్షణమే పరిష్కరించాలని డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సంరక్షణ సేవలందిస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్‌ఒ) పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఐదేళ్లుగా వీరికి అరకొర వేతనాలే ఇస్తూ ఒక్కటంటే ఒక్క ఇంక్రిమెంటు కూడా ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో వారంతా ఉద్యమబాట పట్టారు. గురువారం విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిహెచ్‌ఒలు ధర్నా నిర్వహించారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్, ఎంప్లాయిస్, టీచర్స్, వర్కర్స్ జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, ఐద్వా రాష్ట్ర ప్రధానకార్యదర్శి డి రమాదేవి, సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె ధనలక్ష్మి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలోని నేషనల్ హెల్త్ మిషన్‌లో భాగంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ (సిహెచ్‌ఒ)ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎనలేని సేవలందిస్తున్న సిహెచ్‌ఒలకు ఐదేళ్లుగా ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా పని చేయించుకోవడం తగదన్నారు. నివాసయోగ్యంలేని రీతిలో ఎలాంటి సౌకర్యాలు లేని ఊరిలయిన క్వార్టర్స్ నిర్మించి అందులో ఉండాల్సిందని చెబుతూ ఆ సాకుతో హెచ్‌ఆర్‌ఎను కూడా కోత పెట్టడం సరైందికాదన్నారు. ఆరు నెలలుగా అద్దెలను, ఇన్సెంటివ్‌లను నిలిపివేశారని విమర్శించారు. ప్రభుత్వం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులందరికీ వేతనాలను పెంచి సిహెచ్‌ఒలకు పెంచకపోవడం అన్యాయమని అన్నారు. ఎన్‌హెచ్‌ఎంలకు అమలు చేసినట్లుగా సిహెచ్‌ఒలకు కూడా 23 శాతం పెంచుతూ వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. సిహెచ్‌ఒలకు రెగ్యులర్ హెల్త్ స్టాఫ్ నర్సులకు ఇచ్చే పే స్కేలును అమలు చేయాలని కోరారు. అలాగే రాత్రి పూట ముఖ ఆధారిత హాజరును రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా సిహెచ్‌ఒలకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అలాగే ఇఎస్‌ఐ, హెల్త్ ఇన్సూరెన్స్‌లను అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం సిహెచ్‌ఒల సమస్యలను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒల అసోషియేషన్ నాయకులు పులి ప్రేమ్‌కుమార్, రాజేశ్వరి, సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.



డిస్నీల్యాండ్ వద్ద ఆందోళన చేస్తున్న స్థానికులు, సిపిఎం, సిపిఐ నేతలు

కబేళా వద్దు.. పేదలకు ఇళ్ల స్థలాలివ్వాలి

డిస్నీల్యాండ్ వద్ద సిపిఎం, సిపిఐ ఆందోళన

ప్రజాశక్తి-అజిత్ సింగ్ నగర్ (విజయవాడ)

పేదల నివాసాల మధ్య కబేళా ఏర్పాటును నిలుపుదల చేయలని డిమాండ్ చేస్తూ ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని డిస్నీల్యాండ్ వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో గురువారం స్థానికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ డిస్నీల్యాండ్ స్థలాన్ని పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయించి వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేశారు. డిస్నీల్యాండ్ లీజు పరిమితి పూర్తయ్యిందని, 57 ఎకరాల స్థలాన్ని నగరపాలక సంస్థ స్వాధీనం చేసుకుందని తెలిపారు. ఈ స్థలంలో మాంసం ఎగుమతి కోసం పశువులను వధించడానికి కబేళాను ఏర్పాటు చేస్తున్నారని, అందుకు బడా కంపెనీలకు అవకాశం కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ అనుమతితో విజయవాడ నగరపాలక సంస్థ తీర్మానం చేసిందని చెప్పారు. కౌన్సిల్లో సిపిఎం నిరసన వ్యక్తం చేసినా లెక్కచేయకుండా కబేళా ఏర్పాటు తీర్మానాన్ని ఆమోదించారని తెలిపారు. కబేళా ఏర్పాటు వల్ల ప్రజల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తీర్మానాన్ని రద్దు చేయాలని, కబేళా ఏర్పాటును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డి కాశీనాథ్, సిపిఐ నగర నాయకులు భాస్కరరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి బి రమణరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లపై తీర్పు వాయిదా

ప్రజాశక్తి - అమరావతి

రాష్ట్రంలో పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు, పాత వాటిని మరో చోటకు మార్పుపై ఎన్నికల సంఘం మార్గదర్శకాలను అధికారులు అమలు చేయడం లేదంటూ నర్సారావుపేట టిడిపి ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందాబాబు, పత్తికొండ టిడిపి ఇన్‌చార్జ్ కేఈ శ్యాంబాబు దాఖలు చేసిన పిటిషన్లపై హైకోర్టు ప్రధానన్యాయమూర్తి ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారణ ముగించింది. తీర్పును రిజర్వులో పెడుతున్నట్లు ప్రకటించింది. రెండు కిలోమీటర్ల దూరం లోపు ఎన్నికల స్టేషన్ ఏర్పాటు చేయాలని రూల్స్ స్పష్టం చేస్తుంటే 4 నుంచి 8 కిలోమీటర్ల పరిధిలో ఏర్పాటు చేశారని పిటిషనర్ల వాదన. అలాంటి నిబంధన ఏదీ లేదని ఇసి అడ్వొకేట్ చెప్పారు. హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది.

అరెస్ట్ కక్షసాధింపే : చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే మాజీ మంత్రి ప్రత్తిపూటి పుల్లారావు కుమారుడు శరత్‌ను అరెస్ట్ చేశారని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం విడుల చేసిన ప్రకటనలో శరత్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల వేళ జగన్ కక్షసాధింపు రాజకీయాలు మరింత తీవ్రమయ్యాయని పేర్కొన్నారు. శరత్‌ను తీసుకెళ్లింది పోలీసులా? జగన్ ముఠానా? అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరో ప్రకటనలో ప్రశ్నించారు. రాజకీయంగా పుల్లారావును ధైర్యంగా ఎదుర్కొలేని జగన్ పిరికి పంద చర్యలకు దిగుతున్నారని టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు మరో ప్రకటనలో విమర్శించారు.

సంక్షేమం ఘనత జగన్‌దే

- ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి సంక్షేమాన్ని అంధించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానిదేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాసనమండలి విప్ లేళ్ళ అప్పిరెడ్డి అన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శాలివాహనలు, దేవాంగుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రతిపక్షాల దుష్ప్రచారాలను, కుట్రలను తిప్పి కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ ప్రభుత్వానికి ప్రజల్లో వస్తున్న ఆధరణను చూసి తట్టుకోలేక రాష్ట్రంలోని ప్రతిపక్షాలన్నీ అనైతిక పొత్తులతో సిఎం జగన్‌మోహన్‌రెడ్డిపై కుట్రలు చేస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలతో పాటు అగ్రవర్ణాల్లోని పేదలను ఆదుకునేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాలివాహన కార్పోరేషన్ ఛైర్మన్ మండే పూడి పురుషోత్తం, దేవాంగ కార్పోరేషన్ ఛైర్మన్ బీరక సురేంద్ర, నవరత్నాల ప్రోగ్రామ్ వైస్ ఛైర్మన్ నారాయణమూర్తి, గౌడ కార్పోరేషన్ ఛైర్మన్ మాదు శివరామకష్ణ, ఎస్‌సి కార్పోరేషన్ ఛైర్మన్ కొమ్మూరి కనకరావు మాదిగ, దేవాంగ సంఘ రాష్ట్ర అధ్యక్షులు డికె నాగరాజు, ప్రధాన కార్యదర్శి పుచ్చుల రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణం పేరుతో పేదలపై అప్పులు

- మాజీమంత్రి కెఎస్ జవహర్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇళ్ల నిర్మాణం పేరుతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదలపై భారం మోపారని మాజీ మంత్రి, టిడిపి నాయకులు కెఎస్ జవహర్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన స్థలాలు చివరకు నివాసానికి పనికిరాని సెంటు పట్టాలు ఇచ్చారని తెలిపారు. అందులో ఇల్లు కట్టుకోకుంటే వెనక్కు తీసుకుంటామని పేదల్ని బెదిరించారని, చేసేది లేక అప్పులు చేసి మరీ ఇళ్ల నిర్మాణం చేపట్టాల్సి వచ్చిందన్నారు. కేంద్రప్రభుత్వం ఇచ్చిన రూ.1.80లక్షలు తప్ప జగన్ ప్రభుత్వం పేదలకు ఒక్కరూపాయి ఇవ్వలేదని ఆరోపించారు. దీంతో ఇంటి నిర్మాణం చేపట్టిన ప్రతి కుటుంబంపై రూ.5లక్షల అప్పుల భారం పడిందన్నారు.

జెపి వెంచర్స్‌కు రూ.1240కోట్లు ధారాదత్తం: కొమ్మారెడ్డి

ఇసుక తవ్వకాల టెండర్ల ముసుగులో జగన్ ప్రభుత్వం జయప్రకాష్ వెంచర్స్(జెపి) సంస్థకు రూ.1250కోట్లు ధారాదత్తం చేసిందని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్ విమర్శించారు. 2019 సెప్టెంబర్ నుంచి 2021 మే వరకు ఎపి మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ రూ.2610కోట్ల ఇసుక అమ్మకాలు జరిపిందని జిఎస్టి ఇంటిలిజెన్స్‌కు గనులశాఖ డైరెక్టర్ వెంకటరెడ్డి లేఖ రాశారని తెలిపారు. 2021లోనే రెండేళ్ల ఇసుక తవ్వకాల టెండర్‌ను రూ.2,764కోట్లు నిర్ణయించాల్సి ఉండగా కేవలం రూ.1528కోట్లకే జెపికి కట్టబెట్టారని ఆరోపించారు. జెపి సంస్థ ఇంకా ప్రభుత్వానికి రూ.500కోట్లు బాకీ పెట్టిందని, దీనిని ఎవరు చెల్లిస్తారని నిలదీశారు.

'జెండా' విజయవంతంతో వైసిపిలో వణుకు

తాడేపల్లి గూడెంలో టిడిపి-జనసేన నిర్వహించిన ఉమ్మడి భారీ బహిరంగ సభకు వచ్చిన జనసందోహాన్ని చూసి వైసిపి నాయకులు వణుకుతున్నారని టిడిపి అధికార ప్రతినిధి నాగుల్ మీరా, పిల్లి మాణిక్యారావు, కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం అన్నారు.

టిడిపి కార్యాలయంలో గురువారం వేరువేరుగా వారు విలేకరులతో మాట్లాడారు. దెబ్బతిన్న రైతుల కోసం, యువత ఉద్యోగాల కోసం, ఛిద్రమవుతున్న పేదవారిని కాపాడేందుకు టిడిపి-జనసేన కదం తొక్కాయని అన్నారు. తమ పొత్తును విచ్ఛిన్నం చేయడానికి రకరకాల కుట్రలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

24 సీట్లతో ఏం సాధిస్తారు?

పవన్‌కు పేర్ని నాని ప్రశ్న

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్‌మోహన్‌రెడ్డిని అధఃపాతాళానికి తొక్కుతాను అంటున్న పవన్ కల్యాణ్ తెలుగుదేశం పార్టీ విసిరేసిన 24 సీట్లతో ఏమి సాదిస్తారో చెప్పాలని మాజీ మంత్రి పేర్ని నాని పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జెండా సభ పేరుతో తాడేపల్లిలోని నిర్వహించిన తెలుగుదేశం, జనసేన సభలకు ప్రజల నుండి ఎలాంటి స్పందన లేదన్నారు. ఈ సభలో మరో జెండా కోసం టిడిపి, జనసేన ఎదురు చూస్తున్నట్లుగా వుందని అన్నారు. ఈ సభలో జగన్‌మోహన్‌రెడ్డిని దూషించడం తప్ప 2014 నుండి 2019 వరకు రాష్ట్ర ప్రజలకు ఏమి చేశారో చెప్పలేక పోయారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి గురించి నాకంతా తెలుసనే బ్లాక్‌మెయిల్ రాజకీయాలను పవన్‌కల్యాణ్ మానుకోవాలని అన్నారు.

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చంద్రబాబునాయుడికి, ఆయన పార్టీకి జెండా కూలీగా మారారని బాపట్ల ఎంపి నందిగం సురేష్ విమర్శించారు. తాడేపల్లిలో ఆయన మీడియాతో మాట్లాడారు.

బిజెపిని సాగనంపితేనే దేశానికి రక్ష

(మొదటిపేజీ తరువాయి)

ధ్యేయంగా బిజెపియేతర పార్టీలు 2024 ఎన్నికల్లో పనిచేయాలన్నారు. మోడీ పాలనలో దేశంలో గణతంత్ర, లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థలు కాలరాయబడ్డాయని, వచ్చే ఎన్నికల్లో బిజెపిని దేశం నుంచి వెళ్లగొట్టి లౌకిక ప్రజాస్వామ్యన్ని నిలబెట్టినప్పుడే అంబేద్కర్ రాజ్యాంగ విలువల పరిరక్షణ జరుగుతుందని అన్నారు. రామభక్తునిగా మోడీ ప్రచారం బూటకమని, గాంధీయే నిజమైన రామభక్తుడని, అయినా గాంధీ నిర్ణయాలను ఆర్‌ఎస్‌ఎస్ నేతలు సావర్కర్ వంటివారు వ్యతిరేకించారని అన్నారు. సావర్కర్ ఆశీస్సులున్న గాడ్సేనే గాంధీని హతమార్చాడన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అనే భావనను బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌లు తిరస్కరిస్తున్నాయన్నారు. రాష్ట్రాల్లో తమకు లొంగని పార్టీలను మోడీ ఇబ్బంది పెడుతూ ఇడి, సిబిఐ నిఘా సంస్థలను ఉసిగొలుపుతోందని విమర్శించారు.

స్వరాజ్య పార్టీ జాతీయ నేత యోగేంద్రయాదవ్ మాట్లాడుతూ.. తెల్ల దొరలతో పోరాడిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాట వారసత్వాన్ని ఆంధ్రప్రజలు పుణికిపుచ్చుకుని త్వరలో జరిగే ఎన్నికల్లో మతోన్మాద కార్పొరేట్ శక్తుల నుంచి దేశాన్ని రక్షించుకోవాలన్నారు. బిజెపిని, దాన్ని బలపరిచే పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. పదేళ్లలో దేశాన్ని ఏం అభివృద్ధి చేశారో ప్రజలకు చెప్పి మోడీ ఓట్లడగడం లేదని, 50 ఏళ్లలో కాంగ్రెస్ ఏమీ చేయలేదని చెబుతూ చమత్కారంగా ప్రచారం సాగిస్తున్నారని అన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా దేశంలో 45 శాతం నిరుద్యోగం పెరిగిపోయిందని, ఉత్తరప్రదేశ్‌లో 55 వేల పోలీసు పోస్టులకు పరీక్ష నిర్వహిస్తే 45 లక్షల మంది హాజరవ్వడంతో యుపి అంతా ట్రాఫిక్ జామ్ అయిపోవడం కళ్లారా చూశానన్నారు. తీరా వారంతా పరీక్ష రాసాక పేపర్ లీకై ఆ కాస్త పరీక్ష రద్దయిపోవడం గమనిస్తే దేశంలో పరిస్థితి ఎలా ఉందో ఇట్టే అర్థమవుతుందన్నారు. కోవిడ్ కాలంలో ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారిపోగా ఒక్క అదానీ ఆస్తులే రూ.66 వేల కోట్ల నుంచి రూ.12 లక్షల కోట్లకు ఎగబాకడం గమనార్హమన్నారు. రైతులకు కనీస మద్దతు ధర విషయంలోనూ బిజెపి దగా చేస్తోందని మండిపడ్డారు. ఎపిలో టిడిపి, జనసేన, వైసిపిల్లో ఎవరికి ఓటేసినా బిజెపికేసినట్టేనని అన్నారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ.. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ వినాశకర విధానానికి విశాఖ కేంద్ర బిందువుగా నిలిచిందని తెలిపారు. స్టీల్‌ప్లాంట్‌ను లేకుండా చేయాలని చూస్తున్నారన్నారు. రైల్వేజోన్ ఇవ్వకుండా చేశారన్నారు. వికసిత్ భారత్ నిర్మాణం కాకుండా విషాద భారత్‌ను మోడీ నిర్మిస్తున్నారని అన్నారు. సిపిఐ నాయకులు జెవి.సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని మోడీ డొల్లగా మారుస్తున్నారని విమర్శించారు. ప్రత్యేక హోదా సాధన సమితి కన్వీనర్ చలసాని శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రత్యేక హోదా, విభజన హామీలు ముగిసిన అధ్యాయం కాదన్నారు. కేంద్రంతో పొత్తు కోసం టిడిపి, జనసేన వెంపర్లాడడం తగదన్నారు. జై భారత్ పార్టీ నాయకులు వివి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. ఇటీవల మోడీ ద్వారకా సముద్ర గర్భంలోకి వెళ్లినట్లు చూశానని, బంగాళాఖాతంలోకే వెళ్లాలని ఎద్దేవా చేశారు. సదస్సులో మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, కిల్లో సురేంద్ర, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.రమేష్, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కన్వీనర్ ఎ.అజశర్మ, ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేషు, భారత్ బచావో సంస్థ కన్వీనర్ గూడూరు సీతామహాలక్ష్మి పాల్గొన్నారు. సదస్సులో రాజ్యాంగాన్ని రక్షించాలంటూ సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు తీర్మానం ప్రవేశపెట్టగా సదస్సు ఏకగ్రీవంగాఆమోదించింది.



సదస్సులో మాట్లాడుతున్న మణిశంకర్ అయ్యర్, వేదికపై వడ్డే శోభనాద్రీశ్వరరావు, యోగేంద్ర యాదవ్, విజయరావు, లక్ష్మీనారాయణ, వి.శ్రీనివాసరావు, చలసాని శ్రీనివాసరావు తదితరులు

ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకుందాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించిన ప్రభుత్వ రంగ సంస్థలను పోరాటాలతో ప్రజలే కాపాడుకోవాల్సి ఉందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 1113వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఎస్‌ఎంఎస్-2 విభాగానికి చెందిన ఉద్యోగులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్ డి.ఆదినారాయణ, నాయకులు డిసిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడారు. నియంతృత్వ పోకడలతో వెళ్తున్న బిజెపిని ఎన్నికల్లో భూస్థాపితం చేయడం ద్వారా ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించుకోవచ్చన్నారు. భవిష్యత్తు తరాలకు విశాఖ ఉక్కు పరిశ్రమ వంటి విలువైన సంపదను అందించడానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని కోరారు.

ఎన్నికలకు 465 కంపెనీల బలగాలు

- సిఎపిఎఫ్ సిబ్బంది కావాలని కోరిన సిఎస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

త్వరలో జరగనున్న పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాట్ల కోసం రాష్ట్రానికి 465 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ (సిఎపిఎఫ్) బలగాలు అవసరమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి కోరారు. గురువారం ఢిల్లీ నుండి కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ కుమార్ భల్లా నిర్వహించిన సమీక్ష సమావేశంలో జవహర్‌రెడ్డి మాట్లాడారు. అలాగే 58 కంపెనీల స్పెషల్ ఆర్మ్‌డ్ ఫోర్స్(ఎస్‌ఎపి) బలగాలు కూడా అవసరం ఉంటుందని పేర్కొన్నారు. ఎస్‌ఎపికు సంబంధించి ప్రస్తుతం 32 బలగాలు మాత్రమే ఉన్నాయని, మరో 26 అదనంగా పంపించాలని కోరారు. ఈ సమావేశంలో చీఫ్ ఎలక్టోరల్ అధికారి ముఖేష్ కుమార్‌మీనా, హోంశాఖ కార్యదర్శి హరీష్‌కుమార్ గుప్త, అదనపు డిజిపి అతుల్‌సింగ్, ఎస్‌ఐబి డైరెక్టర్ ఎం.రవిప్రకాష్ పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు సురేష్

భూ యాజమాన్య హక్కుల చట్టంపై పోరాటం : సురేష్

- 2న గుంటూరులో రాష్ట్ర స్థాయి మహాసభ

ప్రజాశక్తి-గుంటూరు లీగల్

రాష్ట్ర ప్రభుత్వం జిఒ 512 ద్వారా తెచ్చిన ఎపి భూ యాజమాన్య హక్కుల చట్టం-2023ను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈ నెల 2న రాష్ట్ర స్థాయి మహాసభ నిర్వహిస్తున్నట్లు గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కె.వి.కె.సురేష్ తెలిపారు. ఈ మేరకు గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుంటూరు బార్ అసోసియేషన్ హాల్‌లో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. భూ యాజమాన్య హక్కుల చట్టాన్ని రద్దు చేసే వరకూ సమిష్టి ఉద్యమం చేపడతామని తెలిపారు. ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం ప్రకారం భూములు, నివాస స్థలాలు, భవనాలు, తదితర అన్ని రకాల స్థిరాస్తులపై హక్కులను రెవెన్యూ అధికారులు నిర్ధారిస్తారని, వారి తీర్పులపై అప్పీలు కూడా రెవెన్యూ పరిధిలోని జాయింట్ కలెక్టర్‌కు అప్పజెప్పారన్నారు. వారి తీర్పులపై హైకోర్టుకు మాత్రమే వెళ్లగలరని, జిల్లా కోర్టులకుగానీ, క్రింది కోర్టులకుగానీ ఆ తీర్పులలో జోక్యం చేసుకునే హక్కు లేదని తెలిపారు. కోర్టులకు వెళ్లాలంటే రెవెన్యూ టైటిలింగ్ ఆఫీసర్ సర్టిఫికేట్ ఇవ్వాలని, లేకుంటే దావా చెల్లదన్నారు. వారసత్వ హక్కుల నిర్ధారణ కూడా రెవెన్యూ వారికే అప్పజెప్పారని, ఈ చట్టం యాజమాన్య హక్కులకు అత్యంత ప్రమాదకరమని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఒక బలమైన ఉద్యమాన్ని నిర్మించటానికి మహాసభలో చర్చించడం జరుగుతుందని, అన్ని బార్ అసోసియేషన్ల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఉద్యమ కమిటీ సభ్యులు ఎన్.రామ్మోహన్‌రావు, బార్‌కౌన్సిల్ సభ్యులు ఎస్.బ్రహ్మానందరెడ్డి, సీనియర్ న్యాయవాదులు చిగురుపాటి రావీంద్రబాబు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు శంకరరావు పాల్గొన్నారు.

'అద్దె' కట్టని సచివాలయం

- సిఆర్‌డిఏకు రూ. 200 కోట్లపైనే బకాయి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

సిఆర్‌డిఎకు రాష్ట్ర సచివాలయం భారీగా అద్దె బకాయిలను చెల్లించాల్సిఉంది. వందల కోట్ల రూపాయల ఉన్న ఈ బకాయిల వసూలు కోసం సిఆర్‌డిఎ అధికారులు లేఖలుమీద లేఖలు రాసినా, సచివాలయం చుట్టూ తిరిగినా ఫలితం ఉండటం లేదు. దీంతో దిక్కుతోచని స్థితిలో వారు పడిపోయారు.

ప్రతి నెలా లేఖలు రాస్తున్నామని సిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారు. అద్దెతో పాటు సచివాలయంలో నిర్వహణ, పచ్చదనం అభివృద్ధి వంటి వాటికి కూడా నిధులు ఇవ్వడం లేదని సమాచారం. వెలగపూడిలో సిఆర్‌డిఏ ఆధ్వర్యంలో నిర్మించిన భవనాన్ని తాత్కాలిక సచివాలయంగా వాడుకోవాలని టిడిపి ప్రభుత్వ హయంలో నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఇక్కడ ఐదు పెద్ద భవనాలను సిఆర్‌డిఎ నిర్మించగా, వాటిల్లో ఒక దానిని రాష్ట్ర శాసనసభ, శాసనమండలికి కేటాయించారు. ఇప్పటికీ ఈ భవనాలు క్రిడా ఆధీనంలోనే ఉన్నాయి.

ఈ ఆరు భవనాలను సాధారణ పరిపాలన శాఖకు లీజు పద్ధతిపై ఇస్తూ గతంలోనే ఒప్పందం కూడా జరిగింది. తీసుకున్న రుణాలపై 112 కోట్ల రూపాయలను నెల వారీ వడ్డీల కోసం చెల్లించాల్సి ఉంది. అలాగే హడ్కో నుంచి తీసుకున్న రుణాలకోసం 117 కోట్లు, అమరావతి బ్యాండ్ల త్రైమాసిక చెల్లింపులకు 580 కోట్లు, కోర్టు కేసులకు చెల్లించాల్సినది ఐదు కోట్లు కలిపి మొత్తం 815 కోట్లు కావాల్సి ఉంటుందని ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇందులో 244 కోట్లు మాత్రమే అందుబాటులో ఉండగా, ఇంకా 570 కోట్ల వరకు నిధులు ప్రభుత్వం నుంచి రావాల్సిఉందని సిఆర్‌డి అధికారులు కోరుతున్నారు. ఈ పరిస్థితుల్లోనే సచివాలయ భవనాల అద్దె ద్వారా రావాల్సిన నిధులను వెంటనే ఇవ్వాలని కోరుతున్నారు. ఇలా రావాల్సిన నిధులు దాదాపు రెండు వంద కోట్ల వరకు ఉంటాయని ఒక క్రిడా అధికారి వెల్లడించారు. ఇవి కాకుండా గ్రీనరీ, నిర్వహణ వ్యయానికి ఏటా 15 కోట్ల వరకు ఖర్చు అవుతోందని, ఈ మొత్తంలో కూడా భారీగా బకాయిలు ఉన్నాయని ఆయన వ్యాఖ్యానించారు.

ఇప్పట్లో వచ్చే అవకాశాలు లేనట్టే

సిఆర్‌డిఎకు సంస్థకు ఒక ఐఎఎస్ అధికారి కమిషనర్ ఉంటారు. అతనిపై మున్సిపల్ శాఖకు స్పెషల్ చీఫ్ సెక్రటరీ, అతనిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉంటారు. దీంతో కేవలం నిధులను కోరడమే తప్ప గట్టిగా అడిగే అవకాశాలు లేవని ఒక అధికారి వ్యాఖ్యానించారు. అందుకే ఏళ్ల తరబడి లీజు నిధులు రావడం లేదని కూడా పేర్కొన్నారు.

మార్చిలోపు పన్ను బకాయి కడితే వడ్డీ రాయితీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పట్టణాల పరిధిలో ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను, బకాయిలు ఈ ఏడాది మార్చి లోపు చెల్లిస్తే వడ్డీ రాయితీ ఇవ్వనున్నట్లు రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ ప్రకటించింది. ఈ మేరకు గురువారం ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. దీని ప్రకారం 31 మార్చి 2024 లోపు ఒకేసారి గానీ, విడతల వారీగా గానీ ఆస్తి పన్ను మొత్తం చెల్లించిన వారికి వడ్డీ రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. గతంలోనే పన్ను వడ్డీతో సహా చెల్లించి ఉంటే తరువాత వచ్చే పన్నులో మినహాయింపు ఉంటుందన్నారు. రిఫండ్ చేయబోమనీ స్పష్టం చేశారు. కోవిడ్ ఇబ్బందుల అనంతరం పలువురు నుండి వచ్చిన విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేషన్‌దారులకు రాగిపిండి

- కేజీ చొప్పున నేటి నుంచి పంపిణీ
- ప్యాకెట్ ధర రూ.11గా నిర్ణయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

తెల్లరేషన్ కార్డుదారులకు ఈ నెల నుంచి రాగిపిండి పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. తొలుత రాయలసీమలోని ఐదు జిల్లాలతో పాటు ఉత్తరాంధ్రలోని మూడు జిల్లాల్లోని లబ్ధిదారులకు ఇవ్వనుంది. ఇప్పటివరకు రాయలసీమలోని ఐదు జిల్లాల్లో కార్డుదారునికి ఐదు కేజీల చొప్పున రాగులను పంపిణీ చేసింది. రాగులు నాసిరకంగా ఉండటం, వినియోగానికి పనికిరావంటూ లబ్ధిదారులు ఆసక్తి చూపకపోవడంతో వాటిని పిండిగా మార్చి ప్యాకెట్ల రూపంలో అందించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. కేజీ ప్యాకెట్‌ను రూ.11గా ధర నిర్ణయించింది. అందుకనుగుణంగా ఎనిమిది జిల్లాలకు సంబంధించి మొత్తం 2,390 మెట్రిక్ టన్నులను కేటాయించింది. రాగిపిండి వాడకంపై ప్రజల్లో స్పందన బట్టి రాయలసీమ, ఉత్తరాంధ్రలోని మిగిలిన జిల్లాలకు సరఫరా చేయనున్నట్లు సమాచారం. అన్ని జిల్లాలకు రాగి పిండి సరఫరా బాధ్యతలను విజయనగరం జిల్లాకు చెందిన విజయనగరం వీట్ ప్రాడక్ట్స్ ప్రయివేట్ లిమిటెడ్‌కు అప్పగించింది. రాగులను పిండిగా మార్చడం, వాటికి కేజీ ప్యాకెట్లు, 50 కేజీల బస్తాలుగా తయారు చేసి ఇవ్వడానికి మెట్రిక్ టన్నుకు రూ.10,500 ప్రభుత్వం చెల్లిస్తోంది.

కందిపప్పు లేనట్టే!

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌లో ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుదారులకు గతేడాది జూన్ నుంచి నవంబరు వరకు రాయితీ కందిపప్పు నిలిపివేశారు. గతేడాది డిసెంబరులో అరకొరగా సరఫరా చేయగా, సంక్రాంతి పండగ నేపథ్యంలో ఈ ఏడాది జనవరిలో మాత్రం పూర్తిస్థాయిలో కార్డుదారులకు పంపిణీ చేశారు. ఫిబ్రవరిలో అరకొరగా ఇచ్చారు. మార్చి నెలకు సంబంధించి ప్రభుత్వం కేటాయింపులు జరపలేదని తెలుస్తోంది.

జిల్లాల వారిగా రాగి పిండి కేటాయింపులు

జిల్లా	కేటాయింపులు మెట్రిక్ టన్నుల్లో
అన్నమయ్య	200
చిత్తూరు	255
తిరుపతి	295
అనంతపురం	280
కర్నూలు	275
శ్రీకాకుళం	405
అనకాపల్లి	330
విజయనగరం	350
మొత్తం	2,390



మాజీ మంత్రి ప్రత్తిపాటి కుమారుడి అరెస్ట్

- జిఎస్‌టి ఎగవేత ఆరోపణలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

జిఎస్‌టి ఎగవేత కేసులో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కుమారుడు శరత్‌ను విజయవాడలోని మాచవరం పోలీసులు గురువారం హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. దాదాపు రూ.8 కోట్లు జిఎస్‌టి చెల్లించకుండా అవకతవకలకు పాల్పడినట్టు డైరెక్టర్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డిఆర్‌ఐ) అధికారులు ఏడాది క్రితమే గుర్తించారు. ఈ మేరకు ఇటీవల మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిర్మాణ రంగంలో సబ్ కాంట్రాక్టర్‌గా ఉన్న శరత్.. మెటీరియల్ కొనుగోలుకు సంబంధించి జిఎస్‌టి చెల్లించలేదని డిఆర్‌ఐ అధికారులు ఫిర్యాదులో పేర్కొన్నారు. శరత్‌కు చెందిన అవెక్సా కంపెనీకి సంబంధించి గత కొంత కాలంగా జిఎస్‌టి చెల్లించడం లేదు. పలుమార్లు అధికారులు నోటీసులు జారీ చేశారు. తగిన స్పందన లేకపోవడంతో రాష్ట్ర జిఎస్‌టి అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, ఎటువంటి నోటీసులు లేకుండా విచారణ పేరుతో శరత్‌ను అక్రమంగా అరెస్టు చేశారని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు ఆరోపించారు. తన కుమారుడు ఆ కంపెనీలో డైరెక్టర్ కాదన్నారు. తనకు చిలకలూరిపేట సీటు ఖరారైన రోజే తన కుమారుడిపై కేసు నమోదు చేశారని, కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. శరత్ అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి కార్యకర్తలు చిలకలూరిపేటలో నిరసన చేపట్టారు. జాతీయ రహదారిపై ధర్నా చేశారు. వెంటనే శరత్‌ను విడుదల చేయాలని నినాదాలు చేశారు.

టిడిపికి అశోకరాజు రాజీనామా

ప్రజాశక్తి-తిరుపతి (మంగళం)

1983 నుంచి టిడిపికి విధేయుడిగా ఉన్నానని, పలుమార్లు నగరి నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని ఇస్తానని ఆశ చూపిన అధిష్టానం... ఈ సారీ ప్రజావ్యతిరేకత ఉన్న గాలి భానుప్రకాష్‌కు టికెట్టు కట్టబెట్టడంతో అసంతృప్తితో తెలుగుదేశం కార్యనిర్వాహక కార్యదర్శి బాధ్యతకు రాజీనామా చేస్తున్నానని పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కొండూరు అశోక రాజు ప్రకటించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభ్యర్థిత్వాన్ని ఇస్తానని ప్రకటించినప్పుడల్లా ఎవరో ఒకరికి టికెట్ కట్టబెట్టడం జరుగుతోందని, 2019లో చివరి నిమిషంలో గాలి భానుప్రకాష్‌కు టికెట్ కేటాయించారన్నారు. రాజీనామాకు గల కారణాలను పూర్తి వివరాలతో పార్టీ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుకు పంపుతానని,ఏ పార్టీలో చేరేది వారంలో స్పష్టం చేస్తానని తెలిపారు.

'మీ నిర్ణయాలు మీ చేతుల్లో ఉండవు'

- ఎన్నో చోట్ల అనుమతులు తీసుకోవాలి
- పవన్‌కల్యాణ్‌కు రాసిన లేఖలో ముద్రగడ ఘాటైన వ్యాఖ్యలు

ప్రజాశక్తి - కిర్లంపూడి(కాకినాడ జిల్లా)



'మీ నిర్ణయాలు మీ చేతుల్లో ఉండవు.. ఎన్నో చోట్ల పర్మిషన్లు తీసుకోవాలి' అంటూ జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌పై కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఘాటు విమర్శలు చేశారు. ఈ మేరకు జనసేనానికి ఆయన గురువారం బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖను మీడియాకు విడుదల చేశారు. ఏ కోరికలూ లేకుండా పవన్‌తో ప్రయాణం చేయడానికి సిద్ధపడ్డానని, పలుమార్లు కిర్లంపూడి వస్తానని చెప్పి రాకపోవడానికి కొందరు అనుమతులు ఇవ్వకపోవడమేనని ముద్రగడ లేఖలో పేర్కొన్నారు. అన్ని వర్గాల ప్రజలకు మేలు చేకూర్చాలని, పార్టీని ముందుకు తీసుకెళ్లడానికి తన వంతు కృషి చేయడానికి, ఎటువంటి ఫలితం ఆశించకుండా కలిసి సేవచేయడానికి జనసేనలో చేరాలని అనుకున్నానన్నారు. చంద్రబాబు జైల్లో ఉన్నప్పుడు టిడిపి కేడర్ భయపడి ఇళ్లకే పరిమితమైందని తెలిపారు. ఆ సమయంలో జైలుకు వెళ్లి వారికి భరోసా ఇవ్వడమనేది సామాన్యమైన విషయం కాదన్నారు. రాష్ట్ర ప్రజలు జనసేనను ఉన్నత స్థానంలో చూడాలని కోరుకుంటున్నారని తెలిపారు. పొత్తులో భాగంగా 80 సీట్లు, రెండేళ్లపాటు సిఎం పదవిని కోరి ఉంటే బాగుండేదని అభిప్రాయపడ్డారు. పవన్ ఆ సాహసం చేయలేకపోవడం బాధాకరమని లేఖలో వివరించారు. మీలాగ గ్లామర్ ఉన్న వాడిని కాకపోవడం, ప్రజల్లో పరపతి లేనివాడిని అవ్వడం వల్లే పవన్ దష్టిలో తాను లాస్ట్ గ్రేడ్ వ్యక్తిగా... తుప్పు పట్టిన ఇనుము లాంటి వాడిగా ఉండిపోయాను అని తెలిపారు. జనసేన పోటీ చేసే 24 మంది కోసం తన అవసరం రాదని, రాకూడదని భగవంతుని ప్రార్థిస్తున్నాను అంటూ ముద్రగడ లేఖలో పేర్కొన్నారు.



కొండపిలో పొగాకు వేలం నిర్వహిస్తున్న అధికారులు

గరిష్ఠ ధర రూ.250

- పొగాకు రైతుల్లో నిరాశ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

ఒంగోలు, కొండపి కేంద్రాల్లో పొగాకు కొనుగోలు వేలం ప్రక్రియ గురువారం ప్రారంభమైంది. రెండు కేంద్రాల్లో 18 బేళ్ల చొప్పున అమ్మకాలకు పెట్టారు. కిలో రూ.260తో బోర్డు అధికారులు వేలం మొదలుపెట్టారు. ఒంగోలు కేంద్రంలో కిలోకు రూ.250 గరిష్ఠ ధర ఇవ్వగా కనిష్ఠ ధర రూ.230 ఇచ్చారు. కొండపి కేంద్రంలో 18 బేళ్లకూ ఒకటే ధర రూ.230 ఇచ్చారు. ఈ ధరలను చూసి రైతులు తీవ్ర నిరాశకు గురయ్యారు.. కిలోకు రూ.300 వస్తే పెట్టుబడులైనా వస్తాయని భావించారు. గతేడాది పలికిన గరిష్ఠ ధర కిలో రూ.289తో ఈ ఏడాది వేలం ప్రారంభం కాలేదని, గిట్టుబాటు ధర కల్పనకు టుబాకో బోర్డు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నేడు తిరుపతిలో కాంగ్రెస్ సభ

- హోదాపై డిక్లరేషన్ ప్రకటించనున్న వైఎస్ షర్మిల
- సిపిఐ, సిపిఎం నేతలు నారాయణ, గఫూర్ హాజరు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి తారకరామ స్టేడియం వేదికగా కాంగ్రెస్ ఎన్నికల రెండో సభ నిర్వహించనుంది. పిసిసి చీఫ్ వైఎస్ షర్మిల, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్, రాష్ట్ర నాయకులు తులసిరెడ్డి హాజరుకానున్నారు. సంఘీభావంగా సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ హాజరై ప్రసంగించనున్నారు 2014 ఎన్నికలకు ముందు ఇదే తారకరామ స్టేడియంలో తమను గెలిపిస్తే ఎపికి ఐదేళ్లు కాదు, పదేళ్లు హోదా కల్పిస్తాం అని ప్రతిపక్ష హోదాలో ప్రధానమంత్రి అభ్యర్థిగా నరేంద్ర మోడీ శ్రీవారి సాక్షిగా ప్రకటించారు. తాము అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాతో పాటు, రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ, సిఆర్‌ఎస్ అభివృద్ధి, తిరుపతి రైల్వేస్టేషన్‌ను అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి, కడపకు ఉక్కు పరిశ్రమ, చిత్తూరు జిల్లా ఎస్‌ఆర్‌పురం మండలంలో మిలటరీ ఆయుధాల తయారీ పరిశ్రమ నెలకొల్పుతామని, మన్నవరంలో భెల్ ఫ్యాక్టరీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. అదే సభలో ఇప్పటి ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉన్నారు. 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అదే వేదికను కాంగ్రెస్ ఎంచుకుంది. ఈ వేదిక నుంచి ఎపికి ప్రత్యేక హోదా డిక్లరేషన్‌ను వైఎస్ షర్మిల ప్రకటించనున్నారు. కడప, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, తిరుపతి జిల్లాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు ఈ సమావేశానికి తరలి రానున్నాయి.

వైసిపిలోకి ఇంతియాజ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



విఆర్‌ఎస్ తీసుకున్న ఐఎఎస్ అధికారి ఎఎండి ఇంతియాజ్ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. గురువారం తాడేపల్లిలోని సిఎం క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపి కండువా కప్పుకున్నారు. సెర్ప్ సిఇఒగా, మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శిగా, సిసిఎల్ఎ జాయింట్ సెక్రటరిగా వున్న ఇంతియాజ్ బుదవారం విఆర్‌ఎస్ తీసుకున్నారు. ఆయనకు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ టికెట్‌ను వైసిపి ఇవ్వనుందని సమాచారం. కర్నూలు జిల్లా కోడుమూరుకు చెందిన ఇంతియాజ్ కర్నూలు నగరంలోని ప్రముఖ వైద్యులు డాక్టర్ ఇస్మాయిల్ కూతురును వివాహం చేసుకున్నారు. కర్నూలు నగరంలోని ముస్లిం మైనార్టీలలో మంచి డాక్టర్‌గా గుర్తింపు పొందిన డాక్టర్ ఇస్మాయిల్‌కు వున్న ఇమేజ్ ఇంతియాజ్‌కు గెలుపునకు సహకరిస్తుందని వైసిపి భావిస్తున్నట్లు సమాచారం, కర్నూలు అసెంబ్లీ స్థానానికి సిట్టింగ్ ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డి వీరిద్దరిలో ఎవరికి టికెట్ ఇచ్చినా మరొకరు సహకరించరని మద్యేమార్గంగా వైసిపి అధిష్టానం ఇంతియాజ్‌ను రంగంలోకి దించినట్లు తెలిసింది. ఈ చేరిక కార్యక్రమంలో వైసిపి రీజనల్ కోఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్, వైసిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు, మేయర్ బివై రామయ్య, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వి మోహన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

టిడిపి, జనసేన సభ అట్టర్ ఫ్లాప్

- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

టిడిపి, జనసేన కలిసి తాడేపల్లిగూడెంలో నిర్వహించిన బహిరంగ సభ అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మంత్రి అంబటి రాంబాబు విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ.. తాడేపల్లిగూడెంలో జరిగింది జెండాల సభ తప్పితే రాజకీయ సభ కాదన్నారు. రాజకీయాలకు పనికిరాని అసమర్థుడు పవన్‌కల్యాణ్ అని విమర్శించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదన్నారు. పవన్‌కల్యాణ్ నాలుగో పెళ్లాం నాదెండ్ల మనోహర్ అంటూ ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు, తెలుగుదేశం పార్టీకి పవర్ స్టార్లు కావాలని, తమ వైసిపి నాయకులకు ఏకైక స్టార్ జగనే అని అన్నారు. స్కిల్ స్కామ్ కేసులో చంద్రబాబు జైలుకు వెళితే విలపించారని, ముద్రగడను టిడిపి ప్రభుత్వ హయాంలో చంద్రబాబు వేధించినప్పుడు బాధ వేయలేదా? అంటూ పవన్‌కల్యాణ్‌ను ప్రశ్నించారు. వంగవీటి రంగాను దారుణంగా హత్య చేసినప్పుడు బాధ కలగలేదా? అంటూ నిలదీశారు. టిడిపి, జనసేన కలిసి ఎన్ని కుతంత్రాలు పన్నినా 2024లో వైసిపి 175కి 175 సీట్లు గెలిచి మళ్లీ జగనే సిఎం అవుతారని జోష్యం చెప్పారు.

జైభీమ్ పార్టీలో చేరిన దస్తగిరి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివేకానంద రెడ్డి హత్యకేసులో నిందితుడు అనంతరం అప్రూవర్‌గా మారిన దస్తగిరి గురువారం జైభీమ్ భారత్ పార్టీలో చేరారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జడ శ్రావణ్‌కుమార్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాబోయే ఎన్నికల్లో పులివెందుల నుండి పోటీచేస్తానని ప్రకటించారు. ఇప్పటికే జగన్‌పై పోటీచేస్తానని దస్తగిరి ప్రకటించిన విషయం తెలిసిందే. పార్టీలో చేరిన అనంతరం జైభీమ్ భారత్ పార్టీ తరుపున పులివెందల అభ్యర్థిగా దస్తగిరిని శ్రావణ్‌కుమార్ ప్రకటించారు.



దీక్షలను ఉద్దేశించి మాట్లాడుతున్న బాలదేవ్

ఉద్యోగ భద్రత కల్పించండి

- ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయుల నిరసన దీక్ష

ప్రజాశక్తి - పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా)

తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ మాతృభాష ఉపాధ్యాయులు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఎ ఎదుట గురువారం నిరసన దీక్షలు చేపట్టారు. మాతృభాష ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో తలపెట్టిన ఈ దీక్షలను ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ ప్రారంభించి మాట్లాడారు. మాతృభాష ఉపాధ్యాయులను ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలకు రెన్యువల్ చేసి, 2024-25 విద్యా సంవత్సరంలో యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాదీ గిరిజన ప్రాంతంలోని పాఠశాలలకు సరిపడా బడ్జెట్ కేటాయింపులు చేయాలని, టైమ్ స్కేల్ వేతనం రూ.32 వేలు అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. దీక్షలు ఈ నెల 6వ తేదీ వరకూ కొనసాగుతాయని, అప్పటికీ ప్రభుత్వం, ఐటిడిఎ స్పందించకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాతృభాష ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు చిట్టిబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కొండబాబు, చిన్నమ్మి, కృష్ణ, నూకరాజు, సత్యవతి పాల్గొన్నారు.

వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్

- సింహగర్జన సభలో కోటేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

ఐదు శాతం రిజర్వేషన్ పక్కాగా అమలు చేయాలని వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గోనగుంట్ల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. వికలాంగుల సింహగర్జన సభను గురువారం కర్నూలులోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో నిర్వహించారు. ఆ సంఘం జెఎసి జిల్లా చైర్మన్ ఎల్లప్ప అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి దక్షిణాది రాష్ట్రాల విభిన్న ప్రతిభావంతుల ఐక్యవేదిక నాయకులు శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ విభిన్న ప్రతిభావంతుల విభాగం రాష్ట్ర అధ్యక్షులు జోసఫ్ సునీల్ కుమార్, జిల్లా జెఎసి అధ్యక్షులు బిసి నాగరాజు, మల్లెల గ్రూపుల అధినేత ఆల్ఫ్రెడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమానికి వైసిపి ప్రభుత్వం తూట్లు పొడిచిందని, ఇప్పటి వరకు ఏ ఒక్క వికలాంగునికి ట్రై సైకిల్స్ కానీ మోటార్ వెహికల్స్ కానీ పంపిణీ చేయలేదన్నారు. పెన్షన్‌ను రూ.3,000 నుంచి రూ. 6,000కు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను రిజర్వేషన్ ప్రకారం వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విభిన్న ప్రతిభావంతుల చట్టాన్ని అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని విమర్శించారు.



ధర్నా చేస్తున్న విద్యార్థులు, నాయకులు

విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టరేట్ వద్ద గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం ఐటిడిఎ పరిధిలో విద్యార్థుల మరణాల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కలెక్టరేట్ వద్ద గిరిజన విద్యార్థులు ధర్నా నిర్వహించారు. అంతకుముందు పార్వతీపురం ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. తక్షణమే విద్యార్థుల మరణాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గిరిజన సంక్షేమ సంఘం, ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం చేపట్టారు. గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రంజిత్ కుమార్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి హెచ్ సింహాచలం మాట్లాడుతూ.. వారం రోజుల్లో నలుగురు గిరిజన విద్యార్థులు మృతి చెందారని, తక్షణమే విద్యార్థుల మరణాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన గిరిజన విద్యార్థుల కుటుంబాలకు రూ.10 లక్షలు చొప్పున పరిహారం చెల్లించాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు, కళాశాల వసతి గృహాల్లో ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని నియమించాలని కోరారు. అనంతరం కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది నియామకం, నష్టపరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిస్తామని హామీ ఇచ్చారు.

గుంటూరు ప్లాంట్‌లో ఇక మసాలాల తయారీ

రూ.30 కోట్ల పెట్టుబడులు ● ఎంటిఆర్ సిఇఒ సంజయ్ బాసిన్ వెల్లడి

హైదరాబాద్: గడిచిన మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో రూ.100 కోట్ల పెట్టుబడుల వ్యయం చేశామని ప్రముఖ మాసాల ఉత్పత్తుల కంపెనీ ఎంటిఆర్ తెలిపింది. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంటిఆర్ సిఇఒ సునయ్ బాసిన్ మాట్లాడుతూ.. తమ సంస్థ 100 ఏళ్ల వార్షికోత్సవం జరుపుకుంటుందని అన్నారు. గుంటూరులోని తమ ప్లాంట్‌లో ప్రస్తుతం మిర్చీ ఉత్పత్తులను తయారు చేస్తున్నామన్నారు. ఇకపై మసాల ఉత్పత్తుల తయారీని కూడా చేపట్టనున్నామన్నారు. ఇందుకోసం రూ.30 కోట్ల పెట్టుబడి వ్యయం చేయనున్నామన్నారు. తమ పోర్టుపోలియోలో 145 ఉత్పత్తులు ఉన్నాయని.. మరికొన్నిటినీ జోడించనున్నామని తెలిపారు. తమ మాతృసంస్థ ఓర్క్లా 42 దేశాల్లో కార్యకలాపాలు కలిగి ఉందని.. 11 ఫ్యాక్టరీలు, 3వేల పైగా ఉద్యోగులను కలిగి ఉందన్నారు. ఓర్క్లా కింద ఎంటిఆర్, ఈస్టర్న్, ఇంటర్నేషనల్ బిజినెస్ యూనిట్లలో 12 పోర్టుపోలియే కంపెనీలను కలిగి ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 1.5 లక్షల అవుట్‌లెట్లలో తమ ఎంటిఆర్ ఉత్పత్తులు లభ్యమవుతాయన్నారు.



రిలయన్స్, డిస్నీ మధ్య కుదిరిన ఒప్పందం

- రూ.70వేల కోట్ల విలువ

న్యూఢిల్లీ : భారత్‌లో తమ మీడియా వ్యాపార కార్యకలాపాలను విలీనం చేయనున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్, అమెరికాకు చెందిన వాల్ట్ డిస్నీ కంపెనీలు సంయుక్తంగా వెల్లడించాయి. విలీన సంస్థ విలువ దాదాపు రూ.70వేల కోట్లు (8.5 బిలియన్ డాలర్లు)గా ఉంటుందని అంచనా. విలీన ఒప్పందాలనూ ఇరు సంస్థలు ప్రకటించాయి. కొత్త కంపెనీలో రిలయన్స్, దాని అనుబంధ సంస్థలకు 63.16 శాతం మెజారిటీ వాటా ఉంటుంది. డిస్నీకి మిగతా 36.84 శాతం వాటా ఉంటుంది. ఇందులో రెండు స్ట్రీమింగ్ సర్వీసులు, 120 టెలివిజన్ చానల్స్ ప్రసారం కానున్నాయి. వీటి విలీనంతో దేశంలోనే అతిపెద్ద ఒటిటి సంస్థగా ఏర్పాడనుంది. కొత్త సంస్థకు ముకేష్ అంబానీ భార్య నీతా అంబానీ ఛైర్‌పర్సన్‌గా ఉంటారు. డిస్నీ మాజీ ఉన్నతోద్యోగి ఉదయ్ శంకర్ వైస్ ఛైర్మన్‌గా ఉండాలని ఇరు సంస్థలు అంగీకారానికి వచ్చాయి. కొత్త సంస్థలో రిలయన్స్ రూ.11,500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది.

పేటియంలో సాఫ్ట్‌బ్యాంక్ మరో 2% వాటాల విక్రయం

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియంకు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే ఆర్‌బిఐ ఆంక్షలను ఎదుర్కొంటున్న పేటియం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్‌లో ఇటీవల జపాన్‌కు చెందిన పెట్టుబడుల సంస్థ సాఫ్ట్‌బ్యాంక్ కొన్ని వాటాలను విక్రయించడం గమనార్హం. గత నెల రోజుల్లో ఓపెన్ మార్కెట్ ద్వారా దాదాపు 1.37 కోట్ల షేర్లను అమ్మేసినట్లు గురువారం రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. దీంతో పేటీఎం మాతసంస్థ వన్97 కమ్యూనికేషన్స్‌లో ఆ కంపెనీ వాటా 5.01 శాతం నుంచి 2.83 శాతానికి తగ్గింది. 2022 సెప్టెంబరు నాటికి పేటియంలో సాఫ్ట్‌బ్యాంక్‌కు 17.5 శాతం వాటా ఉండేది. అప్పటినుంచి పలుమార్లు తమ వాటాలను విక్రయిస్తూ వచ్చిన సాఫ్ట్‌బ్యాంక్.. చివరిసారిగా జనవరి 24న మరో రెండు శాతం వాటాలను ఉపసంహరించుకుంది. గతేడాది వారెన్ బఫెట్‌కు చెందిన బెర్క్‌షైర్ హాత్‌వే, అలీబాబా గ్రూప్ వంటి అంతర్జాతీయ సంస్థలు పేటియం నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.

ఒప్పో నుంచి ఎఫ్25 ప్రో 5జి

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ ఒప్పో మధ్య స్థాయి 5జి సెగ్మెంట్‌లో ఎఫ్25 ప్రో 5జిని విడుదల చేసింది. దీని ప్రారంభ ధరను రూ.23,999గా నిర్ణయించింది. 6.7 అంగుళాల అమోలెడ్ డిస్ప్లే కలిగిన ఈ ఫోన్ 64 మెగా ఫిక్సల్ ప్రధాన కెమెరాతో ఆవిష్కరించింది. బ్లూ, లావా రెడ్ రంగుల్లో తయారు చేసిన ఈ ఫోన్ మార్చి 5 నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో అమ్మకాలను ప్రారంభించనున్నట్లు తెలిపింది.

ఎఐతో కొలువులకు దెబ్బ

- ఇన్ఫోసిస్ డెలివరీ కో హెడ్ వ్యాఖ్యలు

బెంగళూరు : కృత్రిమ మేధా (ఎఐ)తో ఉద్యోగాలు పోతాయని ఇన్ఫోసిస్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ సతీష్ హెచ్‌సి పేర్కొన్నారు. నూతన టెక్నాలజీతో ఉద్యోగాలపై వేటు తప్పకపోవచ్చన్నారు. ఎఐ వల్ల కంపెనీల్లో భవిష్యత్తులో నియామకాలు తగ్గుతాయని పేర్కొన్నారు. జనరేటివ్ ఏఐ వంటి న్యూ టెక్నాలజీస్‌తో రాబోయే రోజుల్లో కంపెనీలకు కొద్దిమంది ఉద్యోగులు సరిపోతారని, ఫలితంగా నియామకాలు మందగిస్తాయని అన్నారు. వచ్చే మూడు నుంచి ఐదేళ్లలో ఎఐ ప్రభావం తీవ్రతరం కావొచ్చన్నారు.

FORM IV
(Rule 8)

UNDER THE PRESS AND REGISTRATION OF BOOKS ACT, 1867 STATEMENT ABOUT OWENARSHIP AND OTHER PARTICULARS ABOUT NEWSPAPER PRAJASAKTI

1.	Place of publication	Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole, Ananthapuramu
2.	Periodicity of its Publication	Daily
3.	Printer's Name Nationality Address	Mallajosyula Venkata Subrahmanya Sarma Indian D.NO. 27-30-4, M.B.Vignana Kendram Akulavari Street, Governorpet Vijayawada – 520002, Andhra Pradesh.
4.	Publisher's Name Nationality Address	Mallajosyula Venkata Subrahmanya Sarma Indian M.B.Vignana Kendram,D.NO. 27-30-4 Akulavari Street, Governorpet,Vijayawada – 520002, Andhra Pradesh.
5.	Editor's Name Nationality Address	Bendi Tulasi Das Indian D.NO. 21-1-66, Devitowers, Sambamurthy Road, Vijayawada – 520002, Andhra Pradesh.
6.	Names and addresses of individuals Who own the newspaper and Partners or Shareholders holding More than One percent of the total capital	Prajasakti Printers and Publishers Private Limited M.B.Vignana Kendram D.NO. 27-30-4, Akulavari Street, Governorpet, Vijayawada – 520002, Andhra Pradesh.

I, Mallajosyula Venkata Subrahmanya Sarma hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/
(MALLAJOSYULA VENKATA SUBRAHMANYA SARMA)
Publisher

Date . 29.02.2024

సంపాదకీయం

తృణమూల్ అరాచక పర్వం

ఒకప్పుడు సంఘ సంస్కరణకు, స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తికి, అభ్యుదయ ఆలోచనల వరవడికీ పేరెన్నిక గన్న పశ్చిమ బెంగాల్ - ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్ ఏలుబడిలో అరాచక పర్వానికి కేరాఫ్ అడ్రసుగా మారిపోయింది. రాజకీయ ప్రత్యర్థుల ఇళ్లపై దాడులు చేయడం, ఆస్తులు తగలబెట్టడం; హత్యలకు, అత్యాచారాలకూ పాల్పడడం తృణమూల్ గూండాలకు నిత్యకృత్యం అయిపోయింది! ఈ అమానుష కాండను అడ్డుకోవాల్సిన పోలీసు వ్యవస్థ నిర్లజ్జగా ఆ రౌడీల అడుగులకు మడుగులొత్తుతోంది. బరితెగిస్తున్న గూండాలకు రక్షణ కల్పించి, బాధితులపైనా, బాధితులకు అండగా నిలబడుతున్న వామపక్ష నాయకులూ, కార్యకర్తలపైనా తప్పుడు కేసులు బనాయిస్తోంది.

గత కొద్దికాలంగా సందేశ్ ఖలీ ప్రాంతంలో అధికార పార్టీ ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. షాజహాన్ అనే తృణమూల్ నాయకుడు ఇష్టారాజ్యంగా వ్యవహరించటం, అతడికి జోడీగా శిబు హజ్రా, ఉత్తమ్ సర్దార్ అనే తైనాతీలు చెలరేగిపోవడం సామాన్య జనానికి కంటకప్రాయంగా మారింది. వామపక్ష ప్రభుత్వం గతంలో పేదలకు పంచిన భూములను తృణమూల్ గూండాలు బలవంతంగా లాక్కున్నారు. అడ్డు చెప్పినవారిపై అత్యంత దారుణంగా దాడులు చేశారు. మహిళలను, యువతులను చెరబట్టారు. వారి పార్టీ కార్యాలయాల్లో బంధించి, తుపాకులతో బెదిరించి, పాశవికంగా అత్యాచారాలకు పాల్పడ్డారు. ఈ దురాగతాల్లో షాజహాన్ ప్రత్యక్ష పాత్రధారి! అనేక అమానుష సంఘటనల నేపథ్యంలో ఇటీవల మహిళలు బహిరంగంగానే తమపై జరిగిన అకృత్యాలపై గొంతెత్తారు. తమపై ఎంత దారుణంగా లైంగిక హింస సాగిందో, ఎన్ని బెదిరింపులూ అదిలింపులతో తమను బాధపెట్టారో మీడియా ముందు ఏకరువు పెట్టారు. ఆగ్రహంతో కదలిన ప్రజలు ఎక్కడికక్కడ తృణమూల్ నేతల ఇళ్లపై దండెత్తారు. ఇంత జరుగుతున్నా రాష్ట్ర పోలీసులు చోద్యం చూడ్డం తప్ప దుర్మార్గులపై కేసులు నమోదు చేయకపోవడమే తృణమూల్ మార్కు పాలన. సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకరత్ నేతృత్వంలోని బృందం బాధితులను పరామర్శించటానికి వెళ్లినప్పుడు- 144 సెక్షన్ అమల్లో ఉందని, పర్యటన కుదరదని అధికార పక్షానికి కొమ్ముకాసే కహానీలను వినిపించారు. హైకోర్టు జోక్యం చేసుకొని, రోజుల తరబడి 114 సెక్షన్ విధించటానికి వీల్లేదని చెప్పింది. బృందాకరత్ పర్యటనలో బాధిత మహిళలు వినిపించిన స్వీయానుభవాలు తృణమూల్ మూకల అమానుషానికి అద్దం పట్టేవిగా ఉన్నాయి. తన కుమార్తెను టిఎంసి గూండాలు వారం క్రితం అపహరించుకుపోయారని, ఇప్పటివరకూ ఎక్కడ ఉందో జాడ తెలియలేదని అపర్ణాదాస్ అనే మహిళ విలపిస్తూ చెప్పింది. ఇలాంటి వందలాది దుర్మార్గాలూ వెల్లడైనా, పోలీసులు ఒక్క కేసూ నమోదు చేయలేదు. పైగా, సందేశ్ ఖలీలో ఇన్ని అల్లర్లు జరగటానికి సిపిఎం నేత, మాజీ ఎమ్మెల్యే నిరపడా సర్దార్ కారణమంటూ గ్యాంగ్ రేప్ నిందితుడు, తృణమూల్ నాయకుడూ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన్ని అరెస్టు చేశారు. తీవ్రంగా హింసించారు. ఆ ప్రాంతపు కీచకుడిగా అవతరించిన షాజహాన్‌ని మాత్రం ముందస్తు బెయిలు ఉందన్న సాకుతో అరెస్టు కూడా చేయలేదు.

ఈ తతంగాన్ని గమనిస్తున్న రాష్ట్ర హైకోర్టు కేసును సుమోటోగా తీసుకొంది. పోలీసులు ప్రేక్షక, పక్షపాత పాత్రను వదిలిపెట్టి, నిందితులపై కేసులు నమోదు చేయాలని ఆదేశించింది. సిపిఎం నేత సర్దార్‌ని బేషరతుగా విడుదల చేయాలని, ఆయన్ని హింసించిన పోలీసులను వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించింది. ప్రజల తరపున నిర్భయంగా పోరాడుతున్న సర్దార్‌కి తాము అభినందనలు చెబుతున్నామని పేర్కొంది. షాజహాన్‌కి ఎలాంటి ముందస్తు బెయిలూ లేదని, వెంటనే అరెస్టు చేయాలని ఆదేశించింది. బాధితులకు బాసటగా, అరాచకానికి అడ్డుచక్రంగా వ్యవహరించిన హైకోర్టు చర్య అభినందనీయం. తృణమూల్ కాంగ్రెస్ అరాచక పాలనపై బెంగాల్ ప్రజల్లో గూడుకట్టుకొని ఉన్న అసంతృప్తి, ఆగ్రహం ఇప్పుడిప్పుడే పెల్లుబుకుతోంది. అధికార కావరంతో కన్నూమిన్నూ కానకుండా ప్రవర్తించే నిరంకుశ పాలకులకు ప్రజల చైతన్యమే సరైన జవాబు.

మహనీయుల మాట



సహచర భారతీయులారా, మీరు ఏ మతానికి చెందినవారైనా... ఏ వర్గానికి చెందిన వారైనా కానివ్వండి. దేశ సేవలో మీరంతా ఒక్కటవ్వండి. పరస్పరం పోట్లాడుకోకండి. మీ దేశాన్ని విముక్తం చేసేందుకు...విదేశీ పాలకులపై పోరాడేందుకు మీరంతా ఒక్కటి కండి.

- అష్ఫఖుల్లా ఖాన్,
స్వాతంత్ర్య సమరయోధుడు

విశ్లేషణ

రైతులు ఎందుకు ఉద్యమిస్తున్నారు?





వి. రాంభూపాల్

వ్యవసాయ శాస్త్రవేత్త, హరిత విప్లవ పితామహుడు డాక్టర్ ఎం.ఎస్.స్వామినాథన్‌కు భారతరత్న ఇచ్చిన మోడీ ప్రభుత్వం, ఆయన సిఫారస్సుల అమలు కోసం ఉద్యమిస్తున్న రైతుల మీద మాత్రం బుల్లెట్లను ప్రయోగిస్తున్నది. వ్యవసాయాన్ని కాపాడుకోవాలని రైతులు ఉద్యమిస్తుంటే, కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలని కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. అందుకే రెండు పక్షాలు భీకరంగా పోరాడుతున్నాయి. మీడియా, పోలీసు, అధికార యంత్రాంగంతో పాటు ఆర్‌ఎస్‌ఎస్ సోషల్ మీడియా చేస్తున్న అన్ని రకాల దాడులను ప్రతిఘటిస్తూ దేశ రాజధాని సమీపంలో వేలాదిమంది రైతులు పట్టు విడవకుండా పోరాడుతూనే వున్నారు. ఇప్పటికే ఒక యువ రైతు పోలీసు బుల్లెట్‌కు బలయ్యాడు. ముళ్ళ కంచెలను, ఇనుప చువ్వలను, నీటి ఫిరంగులను, రబ్బరు బుల్లెట్లను, పోలీసు కాల్పులను లెక్క చేయకుండా 13 డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 13 నుండి ఉద్యమిస్తున్నారు. ఇప్పటికీ ఐదు సార్లు రైతుల ప్రతినిధులతో చర్చలు జరిపామంటున్న ప్రభుత్వం ఏ డిమాండ్లు నెరవేర్చిందో చెప్పడంలేదు.

హామీలను అమలు చేయని మోడీ

లక్షలాది రైతులు దేశ రాజధాని సరిహద్దుల్లో 2020 నవంబర్ 26 నుండి సుమారు రెండు సంవత్సరాల పాటు భైఠాయించి కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల మూడు వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా పోరాడారు. అలాగే విద్యుత్ బిల్లు-2020ను ఉపసంహరించుకోవాలని, లఖింపురిలో ఆందోళన చేస్తున్న రైతులపై అధికార మదంతో జీపును నడిపి రైతుల మరణాలకు కారణమైన కేంద్రమంత్రి కుమారుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. మొక్కవోని పోరాటంలో చలికి, వానకు, ఎండకు అంతకంటే భయంకరమైన కరోనా మహమ్మారికి 700 మందికి పైగా అన్నదాతలు అమరులయ్యారు. కేంద్ర ప్రభుత్వం, పంజాబ్, హర్యానా రాష్ట్ర ప్రభుత్వాలు పెట్టిన అక్రమ కేసులకు వేలాది మంది రైతులు గురయ్యారు. నిందారోపణలను ఎదుర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం గ్రామీణ ప్రజలు నడిపిన సుదీర్ఘ పోరాటం అది. 1990 తరువాత ప్రపంచీకరణ విధానాలపై తీవ్రస్థాయి ప్రతిఘటన అది. మోడీ కళ్ళు తెరిపించి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పించిన ఉద్యమం అది. ఆ సందర్భంగా మూడు వ్యవసాయ చట్టాల అమలును వాయిదా వేసుకుంటున్నామని, పంటలకు కనీస మద్దతు ధర అమలు చేసేందుకు కమిటీ వేస్తామని కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చింది. దీంతో రైతులు ఉద్యమాన్ని ఆపేశారు. అయితే మోడీ ప్రభుత్వం నల్లచట్టాలను దొడ్డిదారిన అమలు చేయడమే కాక, విద్యుత్ బిల్లు ఆధారంగా వ్యవసాయ పంపుసెట్లకు మోటర్లు బిగించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అమలు చేయిస్తున్నది. కనీస మద్దతు ధర అమలు కోసం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. అందుకే నాడు కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయమని దేశవ్యాప్తంగా రైతు సంఘాల సమాఖ్య వివిధ రూపాల్లో ఉద్యమిస్తున్నది. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మరోసారి పంజాబ్, హర్యానా రాష్ట్రాల రైతులు ఢిల్లీ చుట్టూ చేరి ఉద్యమిస్తున్నారు. అకస్మాత్తుగా కొందరు రైతులు చేస్తున్న పోరాటం కాదు ఇది. అనేక దశబ్దాలుగా వ్యవసాయం పట్ల, గ్రామీణ పేద, మధ్యతరగతి ప్రజల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం.

> **"మోడీ ప్రభుత్వం నల్లచట్టాలను దొడ్డిదారిన అమలు చేయడమే కాక, విద్యుత్ బిల్లు ఆధారంగా వ్యవసాయ పంపుసెట్లకు మోటర్లు బిగించాలని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర ఒత్తిడి తెచ్చి అమలు చేయిస్తున్నది. కనీస మద్దతు ధర అమలు కోసం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. అందుకే నాడు కేంద్రం ఇచ్చిన హామీలను అమలు చేయమని దేశవ్యాప్తంగా రైతు సంఘాల సమాఖ్య వివిధ రూపాల్లో ఉద్యమిస్తున్నది. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మరోసారి పంజాబ్, హర్యానా రాష్ట్రాల రైతులు ఢిల్లీ చుట్టూ చేరి ఉద్యమిస్తున్నారు. అకస్మాత్తుగా కొందరు రైతులు చేస్తున్న పోరాటం కాదు ఇది. అనేక దశబ్దాలుగా వ్యవసాయం పట్ల, గ్రామీణ పేద, మధ్యతరగతి ప్రజల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా సాగుతున్న పోరాటం."**

ప్రపంచ జనాభాలో మన దేశ జనాభా 17 శాతం. ప్రపంచ భూమిలో కేవలం 2.4 శాతం మాత్రమే వున్న దేశం మనది. దేశ జనాభాలో 48.6 శాతం మంది ప్రజలు వ్యవసాయం మీద ఆధారపడి గ్రామాల్లో జీవిస్తున్నారు. ఈ లెక్కలు మన భూమికి, వ్యవసాయానికి ఉన్న ప్రాధాన్యతలను చెబుతున్నాయి. దేశ జనాభాకు అవసరమైన ఆహారం, వారి కొనుగోలు శక్తి పెరిగి తద్వారా పారిశ్రామికాభివృద్ధి జరగాలంటే ప్రభుత్వాలు వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. అనేక విషాదాల అనుభవాల నుండి వ్యవసాయ ఉత్పత్తులను పెంచుకున్నాము. 1950-1990 మధ్య దేశ జనాభా పెరుగుదల 2.5 శాతం ఉంటే వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల 3.4 శాతానికి చేరింది. 1980-90 మధ్య వ్యవసాయ ఉత్పత్తులు సగటు నాలుగు శాతం పెరుగుదల సాధించాయి. 1991 నుండి ప్రారంభమైన ప్రపంచీకరణ విధానాలు వ్యవసాయాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. 1990 చివరి నాటికి వ్యవసాయం తిరోగమనంలోకి దిగజారి దాని ఉత్పత్తులు మైనస్ 2 శాతానికి పడిపోయాయి. దీనివల్ల ఆహారధాన్యాలను విదేశాల నుండి దిగుమతి చేసుకోవలసిన పూర్వ పరిస్థితి వచ్చింది. గత పదేళ్ళ నరేంద్ర మోడీ పాలన వ్యవసాయాన్ని పూర్తిస్థాయి సంక్షోభంలోకి నెట్టి కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి సిద్ధమయ్యింది. అందుకే రైతులు పోరాడుతున్నారు.

దేశంలో 14.58 కోట్ల రైతు కుటుంబాల కింద 38.82 కోట్ల ఎకరాల సాగు భూమి వుంది. ఇందులో ఐదు ఎకరాల లోపు ఉన్న రైతు కుటుంబాలు 12.57 కోట్లు కాగా, వీరి వద్ద వున్న భూమి మాత్రం 18. 38 కోట్ల ఎకరాలు మాత్రమే. వీరిలో అధికులు వెనుకబడిన కులాలకు చెందిన పేదలు. సెంటు సాగు భూమి లేని గ్రామీణ కుటుంబాలు ఏడు కోట్లకు పైగా ఉన్నాయి. వీరిలో అత్యధికులు దళితులు, మైనారిటీలు, గిరిజనులు. వ్యవసాయ రంగం మీద ఆధారపడిన కోట్ల కుటుంబాలు నిత్యం అప్పుల్లో ఉండడానికి, పేదరికంలో మగ్గుతుండడానికి ప్రధాన కారణం తగినంత సాగు భూమి నిజమైన సాగుదార్ల వద్ద లేకపోవడం. శాస్త్ర, సాంకేతికత పెరిగే కొద్దీ గ్రామీణ వృత్తులు అంతరించి వాటిపై ఆధారపడిన వారు వ్యవసాయానికి అదనపు భారమయ్యారు. ప్రభుత్వాల నుండి రైతులకు అందాల్సిన రుణ పరపతి, ఎరువులు, విత్తనాల సబ్సిడీ తగ్గిపోవడం, పంటలకు గిట్టుబాటు ధరలు అమలు కాకపోవడంతో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలోకి వెళ్ళి గ్రామీణ జీవితం ఛిద్రమయ్యింది.

వ్యవసాయాన్ని ముంచే మోడీ విధానాలు

వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడానికి మోడీ ప్రభుత్వం 2020 జూన్ 5న ఆర్డినెన్స్ ద్వారా మూడు నల్ల వ్యవసాయ చట్టాలు తెచ్చింది. ఈ ఆర్డినెన్స్‌ను చట్టాలుగా మార్చుకునేందుకు అదే సంవత్సరం సెప్టెంబర్ 17-19 తేదీల మధ్య లోక్‌సభ, రాజ్యసభలో ఆమోదం పొందారు. వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య చట్టం, రైతు ధరల హామీ, వ్యవసాయ సేవల ఒప్పంద చట్టం, నిత్యావసర సరుకుల (సవరణ) చట్టం వల్ల వ్యవసాయంపై తీవ్రమైన దుష్ఫలితాలు కలుగుతాయి. ముఖ్యంగా పంటల ఉత్పత్తుల ధరలను ప్రభుత్వాలు కాకుండా పెద్ద కంపెనీలు నిర్ణయిస్తాయి. దేశ ప్రజల అవసరాల కోసం పంటల సాగు కాకుండా, ఈ కంపెనీలకు ఏది లాభమో దానినే ఉత్పత్తి చేయించగలరు. ఇప్పటి వరకు పేదలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందుతున్న కొద్దిపాటి ఆహారధాన్యాలు కూడా దూరమవుతాయి. ప్రభుత్వాలు ఎరువులు, విత్తనాల మీద ఇస్తున్న సబ్సిడీలను పూర్తిగా తొలగిస్తాయి. వ్యవసాయ రంగంలో నూతన పరిశోధనల నుండి ప్రభుత్వం తప్పుకుంటుంది. జాతీయ బ్యాంకుల నుండి రైతులకు అందుతున్న అరకొర రుణ సదుపాయం కూడా అందక పంటల పెట్టుబడికి, రైతు కుటుంబ అవసరాలకు ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల మీద ఆధారపడాల్సి వస్తుంది. వీటన్నింటివల్ల పేద, దిగువ మధ్య తరగతి రైతులు తమకున్న కొద్దిపాటి భూమిని కోల్పోయి భూమి లేని నిరుపేదల్లో చేరిపోతారు. ముఖ్యంగా ఎం.ఎస్.స్వామినాథన్ సిఫారస్సు చేసిన మొత్తం ఉత్పత్తి ఖర్చులకు 50 శాతం కలిపి కనీస మద్దతు ధర నిర్ణయించాలన్న కీలక అంశం అమలుకు నోచుకునే అవకాశమే లేదు.

కనీస మద్దతు ధర ఎందుకు?

అన్ని పంటలకు కనీస మద్దతు ధర ప్రభుత్వం ప్రకటించి అమలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అయితే 23 పంటలకు మాత్రమే ఈ మద్దతు ధర ప్రకటించబడుతుంది. అందులో 20 పంటలు ఆహారానికి సంబంధించినవి. ఇందులో వరి, గోధుమ, జొన్న లాంటి ఏడు ముతక ధాన్యాలు, ఆరు పప్పుధాన్యాలు, ఏడు నూనెగింజల పంటలు ఉన్నాయి. వాస్తవంగా వరి, గోధుమ పంటలకు మాత్రమే కొద్దిమేర ఈ కనీస మద్దతు ధర అమలవుతుంది. ఈ రెండు పంటల సేకరణలో 65 శాతం పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుండే జరుగుతుంది. ఈ రాష్ట్రాల్లో వ్యవసాయం వృద్ధి చెందడానికి వరి, గోధుమ పంటలకు మద్దతు ధర లభించడం ఒక కారణం. పంజాబ్‌లో వరి పంట అమ్మకాలు 78 శాతం, హర్యానాలో 90 శాతం చిన్న, సన్నకారు రైతుల నుండి జరుగుతున్నాయి. అందుకే మోడీ నల్ల చట్టాల ప్రభావం దేశంలో ఇతర రాష్ట్రాల కంటే ఇక్కడే ఎక్కువగా ఉంటుంది. అందుకే ఈ రెండు రాష్ట్రాల రైతులు కేంద్రం పెట్టే అన్ని నిర్బంధాలను ఎదుర్కొని ఉద్యమిస్తున్నారు.

2000 నుండి 2014 వరకు దేశవ్యాప్తంగా 45 శాతం మంది మధ్య తరగతి రైతులు వ్యవసాయాన్ని వదిలి పెట్టినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తల అధ్యయనాలు తెలుపుతున్నాయి. ఈ చట్టాలు అమలైతే దేశంలో, మన లాంటి రాష్ట్రాల్లో రైతు వ్యవసాయం కనుమరుగవుతుంది. దీనివల్ల పట్టణాల్లో పనులకు పోటీ పెరిగి వేతనాలు తగ్గడం, ఆకలి చావులు, ఆహారధాన్యాల కొరత తీవ్రమవుతాయి. అందుకే ఢిల్లీలో జరుగుతున్న రైతుల ఉద్యమం దేశ ప్రజల బతుకు కోసం సాగుతున్న ఉద్యమం.

నీరో చక్రవర్తిలా మోడీ

చరిత్రలో రోమ్‌ను పాలించిన నీరో చక్రవర్తి అనగానే 'రోమ్ నగరం తగలబడిపోతుంటే ఫిడేల్ వాయించిన వ్యక్తిగా' గుర్తుకు వస్తాడు. అది చరిత్ర. వర్తమానంలో ఢిల్లీ చుట్టూ వేలాది రైతులు రెండు వారాలుగా ఆందోళన చేస్తుంటే ద్వారకలో డైవింగ్ చేసిన, తిరువనంతపురంలో గగన్‌యాన్ అంతరిక్ష మిషన్ ముందు మోకరిల్లిన మన ప్రధానిని చూసి తరించే భాగ్యం దేశ ప్రజలకు పట్టుకుంది. గత 45 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగం పెరిగిపోయిందని 'స్టేట్ ఆఫ్ వర్కింగ్ ఇండియా-2023' నివేదిక ప్రకటించిన, గత 11 సంవత్సరాల్లో కుటుంబ ఖర్చులు ఎన్నడూ లేనంతగా భారీగా పెరిగిపోయాయని, అందుకు అనుగుణంగా ప్రజల ఆదాయం పెరగలేదని హెచ్‌సిఇఎస్ తాజా నివేదిక బట్టబయలు చేసినప్పటికీ ఏ మాత్రం చలించక, వేషాలు మార్చి మార్చి దేశ ప్రజలకు దర్శన భాగ్యం కల్పించగల నేర్పరి మన ప్రధాని. కొద్దిమంది దేశీయ, విదేశీ సంపన్నుల కోసం కోట్లమంది సామాన్యుల జీవితాలతో చెలగాటమాడుతున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దించకుండా వ్యవసాయాన్ని, దేశాన్ని కాపాడుకోలేం.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

అసమ్మతి గళాలపై కేంద్ర దర్యాప్తు సంస్థల పంజా

ప్రతిపక్ష నేతలను నిందితులుగా బోనులో నిలబెట్టేందుకు గాను బిజెపి ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను ఆయుధంగా వాడుకుంటోంది. ఎన్నికల వేళ ప్రత్యర్థులను నయానా భయానా దారికి తెచ్చుకునేందుకు మోడీ-అమిత్ షా బృందం ప్రయత్నిస్తుంది. ఇది సాధ్యం కాని చోట కేంద్ర ఏజెన్సీలను ఉపయోగిస్తారు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రి కాగానే మొదలైన ఈ ప్రాజెక్ట్...ప్రధాని అయ్యాక దేశమంతటికీ వ్యాపించింది. ఇ.డి, సిబిఐ, ఎన్‌ఐఎ, ఐ.టి, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో వంటి దర్యాప్తు సంస్థలను ఇందుకోసం దుర్వినియోగం చేస్తున్నారు. మోడీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నేతలపై కేసులు నాలుగు రెట్లు పెరిగాయి.



హేమంత్ సోరెన్

జార్ఖండ్ ముఖ్యమంత్రి, జెఎంఎం నేత హేమంత్ సోరెన్‌ను ఈ జనవరి 31న అరెస్టు చేసి జైలులో ఉంచారు. రాంచీలో ల్యాండ్ డీల్ ముసుగులో మనీ లాండరింగ్ జరిగినట్లు ఆరోపించిన కేసు ఇది. అరెస్టుకు రెండు రోజుల ముందు, ఇ.డి అధికారులు ఢిల్లీలోని సోరెన్ నివాసానికి చేరుకుని, ఇంట్లో డబ్బు స్వాధీనం చేసుకున్నట్లు ప్రచారం చేశారు. అయితే చార్జిషీటులో నిందితుడి పేరు కూడా లేదు. పలుమార్లు విచారించినా స్పష్టమైన ఆధారాలు లేని కేసులో తప్పుడు సాక్ష్యాలు సృష్టించి అరెస్ట్ చేశారు. బిజెపి ని ఓడించి జార్ఖండ్‌లో సోరెన్ నేతృత్వంలో ప్రభుత్వం వచ్చిన తర్వాత వేట మొదలైంది.

అరవింద్ కేజ్రీవాల్

ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను విచారణకు హాజరు కావాలని ఇ.డి ఆరు సార్లు నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ మద్యం పాలసీ కేసుకు సంబంధించి ఇదంతా జరిగింది. మొదటి నోటీసు అక్టోబర్ 2023లో జారీ అయింది. కేజ్రీవాల్‌పై ఇ.డి కోర్టును ఆశ్రయించింది. ఇ.డి ఫిర్యాదులో సిఆర్‌పిసి సెక్షన్లు 190 మరియు 200, నల్లధనం నిరోధక చట్టంలోని సెక్షన్ 50 గాక దర్యాప్తులో సహకరించకపోవడం వంటివి ఉన్నాయి.

లాలూ ప్రసాద్ యాదవ్-ఆయన కుటుంబం

బిజెపిని తీవ్రంగా వ్యతిరేకించారనే ఏకైక కారణంతో మోడీ ప్రభుత్వం లాలూ ప్రసాద్ యాదవ్‌ని, ఆయన కుటుంబాన్ని నిరంతరం వేటాడుతోంది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004 నుంచి 2009 మధ్య రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు వ్యవసాయ భూములు తీసుకొని రైల్వే ఉద్యోగాలు ఇచ్చారని కేసు నమోదైంది. జూన్ 2023లో, లాలూ ప్రసాద్ యాదవ్, ఆయన భార్య రబ్రీ దేవి, వారి కుమారుడు, బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్‌పై, సిబిఐ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. మే 2022లో, దాణా కుంభకోణం కేసులో లాలూ బెయిల్‌పై విడుదలైన వెంటనే, రైల్వే రిక్రూట్‌మెంట్ మోసం కేసును సిబిఐ నమోదు చేసింది. రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి)కి చెందిన ప్రముఖ నేతలపై సిబిఐ చర్యలు తీసుకోవడం ప్రతిపక్ష పార్టీలపై వేటు వేసే కేంద్ర ప్రభుత్వ ఎత్తుగడలో భాగమేనన్న విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. బిజెపికి వ్యతిరేకంగా ప్రతిపక్షాల కూటమిని ఏర్పాటు చేయడంలో లాలూ ప్రసాద్, తేజస్వి ప్రధాన పాత్ర పోషించారు.

ఫరూక్ అబ్దుల్లా

జమ్ము-కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లాను విచారణకు పిలిచారు. జమ్ము-కాశ్మీర్ క్రికెట్ అసోసియేషన్‌లో ఆర్థిక అవకతవకలకు సంబంధించిన కేసులో ఈ చర్య తీసుకున్నారు. 2022లో ఈ కేసులో ఫరూక్ అబ్దుల్లాపై సిబిఐ చార్జిషీట్ కూడా దాఖలు చేసింది.

సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంక

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు మల్లికార్జున్ ఖర్గే, పవన్ బన్సాల్ లను ప్రశ్నించారు. మోసం, నేరపూరిత కుట్ర, ఆస్తుల దుర్వినియోగం వంటి అభియోగాలు కూడా మోపారు. ఈ కేసులో సోనియా, రాహుల్‌లకు 2015లో బెయిల్ మంజూరైంది. మనీ లాండరింగ్ కేసుకు సంబంధించి ఇ.డి రూపొందించిన కొత్త చార్జిషీట్‌లో కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ పేరు ఉంది. హర్యానా లోని ఫరీదాబాద్‌లో జరిగిన భూముల వ్యవహారంలో ప్రియాంక ప్రమేయం కూడా ఉందని ఇ.డి ఆరోపిస్తోంది.

మనీష్ సిసోడియా

ఢిల్లీ లిక్కర్ పాలసీ అవినీతి కేసులో ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాను సిబిఐ, ఇ.డి అరెస్ట్ చేసి జైలుకు పంపి ఫిబ్రవరి 26కి ఏడాది పూర్తయింది. 2023 ఫిబ్రవరి 26న సిబిఐ ప్రధాన కార్యాలయానికి పిలిపించి ఎనిమిది గంటలపాటు విచారించిన తర్వాత అరెస్టు చేశారు. మద్యం పాలసీకి సంబంధించి సిసోడియాతో పాటు మరో 14 మందిని సిబిఐ నిందితులుగా పేర్కొంది.

డి.కె శివకుమార్

కర్ణాటక కాంగ్రెస్ అధ్యక్షుడు, ఇప్పుడు ఉప ముఖ్యమంత్రి డి.కె శివకుమార్‌ను పన్ను ఎగవేత మరియు హవాలా లావాదేవీలకు సంబంధించి 2019 సెప్టెంబర్‌లో ఇ.డి అరెస్టు చేసింది. బెంగళూరు ప్రత్యేక కోర్టులో 2018లో ఆదాయపు పన్ను శాఖ దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈ చర్య తీసుకున్నారు. గుజరాత్ లోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలను శివకుమార్ తన రిసార్ట్‌లో ఉంచిన తర్వాత ఈ దాడి జరిగింది. ఈ కేసుతో పాటు మరికొన్ని కేసుల్లో శివకుమార్‌కు కేంద్ర సంస్థలు ఎప్పటికప్పుడు నోటీసులు ఇస్తూనే ఉన్నాయి.

/'దేశాభిమాని' సౌజన్యంతో/

మీ రచనలను పంపాల్సిన మెయిల్ : editpageps@gmail.com

వ్యాఖ్య

పాలస్తీనా విముక్తికి చైనా తిరుగులేని మద్దతు!

ఏం చేసినా మనసా-వాచా-కర్మణా ఉండాలని పెద్దలు ఎప్పుడో చెప్పారు. భారతీయ విలువలు, వలువల గురించి నిత్యం వల్లిస్తూ ఎదుటివారికి బోధలు చేసే వారంతా అలా ఉన్నారా అని ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. పాలస్తీనా దేశం ఏర్పాటు, అరబ్బుల సర్వసత్తాక హక్కు గురించి మాట్లాడుతున్నవారు ఆచరణలో ఏం చేస్తున్నారన్నదే ముఖ్యం. మొక్కుబడిగా మద్దతు తెలుపుతూనే అక్కడ మారణకాండకు పాల్పడుతున్న ఇజ్రాయిల్ గొప్పతనం, దానితో స్నేహం గురించి కబుర్లు చెప్పే విశ్వగురువు అమెరికా సంతుష్టీకరణ, ముస్లిం వ్యతిరేక వైఖరి గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంతమంచిది. గాజాలో యూదు మూకలు జరుపుతున్న మారణకాండ గురించి హేగ్‌లోని అంతర్జాతీయ న్యాయస్థానం (ఐసిజె) విచారణ జరుపుతున్నది. అదే కోర్టులో తూర్పు జెరూసలెంతో సహా ఆక్రమిత పాలస్తీనా ప్రాంతాలలో ఇజ్రాయిల్ విధానాలు, ఆచరణతో తలెత్తిన చట్టపరమైన పర్యవసానాల గురించి కూడా మరో కేసు విచారణ జరుగుతున్నది. దానిలో పాలస్తీనా యోధులకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ కమ్యూనిస్టు చైనా అంటే ఏమిటో ప్రపంచానికి, విముక్తి పోరాటాలలో నిమగ్నమైన వారికి ఇస్తున్న మద్దతు, వైఖరి గురించి చేసిన వాదన ఎంతో ముఖ్యమైనది. సామ్రాజ్యవాదుల దురాక్రమణకు, వలస పాలనలో మగ్గిన చైనా, ఇతర దేశాల వారికి అదే పరిస్థితిలో ఉన్న వారి గురించి తెలిసినంతగా మరొకరికి అర్థం కాదు. స్వాతంత్ర్య, విముక్తి పోరాటాలకు దూరంగా, మన దేశంలో సామ్రాజ్యవాదుల బూట్లు నాకిన వారు, ప్రేమ లేఖలు రాసి, చరిత్ర చెత్తబుట్టలో ఉన్న జయచంద్రుడు, మీర్ జాఫర్‌ల సరసన చేరిన కాషాయ దళ వారసుల గురించి పక్కన పెడదాం.



అంతర్జాతీయ న్యాయస్థానంలో పాలస్తీనియన్లకు చైనా మద్దతు ప్రకటనతో సహజంగానే ఇజ్రాయిల్ మండిపడింది. అక్టోబరు ఏడున తమ దేశంపై హమాస్ చేసిన దాడికి చైనా మద్దతు ఉన్నట్లుగా తాము పరిగణిస్తామని చెప్పుకుంది. యుద్ధ నీతి ప్రకారం పౌరుల మీద పనిగట్టుకొని దాడులు చేయరాదని, హమాస్ తమ పౌరుల మీద అలాంటి దాడికే పాల్పడిందని ఆరోపించింది. ఆ చర్యను తప్పుపడుతున్న ఇజ్రాయిల్ గడచిన ఏడున్నర దశాబ్దాలుగా ఆక్రమిత పాలస్తీనాలో జరుపుతున్న దుర్మార్గాలను, తాజాగా హమాస్ అణచివేత పేరుతో మారణకాండ, విధ్వంసాన్ని ఏ విధంగా సమర్థించుకుంటుంది? విముక్తి కోసం పోరాడుతున్న వారిని ఉగ్రవాదులుగా చిత్రించటం ఈ రోజు కొత్తగా జరుగుతున్నది కాదు. పాలస్తీనా యోధుడు యాసర్ అరాఫత్‌నే ఉగ్రవాదిగా పరిగణించిన వారు హమాస్‌కు ఆ ముద్ర వేయటంలో ఆశ్చర్యం ఏముంది?

పాలస్తీనా ప్రాంతాల ఆక్రమణ క్రమంలో 57 సంవత్సరాల క్రితం 1967 జూన్‌లో ఇజ్రాయిల్ జరిపిన ఆరు రోజుల యుద్ధం గురించి చైనా తరపు న్యాయవాది మాట్లాడుతూ 1973లో ఐరాస సాధారణ అసెంబ్లీ ఆమోదించిన 3,070 తీర్మానం ప్రకారం వలసవాదులు, విదేశీ పెత్తనం, విదేశీ అణచివేతకు గురైన ప్రాంతాల వారు విముక్తి కోసం సాయుధ పోరాటంతో సహా అందుబాటులో ఉన్న అన్ని సాధనాలను వినియోగించే హక్కును కలిగి ఉన్నారన్న అంశాన్ని కోర్టు ముందు ఉంచారు. ఆ మేరకు తమ విముక్తి కోసం పాలస్తీనా పౌరులకు సాయుధ పోరాటం జరిపే హక్కు ఉన్నదని చైనా స్పష్టం చేసింది. ఇప్పటికే న్యాయం చాలా ఆలస్యమైందని, దాన్ని కాదనకూడదని పేర్కొన్నది. అదీ కమ్యూనిస్టు చైనా ప్రత్యేకత. అంతే కాదు "తమ విముక్తి, స్వయం పాలనా హక్కు కోసం వలసవాదం, ఆక్రమణ, దాడులు, పెత్తందారీ తనాలకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంతో సహా విదేశీ శక్తుల మీద పౌరులు జరిపే పోరాటాలను ఉగ్రవాద చర్యలుగా పరిగణించకూడదని, దీర్ఘకాలంగా దురాక్రమణకు గురైన వారు జరుపుతున్న పోరాటాలకు చట్టబద్ధమైన పునాది కూడా ఉందని" తన వైఖరిని ఈ సందర్భంగా చైనా వెల్లడించింది. అయితే సాయుధ పోరాటాన్ని సమర్ధించటం అంటే ఆ సందర్భాల్లో ఉగ్రవాద చర్యలకు పాల్పడిన వారిని సమర్ధించటం కాదన్నది గమనించాలి. అది హమాస్‌కూ వర్తిస్తుంది. జరిగిన పొరపాట్లను తప్పు పట్టటం వేరు, ఆ పేరుతో మొత్తంగా ఉగ్రవాదులుగా చిత్రించటం తగని పని. ఆక్రమిత ప్రాంతాల నుంచి ఇజ్రాయిల్‌ను వెళ్లగొట్టి తమ స్వతంత్ర దేశ ఏర్పాటుకు పాలస్తీనియన్లు చేస్తున్న పోరాటాన్ని ఎలాంటి శషభిషలు లేకుండా సంపూర్ణంగా చైనా సమర్ధించటం విముక్తి పోరాటాలకు వేగుచుక్క వంటిది. ఈ పరిణామం విముక్తి పోరాటాల్లో ఉన్న వారందరికీ ఎంతో ఉత్తేజం, ధైర్యాన్ని ఇస్తుందని వేరే చెప్పనవసరం లేదు.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

కాంట్రాక్ట్ కార్మికులను విలీనం చేయండి

- యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సంస్థల్లో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) కోరింది. జెన్‌కో ఎండి, ట్రాన్స్‌కో జెఎండి కెవిఎన్ చక్రధర్ బాబును యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎవి నాగేశ్వరరావు, కార్యదర్శి అనిల్ కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ముబషిర్ అహ్మద్ కలిసి విద్యుత్ సౌధలో గురువారం వినతిపత్రం అందించారు. ముఖ్యమంత్రి హామీ ప్రకారం అందర్నీ రెగ్యులర్ చేయాలని, 2022 పిఆర్‌సి ప్రకారం బేసిక్ వేతనాలు చెల్లించి, ఎరియర్స్ ఇవ్వాలని కోరారు. నూతన షిఫ్ట్ ఆపరేటర్లకు, వాచ్‌మెన్స్‌గా పనిచేస్తూ షిఫ్ట్ ఆపరేటర్లుగా నియమించిన వారికి పాత ఆపరేటర్లతో సమానంగా వేతనాలు చెల్లించాలని తెలిపారు. అర్హులైన కార్మికులకు అన్‌స్కిల్డ్ నుంచి స్కిల్డ్‌కు, స్కిల్డ్ నుంచి హైస్కిల్డ్‌గా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. బిల్ కలెక్షన్ ఏజెంట్లకు, ఎస్‌పిఎం కార్మికులకు, విద్యుత్ స్టోర్ హమాలీలకు పీస్ రేటు రద్దు చేసి కనీస వేతనాలు చెల్లించాలని తెలిపారు. ట్రాన్స్‌కోలో సిబిడి గ్యాంగ్ కార్మికులకు ప్రమాదాలు జరిగితే నష్టపరిహారం, కోలుకునే వరకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని, వైద్యం సౌకర్యం కల్పించి, రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని కోరారు. సిపిడిసిఎల్‌లో 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న పెయిడ్ హాలిడేస్, ఇంక్రిమెంట్ ఎరియర్స్‌లను వెంటనే చెల్లించాలని తెలిపారు. విద్యుత్ శాఖల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. కొత్త సబ్‌స్టేషన్లలో ఖాళీలు భర్తీ చేయాలని, ప్రతి స్టేషన్లలో నైట్ వాచ్‌మెన్లను కేటాయించాలని తెలిపారు. ఇపిఎస్ పరిమితి దాటిన వారికి మెడికల్ అలవెన్స్, మెడికల్ ఇన్సూరెన్స్ కల్పించాలని కోరారు. మహిళా ఉద్యోగులకు ఇతర శాఖల్లో కేటాయిస్తున్నట్లు 5 ప్రత్యేక సెలవులు కేటాయించాలని తెలిపారు. కార్మికులందరికీ హెల్త్ కార్డులు, ప్లే స్లిప్స్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని తెలిపారు.

'జ్ఞానవాపి'లో పూజకు అనుమతించిన

రిటైర్డ్ జడ్జికి పదవి

- యుపిలోని ఒక యూనివర్సిటీకి లోక్‌పాల్‌గా నియామకం
- తీర్పునిచ్చిన నెలలోపే ఇదంతా



న్యూఢిల్లీ : అయోధ్యలో రామ మందిర నిర్మాణానికి మార్గం సుగమం చేస్తూ తీర్పునిచ్చిన సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) రంజన్ గొగోరు.. తన పదవీ విరమణానంతరం రాజ్యసభ ఎంపీ అయ్యారు. పదవీ విరమణ దగ్గర పడుతున్న తరుణంలో సున్నితమైన అయోధ్య-బాబ్రీ మసీదు విషయంలో ఒక వర్గానికి అనుకూలంగా, ఒక పార్టీకి బలం చేకూరేలా తీర్పునిచ్చారని, అందుకు ప్రతిఫలంగానే ఆయనకు రాజ్యసభ సీటు వరించిందని ఆ మధ్య వాదనలు వినిపించాయి. ఇప్పుడు వారణాసిలోని జ్ఞానవాపి మసీదు విషయంలోనూ ఇదే సీన్ రిపీట్ అయినట్టు కనిపిస్తున్నది. మసీదు బేస్‌మెంట్‌లో హిందువులకు పూజల కోసం తన ఉద్యోగ జీవితంలో చివరి రోజున అనుమతినిచ్చిన నెలలోపే.. రిటైర్డ్ జడ్జి అజయ కృష్ణ విశ్వేష లక్నోలోని ప్రభుత్వ విశ్వవిద్యాలయానికి అంబుడ్స్‌మెన్‌గా నియమితులయ్యారు. విశ్వేష జనవరి 31న వారణాసి జిల్లా న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. ఫిబ్రవరి 27న.. డాక్టర్ శకుంతలా మిశ్రా నేషనల్ రిహాబిలిటేషన్ యూనివర్సిటీ (ఇది యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ చైర్‌పర్సన్‌గా ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే విశ్వవిద్యాలయం) లోక్‌పాల్ (అంబుడ్స్‌మన్)గా నియమించినట్టు యూనివర్సిటీ అధికారులు తెలిపారు. విశ్వేష ఈ పదవిలో మూడేండ్ల పాటు ఉంటారు. యూనివర్సిటీ లోక్‌పాల్ విద్యార్థుల ఫిర్యాదులను పరిష్కరించే బాధ్యతను కలిగి ఉంది. విశ్వేష మూడేండ్లపాటు లోక్‌పాల్‌గా నియమితులైనట్టు యూనివర్సిటీ అసిస్టెంట్ రిజిస్ట్రార్ బ్రిజేంద్ర సింగ్ ధ్రువీకరించారు.

సమాజంలోని రెండు మతాల మధ్య సున్నితమైన అంశంలో తీర్పునిచ్చిన వ్యక్తిని ఇప్పుడు అంబుడ్స్‌మెన్‌గా నియమించడం పట్ల సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్రంలోని మోడీ సర్కార్ పరోక్షంగా న్యాయవ్యవస్థను సైతం ప్రభావితం చేస్తున్నదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే కీలక కేసుల్లో 'ప్యాకేజీ తీర్పులు' వెలువడుతున్నాయని, పదవీ విరమణ అనంతరం సదరు న్యాయమూర్తులకు కీలక పదవులు వరిస్తున్నాయని సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అకృత్యాలకు ఆవాసంగా గుజరాత్ లా వర్సిటీ

- న్యాయ విద్యార్థులకే రక్షణ లేకుంటే ఎలా? : హైకోర్టు వ్యాఖ్య

అహ్మదాబాద్ : గుజరాత్ జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (జిఎన్‌ఎల్‌యు) ప్రాంగణంలో వేధింపులు, అత్యాచారాలు, స్వలింగ సంపర్కం, వివక్ష వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇవేవో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న ఆరోపణలు కావు. గుజరాత్ హైకోర్టు నియమించిన నిజ నిర్ధారణ కమిటీ గత వారం న్యాయస్థానానికి సమర్పించిన నివేదికలోని చేదునిజాలు. ఈ నివేదిక 'నిజంగా భయానకం'గా ఉన్నదని హైకోర్టు వ్యాఖ్యానించింది. ఈ దారుణాలకు జిఎన్‌ఎల్‌యునే బాధ్యత వహించాలని ప్రధాన న్యాయమూర్తి సునీత అగర్వాల్, న్యాయమూర్తి అనిరుద్ధ మయీతో కూడిన బెంచ్ స్పష్టం చేసింది. అక్కడ్నుంచి పలు ఫిర్యాదులు వచ్చినా యూనివర్సిటీ యాజమాన్యం ఉదాసీనంగా వ్యవహరించిందని మండిపడింది. జిఎన్‌ఎల్‌యులో చదువుతున్న ఓ విద్యార్థినిపై లైంగికదాడి జరిగిందని, మరో విద్యార్థిపై లైంగిక వేధింపులు పాల్పడ్డారని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలపై మీడియాలో కథనాలు వెలువడ్డాయి. వీటిని సుమోటోగా స్వీకరించిన న్యాయస్థానం మాజీ న్యాయమూర్తి హర్ష దేవాని నేతృత్వంలో నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది. యూనివర్సిటీపై వచ్చిన వార్తలను వర్సిటీకి చెందిన అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ఐసిసి), రిజిస్ట్రార్ అంతకుముందు తోసిపుచ్చారు. 'ఇది జాతీయ న్యాయ యూనివర్సిటీ ఎలా అవుతుంది? ఏమీ జరగలేదని, విచారణను నిలిపివేయాలని రిజిస్ట్రార్ ఓ అఫిడవిట్ సమర్పించారు. ఇలాంటి వ్యక్తులు పిల్లలను ఎలా రక్షిస్తారు?' అని ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నించారు. వర్సిటీ ప్రాంగణంలో అత్యాచారం, లైంగిక వేధింపులకు సంబంధించిన రెండు సంఘటనలు మాత్రమే జరగలేదని, అనేక ఇతర దారుణాలు కూడా చోటుచేసుకున్నాయని బెంచ్ అభిప్రాయపడింది. విద్యార్థుల ఫిర్యాదులను వర్సిటీ అధికారులు బుట్టదాఖలు చేసినట్టు నిజనిర్ధారణ కమిటీ తేల్చిందని తెలిపింది. పైగా విద్యార్థులు తమ సమస్యలను సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేయడాన్ని నేరంగా వారు పరిగణించారు. ఇలాంటి పోస్టుల వల్ల వర్సిటీ ప్రతిష్ట దెబ్బతింటుందని భావించారు. న్యాయాన్ని రక్షించాల్సిన లా విద్యార్థులకే ఇలా జరిగితే ఎలా అని న్యాయస్థానం ప్రశ్నించింది. కేసు తదుపరి విచారణను మార్చి 12వ తేదీకి వాయిదా వేసింది.

జమ్ముకాశ్మీర్ ముస్లిం కాన్ఫరెన్స్‌లోని రెండు సంస్థలపై కేంద్రం వేటు

శ్రీనగర్ : జమ్ము కాశ్మీర్ ముస్లిం కాన్ఫరెన్స్ (ఎంసిజెకె)లోని రెండు సంస్థలపై బుధవారం కేంద్రం వేటు వేసింది. అబ్దుల్ ఘనీ భట్, గులాం నబీ సుమ్జీ నేతృత్వంలోని ఈ సంస్థలను ఉపా చట్టం కింద రద్దు చేస్తున్నామని, వచ్చే ఐదేళ్ల పాటు నిషేధం కొనసాగుతుందని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. అబ్దుల్ ఘనీ భట్ అధ్యక్షతన ఉన్న ఎంసిజెకె-బి నిషేధిత ఉగ్రవాద సంస్థతో సంబంధాలు కలిగి ఉందని, జమ్ముకాశ్మీర్‌లో ఉగ్రవాదానికి మద్దతు ఇస్తోందని ఎంహెచ్ఎ పేర్కొంది. గులాం నబీ సుమ్జీ అధ్యక్షతన ఉన్న మరో సంస్థ ఎంసిజెకె-ఎస్ భారత్ వ్యతిరేక, పాకిస్థాన్ అనుకూల ప్రచారాన్ని నిర్వహిస్తోందని తెలిపింది. మిర్వాయిజ్ ఉమర్ ఫరూఖ్ ఆల్ పార్టీస్ హురియత్ కాన్ఫరెన్స్ (ఎపిహెచ్‌సి)కి చెందిన ఈ రెండు సంస్థలు గత కొన్నేళ్లుగా క్రియాశీలకంగా లేవు.

వీల్‌చైర్ ఏర్పాటు చేయనందుకు రూ.30 లక్షల జరిమానా

- ఎయిర్ ఇండియాకు డిజిసిఎ ఆదేశం

న్యూఢిల్లీ : ఎయిర్ ఇండియాకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) రూ.30 లక్షల జరిమానా విధించింది. 80 ఏళ్ల వయస్సు గల వృద్ధుడు తన భార్యతో కలిసి ఎయిర్ ఇండియా విమానంలో న్యూయార్క్ నుండి ముంబయి ఛత్రపతి శివాజీ మహారాజ్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కు ఈ నెల 16న చేరుకున్నారు. విమానం నుండి టెర్మినల్ వరకు వీల్‌చైర్ ఏర్పాటు చేయకపోవడంతో నడుచుకుంటూ వెళ్లాలని భావించారు. కొంత దూరం నడిచిన అనంతరం ఆ వృద్ధుడు తీవ్ర అస్వస్థతకు గురై మరణించాడు. ఈ ఘటనపై ఏడు రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని ఎయిర్ ఇండియాకు డిజిసిఎ షోకాజ్ నోటీసు జారీ చేసింది. ఆ వృద్ధుని భార్యకు వీల్ చైర్ ఏర్పాటు చేశామని, మరొకటి ఏర్పాటు చేసే వరకు వేచి ఉండాలని సిబ్బంది కోరారని ఎయిర్ ఇండియా పేర్కొంది. ఆ వృద్ధుడు నడిచివెళ్లాలని నిర్ణయించుకున్నారని తెలిపింది. ఎయిరిండియాకు రూ.30 లక్షలు జరిమానా విధిస్తున్నట్లు డిజిసిఎ ప్రకటించింది.

ఫైవ్ స్టార్ జైలు

- పార్లమెంటు సమావేశాల తీరుపై సంజయ్ రౌత్ ఆగ్రహం

ముంబయి : 'ఢిల్లీలోని సెంట్రల్ విస్టా పరిస్థితిని ప్రతి ఒక్కరూ చూడాలని, నూతన పార్లమెంట్ పని చేయలేని ఫైవ్ స్టార్ జైలు లాంటిది' అని శివసేన (యుటిబి) నేత, ఎంపి సంజయ్ రౌత్ విమర్శించారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రధాని మోడీ హయాంలో పార్లమెంట్ పని తీరు తీవ్రంగా దెబ్బతిందని అన్నారు. 'ఇండియా వేదిక' కేంద్రంలో అధికారంలోకి వస్తే పార్లమెంట్ సమావేశాలను చారిత్రాత్మకమైన పాత పార్లమెంటు భవనానికి తరలించే అవకాశం ఉందని చెప్పారు.

గీత కార్మికులపై బైండోవర్

- పోలీసుల తీరుపై సిపిఎం ఆగ్రహం

ప్రజాశక్తి-రొద్దం

ఈతవనంలో చెట్ల తొలగింపు విషయంలో న్యాయం చేయాలని కోరిన గీతకార్మికులను పోలీసులు బైండోవర్ చేశారు. న్యాయం చేయమని కోరిన వారిపేనే ఇలా బైండోవర్ చేసి బెదిరించడంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం అవుతోంది. గీత కార్మికులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై సిపిఎం నాయకులు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం రాత్రి రొద్దం పోలీసు స్టేషన్ వద్ద గీత కార్మికులకు మద్దతుగా సిపిఎం నాయకులు నిలిచారు. మండల పరిధిలోని కంచిసముద్రం గ్రామానికి చెందిన గీత కార్మికులపై బైండోవర్ కేసు నమోదు అయ్యిందని పోలీసు స్టేషన్‌కు రావాలంటూ రొద్దం పోలీసులు గురువారం సాయంత్రం సమాచారం ఇచ్చారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన గీత కార్మికులు తాము ఏ తప్పు చేశామని, ఎందుకు బైండోవర్ కేసు నమోదు చేశారని పోలీసులను అడిగారు. తమకు అన్యాయం జరిగిందని చెబితే తమనే ఇలా బెదిరింపులకు గురి చేయడం ఏమిటంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

పోలీసుల తీరుపై సిపిఎం ఆగ్రహం

గీత కార్మికులను బైండోవర్ చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు గురువారం రాత్రి రొద్దం పోలీసు స్టేషన్ వద్దకెళ్లారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దన్న, జిల్లా కమిటీ సభ్యులు నారాయణ, సిఐటియు నాయకులు రమేష్ స్టేషన్ వద్దకెళ్లి గీత కార్మికులతో మాట్లాడారు. గీత కార్మికులను ఎందుకు బైండోవర్ చేస్తున్నారంటూ ఎస్ఐ వలీబాషాను సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ ప్రశ్నించారు. గొడవే జరగనప్పుడు బైండోవర్ ఎందుకు చేస్తున్నారని నిలదీశారు. ఈతవనాన్ని తొలగించి సమస్యకు కారణం అయిన వారిపై చర్యలు తీసుకోకుండా గీత కార్మికులను బెదిరించేలా పోలీసులు వ్యవహరించడం సరికాదన్నారు. దీనిపై ఎస్ఐ స్పందిస్తూ ఈతవనం తొలగింపు విషయంలో రెండు వర్గాల వారినీ బైండోవర్ చేస్తున్నామని తెలిపారు. ఏదైనా సమస్య ఉంటే ఉన్నతాధికారుల వద్దకెళ్లాలని సమాధానం ఇచ్చారు.

అకారణంగా గీత కార్మికులను పోలీసులు బైండోవర్ చేసి బెదిరింపులకు గురి చేయడం దుర్మార్గమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.ఇంతియాజ్ తెలిపారు. గీత కార్మికులకు న్యాయం జరిగే వరకూ సిపిఎం వారి పక్షాన పోరాటం చేస్తుందని తెలియజేశారు.

త్వరలో ఒంటిమిట్టలో నిత్యాన్నదానం : టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి ఆలయం ఉత్తరమాడ వీధిలోని శ్రీ నమ్మాళ్వార్ సన్నిధి వద్ద నిత్యాన్నదానం కార్యక్రమాన్ని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి గురువారం ప్రారంభించారు. అన్నదాన కార్యక్రమాన్ని మరింత విస్తరిస్తామని ఆయన వెల్లడించారు. ప్రతిరోజూ రెండువేల మంది యాత్రికులకు సరిపడేలా భోజనం ఏర్పాట్లు చేశామని తెలిపారు. త్వరలో ఒంటిమిట్టలోనూ నిత్యాన్నదానం కార్యక్రమం చేపడతామని వెల్లడించారు. ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ ఈ అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందన్నారు.

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా యాత్రికులు కానుకగా సమర్పించిన వాచీలు, మొబైల్ ఫోన్లను మార్చి 13న రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నారు.

చురుగ్గా పట్టిసీమ ఉత్సవాలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - పోలవరం

పట్టిసీమలో నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాల పనులు చురుగ్గా జరుగుతున్నాయని ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ అన్నారు. గోదావరి నదిపై నడక మార్గం ఏర్పాటుకు డ్రెడ్జింగ్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికే దాదాపు మూడు శాతం పనులు పూర్తయ్యాయని, గోదావరి నదిలో మార్గమునకు పంటులను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ఉత్సవాలకు సుమారు రెండు లక్షల మంది యాత్రికులు వస్తారని తెలపడంతో నిర్వహించేందుకు ఎటువంటి ఇబ్బంది లేకుండా దేవాదాయ శాఖ డిపార్ట్మెంట్ వారు పనులను పరిశీలిస్తున్నారన్నారు. గోదావరి నది నుంచి ఆలయం వరకు ఇసుక తెన్నెల్లో రహదారి మార్గంలో యాత్రికులు సేద తీర్చుకునేందుకు చలువ పందిళ్లు, నదిలో స్నానం చేసిన యాత్రికులు బట్టలు మార్చుకునేందుకు తాత్కాలిక గదులు, మరుగుదొడ్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు ఉత్సవాలకు రెండు రోజుల ముందే పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. పనులు చురుగ్గా సాగుతున్నాయని ఫెర్రీ కాంట్రాక్టర్ మైగాపుల సత్యనారాయణ, బొరుసు రాంబాబు తెలిపారు.

అక్రమాలకు అడ్డుకట్టేది..?

- సబ్సిడీ అక్రమ బియ్యానికి హొళగుంద అడ్డా
- గవి సిద్దేశ్వర రైస్ మిల్లుల్లో జోరుగా దందా
- రూ.లక్షల్లో అక్రమార్జన
- చోద్యం చేస్తున్న అధికారులు

ప్రజాశక్తి - హొళగుంద(కర్నూలు)

ప్రభుత్వం పేదలకు అందించే సబ్సిడీ బియ్యాన్ని కారు చౌకగా కొని పాలిష్ చేసి అక్రమార్కులు దర్జాగా సొమ్ము చేసుకుంటున్నారు. కార్డుదారుల నుంచి చిన్న వ్యాపారులు రూ.15లకు కొనుగోలు చేసి రైస్ మిల్లులో రూ.20 విక్రయిస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎమ్డియు ఆపరేటర్ల చేతివాటం

మండలంలో 17 పంచాయతీలకు గాను 32 రేషన్ షాపులు ఉన్నాయి. 17,204 మంది కార్డుదారులు ఉన్నారు. మండలానికి నెలకు 2,597.38 క్వింటాళ్ల బియ్యం అలాట్మెంట్ అవుతోంది. ఇంటింటికీ మొబైల్ వాహనం ద్వారా రేషన్ అందించే ఎమ్డియు ఆపరేటర్లు బియ్యం పంపిణీలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. తూకంలో మోసం చేసి కార్డుదారుల నుంచి బియ్యాన్ని నొక్కేస్తున్నారు. గతంలో రేషన్ డీలర్లు ఈ తతంగాన్ని నడిపేవారు. ప్రస్తుతం ఎమ్డియు ఆపరేటర్లు ఈ వ్యవహారాన్ని మూడు పువ్వులు, ఆరు కాయలుగా మార్చుకుని దోచుకుంటున్నారు.


వే బ్రిడ్జి కాటా వేయించుకుని గవి సిద్ధేశ్వర రైస్మిల్లులోకి సబ్సిడీ బియ్యంతో వెళ్తున్న బొలెరో వాహనం

కార్డుదారుల నుంచి కొనుగోలు చేసిన బియ్యాన్ని రైస్ మిల్ యజమానులకు కిలో రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వేలాది క్వింటాళ్లు రైస్మిల్లుకు తరలించి రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. ఒక్క హొళగుంద మండలం నుంచే నెలకు 1200 క్వింటాళ్ల వరకు సబ్సిడీ బియ్యం అక్రమంగా బ్లాక్మార్కెట్కు చేరుతున్నట్లు సమాచారం. ఎమ్డియు ఆపరేటర్ల చేతివాటం, గ్రామాల్లో చిన్న, చిన్న వ్యాపారులు కొనుగోలు చేసిన 1200 క్వింటాళ్ల బియ్యం ఒక్క హొళగుంద నుంచే అక్రమంగా తరలి వెళ్తోంది. ఇక నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతినెలా 820 మెట్రిక్ టన్నుల బియ్యం అలాట్మెంట్ అవుతోంది. 53,927 మంది కార్డుదారులు ఉన్నారు.

గవి సిద్ధేశ్వర రైస్ మిల్లో జోరుగా దందా

హొళగుంద గవి సిద్ధేశ్వర రైస్ మిల్లులో అక్రమ బియ్యం దందా జోరుగా సాగుతోంది. చిన్న, చిన్న వ్యాపారులు, ఎమ్డియు ఆపరేటర్లు కిలో రూ.20 ప్రకారం రైస్ మిల్ యజమానికి అమ్ముతున్నారు. ఈ రైస్ మిల్లులో సబ్సిడీ బియ్యాన్ని డబుల్ పాలిష్ చేసి చిన్న బియ్యంగా మార్చి కిలో రూ.40 ప్రకారం బహిరంగ మార్కెట్లో అమ్ముతున్నట్లు సమాచారం. ప్రతినెలా 8 నుంచి 10 లారీల వరకు పాలిష్ చేసిన బియ్యం కర్ణాటక రాష్ట్రానికి తరలించి గవి సిద్ధేశ్వర రైస్మిల్ యజమాని రూ.లక్షల్లో సంపాదిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి.

చోద్యం చూస్తున్న అధికారులు

సబ్సిడీ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నా అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. కొన్ని సందర్భాల్లో పట్టుకొని రాజకీయ నాయకుల ఒత్తిడితో వదిలిపెట్టినట్లు సమాచారం. ఈ అక్రమ బియ్యం వ్యాపారం వెనుక బడా నాయకుల హస్తం ఉన్నట్లు తెలిసింది. జిల్లా అధికారులు స్పందించి సబ్సిడీ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా, పేదల తిండికి ఉపయోగపడేలా చూడాలని ప్రజాసంఘాల నాయకులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం : తహశీల్దార్ ప్రసాద్ రాజా

సెల్ఫోన్ ద్వారా తహశీల్దార్ను ప్రజాశక్తి సంప్రదించింది. నేను విజయవాడలో శిక్షణలో ఉన్నాను. గవి సిద్దేశ్వర రైస్ మిల్లులో సబ్సిడీ బియ్యం పాలిష్ చేయడం, నిల్వ ఉంచడంపై ఆర్ఐ ద్వారా విచారణ చేపడతాం. విచారణలో గుర్తిస్తే చర్యలు తీసుకుంటాం.

టాటానగర్-ఎర్నాకులం ఎక్స్ప్రెస్ సేవలు పెంపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని 18189/18190 టాటా నగర్ - ఎర్నాకులం - టాటానగర్ ఎక్స్ప్రెస్ ఫ్రీక్వెన్సీని వారానికి రెండు సర్వీసుల నుంచి ప్రతిరోజూ ఉండేలా రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో 18189 టాటానగర్-ఎర్నాకులం ఎక్స్ప్రెస్ డైలీ సర్వీస్ మార్చి 7 నుంచి, 18190 ఎర్నాకులం-టాటానగర్ ఎక్స్ప్రెస్ డైలీ సర్వీస్ మార్చి 10 నుంచి అందుబాటులోకి రానున్నాయి.

ఇండియన్ బ్యాంక్
इंडियन बैंक Indian Bank इलाहाबाद ALLAHABAD
మూలలంక భాస్కరరావుపేట, కలిదిండి మండలం, కృష్ణా జిల్లా-521344.

"అనుబంధం-4-ఎ" (రూల్ 8(6)కు నియమాలను చూడండి)
స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తి సెక్యూర్డ్ క్రెడిటర్కు తాకట్టుపెట్టబడినది, దానిని ఇండియన్ బ్యాంక్, సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అధికారిచే నిర్మాణాత్మక స్వాధీనంచేసుకున్నారు, **శ్రీమతి దుగ్గిరాల విజయ దుర్గ (ఋణగ్రహీత)**, నుండి సెక్యూర్డ్ క్రెడిటర్ ఐన ఇండియన్ బ్యాంక్కు బకాయిగా ఏదేని ఉన్నా, తదుపరి వడ్డీ, ఖర్చులు, ఇతర చార్జీలు మరియు దానిపై వ్యయాలతో **22.02.2024** నాటికి బ్యాలెన్స్గా **రూ.54,57,000/- (రూపాయలు యాభై నాలుగు లక్షల యాభై ఏడు వేలు మాత్రమే)**ల రికవరీచేయుట కొరకు **16.03.2024**న **"ఏది ఎక్కడ ఎలా ఉన్నది, అది అక్కడ అలాగే ఉంటుంది"** ప్రాతిపదికన విక్రయించబడుతుంది. రిజర్వుధర **రూ.18,00,000/-** మరియు ధరావత్తు **రూ.1,80,000/-**.

ఆస్తి వివరాలు: సబ్ రిజిస్ట్రార్ ఆకివీడు మరియు కల్లా మండలం, ఎలూర్పాడు గ్రామం, ఆర్ఎస్ నం.187/3, డోర్ నం.3-85/1గా దానిలో 242.00చ.గ.లు (202.00చ.మీ.) విస్తీర్ణంతో ఖాళీ సైటు. సరిహద్దులు: **మొదటి ఐటెం: తూర్పు:** 33అ.ల ఉమ్మడి నడక దారి, **దక్షిణం:** కె. పూర్ణచంద్ర రావు ల్యాండ్, **పడమర:** దేవత రామం ల్యాండ్, **ఉత్తరం:** కె. నరసింహా రాజు ల్యాండ్.
ఆస్తి 1: ఐడిఐబి6349762743.

రిజర్వు ధర: రూ.18,00,000/-; ధరావత్తు: రూ.1,80,000/-
ఇ-వేలం తేది: 16.03.2024; సమయం: ఉ॥ 10.00గం.ల నుండి సా॥ 5.00గం.లు వరకు.
బ్యాంకుకు తెలిసిన ముందస్తు ఋణభారాలు- నిల్

బిడ్డరుదారులు ఆన్లైన్ బిడ్లో పాల్గొనుటకు మా ఇ-వేలం సర్వీస్ ప్రొవైడర్ ఎంఎస్టిసి లిమిటెడ్ యొక్క వెబ్సైట్ (**www.mstcecommerce.com**)ను దర్శించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది. సాంకేతిక సహాయం కొరకు దయచేసి కాల్చేయండి **ఎంఎస్టిసి హెల్ప్డెస్క్ నం.033-22901004** మరియు సర్వీస్ ప్రొవైడర్ హెల్ప్డెస్క్లో అందుబాటులోగల ఇతర హెల్ప్లైన్ నంబర్లును సంప్రదించండి. ఎంఎస్టిసి లిమిటెడ్తో రిజిస్ట్రేషన్ స్థితి కొరకు, దయచేసి సంప్రదించండి **ibapiop@mstcecommerce.com** మరియు **ibapifin@mstcecommerce.com** ధరావత్తు స్థితి కొరకు దయచేసి సంప్రదించండి ఆస్తి వివరాలు మరియు ఆస్తి ఫోటోగ్రాఫ్ మరియు వేలం నియమాలు& నిబంధలనల కొరకు దయచేసి దర్శించండి:**https://ibapi.in** మరియు ఈ పోర్టల్ కు సంబంధించిన సందేహాల కొరకు, దయచేసి సంప్రదించండి: హెల్ప్లైన్ నంబరు **'18001025026' మరియు '011-41106131'.**
బిడ్డరుదారులు ఆస్తి కొరకు వెతుకు సమయంలో పై పేర్కొన్న ఆస్తి ఐడి నంబరును వినియోగించుటకు మరియు ఇతర **https://ibapi.in and www.mstcecommerce.com**వివరాలకు దయచేసి సంప్రదించండి: **9121020048/ 8374092254** ను సంప్రదించవలసిందిగా సలహా ఇవ్వబడుచున్నది.

తేది: 29.02.2024 — **సం/- అధీకృత అధికారి,**
ప్రదేశం: విజయవాడ. — **ఇండియన్ బ్యాంక్, విజయవాడ.**

సర్పంచ్ల హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం

- ఆర్థిక సంఘం నిధుల దారిమళ్లింపు తగదు
- పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు రాజేంద్రప్రసాద్
- కలెక్టరేట్ వద్ద వద్ద సర్పంచ్ల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్రెడ్డి మరోసారి అధికారంలోకి వస్తే గ్రామాలు శిథిలమైపోతా యని, గ్రామీణ ప్రాంత ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్పకూలి పోతుందని పంచాయతీ రాజ్ ఛాంబర్స్ రాష్ట్ర అధ్యక్షులు వై.వి.రాజేంద్రప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. కలెక్టరేట్లోని కార్యాలయం ఎదుట సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్స్ ఆధ్వర్యాన గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 12,918 గ్రామ పంచాయతీల్లో 3 కోట్ల, 50 లక్షల మంది ప్రజలు జీవనం సాగిస్తున్నారని అన్నారు. వారికి ప్రాతినిధ్యం వహిస్తున్న సర్పంచులను ఉత్సవ విగ్రహాలుగా మార్చి ఉన్న నిధులను సైతం బ్యాంకు ఖాతాల నుంచి అపహరించిన చరిత్ర హీనుడు జగన్ అని విమర్శించారు. గ్రామ స్వరాజ్యస్థాపన కోసం గాంధీ మహాత్ముడు కలలు కన్నారని, అటువంటి గ్రామ పంచాయతీ వ్యవస్థను నాశనం చేశారని అన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధులకు గ్రామాల్లో విలువ లేకుండా చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో సర్పంచ్లు తమ సత్తా చూపాలని పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షులు గొండు శంకర్ మాట్లాడుతూ ఎన్నాళ్లుగా పోరాటం చేస్తున్న 16 సమస్యలు పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల గడచిన నాలుగేళ్లలో అనేక పోరాటాలు చేసినా చలనం లేదన్నారు. 14 ,15 ఆర్థిక సంఘం నిధులు రూ.వేల కోట్లు దారిమళ్లించిందన్నారు. గ్రామ వంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థల వల్ల గ్రామ పంచాయతీ వ్యవస్థ పతనమైందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీముత్యాలరావు, పంచాయతీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిరు ప్రతాపరెడ్డి, చుక్క ధనుంజయ యాదవ్, పంచాయతీరాజ్ ఛాంబర్ ఉపాధ్యక్షులు అనెపు రామకృష్ణ, సర్పంచుల సంఘం ఆర్గనైజ్ సెక్రెటరీ పిన్నింటి వెంకట భానోజీనాయుడు, సర్పంచ్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బి.అప్పలనాయుడు, జనసేన సర్పంచ్ గోవిందరెడ్డి, రైతు శ్రీనివాసరావు, శ్రీకాకుళం నియోజకర్గ సర్పంచ్ సంఘం అధ్యక్షులు కొంక్యాన ఆదినారాయణ, సర్పంచ్ల సంఘం ఉపాధ్యక్షులు రుప్ప లక్ష్మీరమణమూర్తి పాల్గొన్నారు.

కొండెక్కిన కోడి మాంసం ధరలు

ప్రజాశక్తి - నరసాపురం (పశ్చిమగోదావరి జిల్లా)

కోడి మాంసం ధరలు అమాంతం పెరిగిపోయాయి. కొన్ని రోజుల క్రితం వరకూ కిలో రూ.200లకుపైగా ఉన్న ధర ఒక్కసారిగా కొండెక్కింది. వేసవిలో ఫారం, బాయిలర్ కోళ్లు ఎండ వేడిమికి చనిపోతుంటాయి. దీంతో పౌల్ట్రీ రైతులు ఫారాల నిర్వహణపై పెద్దగా ఆసక్తి చూపరు. ఒకవేళ నిర్వహించినా నష్టాలు రావడంతో రైతులు వీటికి దూరంగా ఉంటున్నారు. దీంతో కోళ్లు అందుబాటులో లేక ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. దాణా రేట్లు పెరగడం నిర్వహణ భారంగా మారిందని రైతులు చెబుతున్నారు. ఫలితంగా కోడిమాంసం ధర అమాంతం కొండెక్కింది. కిలో బాయిలర్ మాంసం రూ.280, లైవ్ రూ.180, స్కిన్ లెస్ రూ.300, బ్రాయిలర్ బోన్ లెస్ రూ.420లకు విక్రయిస్తున్నారు. ఫారం కోడి మాంసం ధర రూ.200, లైవ్ రూ.150 ఉంది. వేసవిలో గ్రామాల్లో జాతర్లు పెద్ద ఎత్తున జరుగుతుంటాయి. గతంలో కంటే రెస్టారెంట్, భోజనం హోటల్లో, ఫాస్ట్ఫుడ్ సెంటర్లోనూ చికెన్ వినియోగం బాగా పెరిగింది. ఈ కాలంలో చేపల వినియోగం తగ్గి మాంసం వినియోగం పెరగడమూ మరో కారణంగా వ్యాపారులు చెబుతున్నారు. డిమాండ్కు తగినట్లు కోళ్ల ఉత్పత్తి లేకపోవడంతో చికెన్ ధరలు పెరిగాయి. అయితే కోడిమాంసం ధర మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు అంటున్నారు.


'జీవితం-ఉద్యమం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సుధాభాస్కర్, జ్యోతి, స్వరూపారాణి

స్వచ్ఛత కలిగిన రాతలు లక్ష్మీదేవమ్మ రచనలు

- 'జీవితం-ఉద్యమం' పుస్తకావిష్కరణలో సుధాభాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్

ఐద్వా సీనియర్ నాయకురాలు లక్ష్మీదేవమ్మ రచనలు స్వచ్ఛమైన రాతలని నవతెలంగాణ సంపాదకులు సుధాభాస్కర్ తెలిపారు. గురువారం హైదరాబాద్లో లక్ష్మీదేవమ్మ రచించిన జీవితం-ఉద్యమం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. కమ్యూనిస్టు ఉద్యమాన్ని నమ్ముకుని ఊగిసలాటకు గురికాకుండా నికరంగా నిలబడ్డ వారిలో ఆమె ఒకరని చెప్పారు. లక్ష్మీదేవమ్మ రెండు తరాలకు మధ్య వారధి లాంటి వారనీ, అలాంటి వారిని కాపాడుకోవాల్సిన అవసరముందని తెలిపారు. ఐద్వా సీనియర్ నాయకురాలు టి.జ్యోతి మాట్లాడుతూ లక్ష్మీదేవమ్మ రాసిన పుస్తకం చాలా బాగుందని కొనియాడారు. ఆ పుస్తకంలో తన జీవితంలో చూసిన సమస్యలను, నిజ జీవితాన్ని ఆవిష్కరించారని తెలిపారు. ప్రతి మనిషి జీవితంలో సమస్యలున్నప్పటికీ వాటిని ఎలా అధిగమించి లక్ష్యం వైపు వెళ్లారనే విషయాలను రాశారని తెలిపారు. ఈ తరానికి స్ఫూర్తినిచ్చే పుస్తకమన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా ఏపీ నాయకురాండ్లు కె.స్వరూపారాణి, విశాలక్ష్మి, సుధ తదితరులు పాల్గొన్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
గవర్నర్పేట బ్రాంచ్ (0680)
గవర్నర్పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్.
ఫోన్: 0866-2444542, 8331015679

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

దిగువ వారికి:
(1) **శ్రీమతి సంకు మణి, భర్త: శ్రీ సంకు తిరుమల నాయుడు,** ఫ్లాట్ నెం. టి.ఎఫ్. 1, మూడవ అంతస్తు, సాయి పావని రెసిడెన్సీ, ఆర్.ఎస్.నెం. 85/1, సమీప డి.నెం. 6-6/195ఎ, ప్రసాదంపాడు, విజయవాడ రూరల్ -521 108, ఆంధ్రప్రదేశ్.
(2) **శ్రీ సంకు గోవర్ధన నాయుడు, తండ్రి: శ్రీ సంకు తిరుమల నాయుడు,** ఫ్లాట్ నెం. టి.ఎఫ్. 1, మూడవ అంతస్తు, సాయి పావని రెసిడెన్సీ, ఆర్.ఎస్.నెం. 85/1, సమీప డి.నెం. 6-6/195ఎ, ప్రసాదంపాడు, విజయవాడ రూరల్ -521 108, ఆంధ్రప్రదేశ్.

డియర్ సర్ / మేడమ్,
విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.
మా **కెనరా బ్యాంక్, విజయవాడ గవర్నర్పేట** బ్రాంచ్ నుండి **శ్రీమతి సంకు మణి మరియు శ్రీ సంకు గోవర్ధన నాయుడు** పొందిన లోన్ / ఋణసౌకర్యాల వివరములు:

లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం.	లోన్ మొత్తం మరియు లోన్ తేది	ఈ తేది నాటికి వడ్డీతో కలుపుకొని బకాయి మొత్తం	వడ్డీ రేటు
హౌసింగ్ లోన్ అకౌంట్ నెం. 680619004685	రూ.24,00,000/- తేది: 22/02/2018	రూ. 21,75,411.10/-	10.55%

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ **సదరు ఋణాన్ని తేది 20.02.2024న నిరర్ధక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది.** అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా **రూ.21,75,411.10/- (అక్షరాల ఇరవై ఒక్క లక్షల డబ్బై ఐదు వేల నాలుగు వందల పదకొండు రూపాయలు మరియు పది పైసలు మాత్రమే)** + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.
SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్(8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

షెడ్యూల్-ఎ: కృష్ణా జిల్లా, గుణదల సబ్-రిజిస్ట్రీ, విజయవాడ రూరల్, ప్రసాదంపాడు, సమీప డోర్ నెం. 6-6/195, ఆర్. ఎస్ నెం. 85/1 నందు 242 చ॥గ॥లలో అవిభాజ్యపు వాటా స్థలం 20.16 చ॥గ॥లు. **హద్దులు:** తూర్పు: వెలిశల సాంబశివరావు యొక్క ఆస్తి, దక్షిణం: బోయపాటి విజయకుమార్ యొక్క ఆస్తి, పడమర: 20 అ॥ వెడల్పు రోడ్డు, ఉత్తరం: బోయపాటి కిషోర్ బాబు ఇతరులకు అమ్మిన ఆస్తి.
షెడ్యూలు-బి: ఐటమ్ నెం. 1 స్థలం నందు నిర్మించిన "శ్రీ పావని రెసిడెన్సీ", 3వ అంతస్తు, 708 చ॥అ॥ ప్లింత్ ఏరియా (కామన్ ఏరియా కలుపుకొని) మరియు 20 చ॥అ॥ టూ వీలర్ పార్కింగ్ ఏరియా కలిగిన ఫ్లాట్ నెం.టి.ఎఫ్-1. **హద్దులు:** తూర్పు: మెట్లు మరియు ఉమ్మడి వరండా, దక్షిణం: శూన్యాకాశం, పడమర: శూన్యాకాశం, ఉత్తరం: శూన్యాకాశం.
టైటిల్ హోల్డర్ పేరు: శ్రీమతి సంకు మణి, భర్త: శ్రీ సంకు తిరుమల నాయుడు.

తేది: 21.02.2024, ప్రదేశం: విజయవాడ — **సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్**

మహారాజశ్రీ తెనాలి అడిషినల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.569/22 in O.S.143/12

Between:-
లేళ్లపల్లి రత్నభారతి ...పిటీషనర్
Vs
పాతూరి జనార్ధనరావు మరియు వగైరాలు ...రెస్పాండెంట్స్

To
R2- పాతూరి శ్రీమన్నారాయణ మూర్తి S/o రామక్రిష్ణ మూర్తి, R/o ఫ్లాట్ నెం.30, కీర్తి అపార్ట్మెంట్స్, 2/1 క్రిష్ణనగర్, గుంటూరు, గుంటూరు జిల్లా.
R5- హేమాద్రి సుజాత W/o H.V.S.ప్రసాద్, R/o Dr.No.16-2-39, లక్ష్మణరావు వీధి, పూర్ణానందం పేట, విజయవాడ.
R6- పిసపాటి నాగానంత్ S/o సీతారామశాస్త్రి, R/o పంచాయతీ రాజ్ ఆఫీసు, జొన్నలగడ్డ, గుంటూరు జిల్లా.

పై నెంబరు ఫైనల్ డిక్రి పిటిషన్లో మీకు కోర్టు ద్వారా మరియు రిజిష్టరు పోస్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపించినను, మీరు బుద్దిపూర్వకంగా తీసుకొనకుండా తిప్పిపంపుచున్నందున, మీకు ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసు చేయవలసినదిగా పై కోర్టువారు ఉత్తర్వులు జారీచేస్తూ ది.22-03-2024వ తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదా రోజు ఉదయం 10-30 ని.లకు మీకు స్వయంగా కాని, మీ తరుపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పై ఫైనల్ డిక్రి పిటిషన్ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులతో)
వాయిదా తేది:22-03-2024
ఎ.కాశీవిశ్వనాథరాజు,
పి.తరుణ్ కుమార్,
పిటీషనర్స్ తరుపున అడ్వకేట్స్,
తెనాలి.

మహారాజశ్రీ విజయవాడ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్ట్ లో
ఓ.ఎస్.నెంబర్.1309/2022
బిట్వీన్ :
ఐసిఐసి బ్యాంక్ లిమిటెడ్, విజయవాడ,
రిప్రజెంటెడ్ బై జిపిఏ హోల్డర్, విజయవాడ.
..... వాది
మరియు
మట్టుకొయ్య సుధాకర రావు,
S/o. ఎమ్. పెద్ద సాంబయ్య,
నివాసం : డోర్ నెం. 7-16, బాపూజీ నగర్,
బేతపూడి, మంగళగిరి-522503,
గుంటూర్ జిల్లా, ఆంధ్ర ప్రదేశ్.
..... ప్రతివాది

పై నెంబరు దావా నందు పైన తెలిపిన ప్రతివాదికి దావా సమన్లు అందజేయు నిమిత్తం ది.03.04.2024 వ తేదీకి వాయిదా వేసినారు. కావున పైన తెలిపిన ప్రతివాది వాయిదా రోజు ఉదయం గం.10.30 ని. లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ ద్వారా గాని హాజరు అయి వారికి గల ఆక్షేపణలు తెలుపుకొనవలయును. లేని యడల వారి పరోక్షమందు సదరు పై దావా తీర్మానము కాబడునని ఇందుమూలముగా తెలియచేయటమైనది.
(కోర్ట్ వారి ఉత్తర్వులు ప్రకారము)
వాయిదా తేది : 03.04.2024
ఇట్లు
కునుకు రాజశేఖర్,
వాది తరుపు అడ్వకేట్,
గాంధీ నగర్, విజయవాడ-520003

పెళ్లయిన వారానికే.. రోడ్డు ప్రమాదంలో వరుడు మృతి

- వధువు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - మొగల్తూరు

'పెళ్లయి వారం రోజులైనా కాలేదు. నవ వరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో పెళ్లింట పెనువిషాదం నెలకొంది. ఈ విషయం తెలియగానే నవ వధువు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ సంఘటన పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరులో గురువారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. మొగల్తూరు మండలం కొత్తోట గ్రామానికి చెందిన ఏనుగుల అంజి బాబు (31)కు పాలకొల్లు మండలం లంకలకోడేరుకు చెందిన శిరీషాతో ఈ నెల 24న వివాహమైంది. ఫిబ్రవరి 28న తాడేపల్లిగూడెంలో జరిగిన జెండా సభకు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. అక్కడ నుంచి ఏలూరు జిల్లా కొయ్యలగూడెంలో ఉన్న స్నేహితుడిని కలవడానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న శిరీష తీవ్ర మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడారు. కుటుంబీకులు హుటాహుటీన ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. పెళ్లయి వారం రోజులు కాకుండానే రోడ్డు ప్రమాదంలో అంజిబాబు మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఎయుకు రెండు అంతర్జాతీయ పేటెంట్లు

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఆంధ్రవిశ్వవిద్యాలయానికి రెండు అంతర్జాతీ య పేటెంట్లు లభించాయి. ఆంధ్రవిశ్వవిద్యాల యం అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి, కె.వెంకటలక్ష్మి 'మెషీన్ లెర్నింగ్ ఆధారితంగా బయో మెడికల్ ఇమేజ్ విశ్లేషణ చేసి ఖచ్చితంగా వ్యాధి నిర్ధారణ చేసే విధానాన్ని అభివృద్ధి చేసినం దుకు పేటెంట్ మంజూరైంది. మెషీన్ లెర్నింగ్ సహాయంతో ప్రారంభదశలోనే వ్యాధినిర్ధారణ చేయడం వల్ల రోగికి అవసరమైన చికిత్సను సకాలంలో అందించి స్వస్థత చేకూర్చడం సాధ్యపడుతుంది. ఏయూ అంబేద్కర్ చైర్ గత ఆరు నెలలుగా ఉద్దానం కిడ్నీ వ్యాధిగ్రస్తుల మధ్య ఫీల్డ్ విజిట్ చేసి సేకరించిన డేటాను దీనితో అనుసంధానం చేస్తారు. అంబేద్కర్ చైర్ ప్రొఫెసర్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి, ఇనకోటి రవి కుమార్లు అత్యంత ప్రాధాన్యత, గోప్యత కలిగిన సమాచారాన్ని నెట్ వర్క్ ఆధారితంగా పంపే సమయంలో ప్రత్యేకమైన కోడ్ని ఉపయోగించి సురక్షితంగా పంపే విధానాన్ని అభివృద్ధి చేసినందుకు పేటెంట్ లభించింది. రక్షణ రంగంలో, బ్యాంకింగ్ లావాదేవీలు, పరిశ్రమలు, ప్రభుత్వానికి సంబంధించిన వివిధ ప్రముఖమైన సమాచారాలను పంపడానికి ఈ సాంకేతికత ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. ఏయూ నూతనంగా రెండు అంతర్జాతీయ పేటెంట్లు సాధించడం పట్ల ఏయూ వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

కార్యకర్తలు సన్నద్ధం కావాలి

'నిజం గెలవాలి'లో నారా భువనేశ్వరి పిలుపు

ప్రజాశక్తి-కొత్తకోట (అనకాపల్లి జిల్లా)

నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి గురువారం రావికమతం మండలం గంపవానిపాలెం గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమెకు మాజీ ఎంఎల్ఏ కె యస్ ఎన్ యస్ రాజు, నియోజకవర్గం ఇంచార్జి తాతయ్యబాబు, మహిళా అధ్యక్షురాలు కోట నీలవేణి గోవిందరావు, మండల పార్టీ అధ్యక్షులు కొండనాయుడు, పలువురు టిడిపి శ్రేణులు స్వాగతం పలికారు. ఇటీవల చంద్రబాబు నాయుడు అరెస్ట్తో మనస్థాపం చెంది మృతి చెందిన మాకిరెడ్డి పెద్దమ్మ కుటుంబాన్ని పరామర్శించి రూ.3 లక్షల చెక్కును అందించారు. రోలుగుంట మండలంలోని జెపి.అగ్రహారం, కొవ్వూరు గ్రామాల్లోని యర్రంశెట్టి సత్యనారాయణ, సుర్ల దేముడమ్మల కుటుంబాలను పరామర్శించి చెక్కులు అందజేశారు. బుచ్చయ్యపేటలోని ఆర్.భీమవరం గ్రామంలో బత్తుల అక్కన్నాచారి కుటుంబాన్ని, మునగపాకలోని వాడ్రాపల్లి, గొల్లలపాలెం, గవర్ల అనకాపల్లి గ్రామాలలో బాధిత కుటుంబాలను పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ... ప్రతి కార్యకర్త సైనికునిలా పని చేసి టిడిపిని అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

సివిల్ ఇంజనీరింగ్లో అపార అవకాశాలు

జాతీయ ప్రాజెక్టుల నిపుణుడు డాక్టర్ సాయిబాబా

ప్రజాశక్తి-విశాఖపట్నం

ప్రభుత్వాలు మెట్రో రైలు ప్రాజెక్టులు, ఫ్లై ఓవర్లు, జాతీయ రహదారుల విస్తరణ వంటి మౌలిక సదుపాయాల కల్పనపై ప్రధానంగా దృష్టి సారిస్తున్న నేపథ్యంలో సివిల్ ఇంజనీరింగ్ నిపుణులకు నైపుణ్య పరంగా, ఉపాధి పరంగా అపారమైన అవకాశాలు ఎదురుచూస్తున్నాయని రైల్వే వంతెనల సహ దేశంలోని వివిధ ప్రాజెక్టుల నిర్మాణంలో కీలకపాత్ర పోషించిన నిపుణుడు డాక్టర్ ఎ.సాయిబాబా పేర్కొన్నారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో గురువారం ఏర్పాటుచేసిన కార్రక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై ప్రసంగించారు. సివిల్ ఇంజనీరింగ్ అంటే భవన నిర్మాణం కాదని, సృష్టికి ప్రతిసృష్టి చేయడం, సాంకేతికంగా దేశాన్ని ఉన్నత స్థానంలో ఉంచడమని చెప్పారు. సముద్రాలపై నిర్మించే వంతెనలు, అటవీ ప్రాంతాలలో కొండలను తొలచి నిర్మించే రైల్వే టన్నెల్స్, విమానాశ్రయాలు, జాతీయ రహదారులు, నీటిని నిల్వ చేసే ఆనకట్టలు సివిల్ ఇంజనీరింగ్ గొప్పతనాన్ని తెలుపుతాయన్నారు. ఈశాన్య రాష్ట్రాలలో తన పర్యవేక్షణలో జరిగిన రైల్వే వంతెనల నిర్మాణం వెనుక సాంకేతిక సమాచారాన్ని ఆయన వివరించారు. ఏ నిర్మాణానికి ఐనా భద్రతా ప్రమాణాలు పాటించడం కీలకమని తెలిపారు. ప్రస్తుతం తాను పర్యవేక్షిస్తున్న పలు ప్రాజెక్టులలో గీతం సివిల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పించడానికి సిద్ధంగా ఉన్నట్లు డాక్టర్ సాయిబాబా ప్రకటించారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ అధ్యక్షతన సాగిన కార్యక్రమంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న పరిశోధనా ప్రాజెక్టులు, కన్సల్టెన్సీ సేవల గురించి విభాగాధిపతి డాక్టర్ డి.ముకుంద్ వివరించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా) ఫ్యాకల్టీ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.చందనకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు సీతారాం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్

రాష్ట్రంలో బాల్య వివాహాల వ్యవస్థను శాశ్వతంగా నిర్మూలించేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు, ప్రభుత్వేతర సంస్థల సమన్వయంతో అడుగులు వేద్దామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం పిలుపునిచ్చారు. గురువారం నర్సీపట్నం ఆర్డిఓ జయరాం నేతృత్వంలో ఆర్డిఓ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, రెవెన్యూ, విద్యాశాఖ, జిల్లా బాల్య వివాహాల నిర్మూలన అధికారులకు బాల్య వివాహాలు నిర్మూలనలో ప్రభుత్వ శాఖల పాత్రపై డివిజనల్ అవగాహనా సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి హాజరైన గొండు సీతారాం మాట్లాడుతూ, బాల్య వివాహాలపై ఆయా పోలీసు స్టేషన్లలో స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిడులు పట్టించుకోకుండా పూర్తి స్థాయిలో ఎఫ్ఐఆర్లు నమోదు జరిగేలా ఉత్తర్వులు జారీ చేయాలని తమ కమిషన్, డిజిపిని కోరినట్లు తెలిపారు. బాలల హక్కుల పరిరక్షణ, చట్టాల అమలుకు ప్రణాళికలతో అడుగులు వేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సదస్సులు, సమావేశాలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఆర్డీవో జయరాం మాట్లాడుతూ, ప్రధానంగా బాల్య వివాహాల నిలుపుదలలో అన్ని ప్రభుత్వ శాఖల కృషి సమన్వయం అవసరం అన్నారు. జిల్లాలో గ్రామ స్థాయి నుండే బాల్య వివాహాలుపై విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనకాపల్లి స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ప్రోజెక్ట్ ఆఫీసర్ కె.అనంత లక్ష్మి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ సూచనలు, ఆదేశాలతో గ్రామ స్థాయి నుండి వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సీడ్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి వి.సన్యాసిరాజు, సిడిపిఓ మేరీ సువార్త, పోలీసు అధికారి బి.జోగారావు, మండల విద్యాశాఖాధికారి తలుపులు పాల్గొన్నారు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
ఎన్.యు. క్యాంపస్ బ్రాంచ్-04793, ఆచార్య నాగార్జున యూనివర్సిటి, గుంటూరు-522501, గుంటూరు జిల్లా, ఆంప్ర.

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 లోని సెక్షన్ 13(2) క్రింద నోటీసు దిగువ వారికి

ఋణగ్రహీత : **శ్రీమతి కాటమరెడ్డి వెంకట లక్ష్మి, భర్త: బలిజి శ్రీనివాస రావు,** డి.నెం. 92-26-2222, 4వ లేన్, మాబూ నగర్, ఎ.టి. అగ్రహారం, గణేష్ బేకరి ప్రక్కన గుంటూరు జిల్లా-522 004. & డి.నెం. 29-73, 2/19 వ లేన్, బ్రాడీపేట, కె.కె. టవర్స్ దగ్గర, గుంటూరు జిల్లా-522 002. & సమీప డి.నెం. 25-27-37 ఫ్లాట్ నెం.502, 4వ అంతస్తు, గరుడాద్రి మైఫేయిర్ అపార్ట్మెంట్, లాలూపురం రోడ్, గుంటూరు జిల్లా-522 003.

మీరు ఈ దిగువ ఉదహరించిన ఆస్తులను తనఖా ఉంచి **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎన్.యు. క్యాంపస్ బ్రాంచ్-04793, గుంటూరు జిల్లా** వారి నుండి **HTL ఖాతా No. 39547939541** సౌకర్యాలను పొందియున్నారు. సదరు ఋణఖాతాలో **తేది.18.01.2024** నాటికి **రూ.29,31,208/- (అక్షరాలా ఇరవై తొమ్మిది లక్షల ముప్ఫై ఒక్క వేల రెండు వందల ఎనిమిది రూపాయలు మాత్రమే)** సదరు బకాయి మొత్తంపై అంగీకరించిన కాంట్రాక్చువల్ రేటు ప్రకారం వడ్డీ & ఇతర ఖర్చులు మరియు బ్యాంకు ఛార్జీలు బకాయి ఉన్నవి.

స్థిరాస్తుల వివరములు

షెడ్యూలు -ఎ : గుంటూరు జిల్లా, నల్లపాడు రిజిస్ట్రేషన్ సబ్-జిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పోరేషన్ పరిధి, అంకిరెడ్డిపాలెం, అంకిరెడ్డిపాలెం గ్రామ డి.నెం.388/బి వద్ద మొత్తం ఎ.5-15 సెంట్లులో ఎ.0.82 ¼ అమ్మకపు దస్తావేజు సేల్ డీడ్ ప్రకారం మొత్తం 891 చ॥గ॥లలో మొదటి పార్టీ 40 చ॥గ॥లు రోడ్ విస్తరణ కోసం వదిలివేయబడగా మిగిలిన 851 చ॥గ॥లు నందు **"గరుడాద్రి మైఫేయిర్"** అపార్ట్మెంట్ ఆస్తి డాక్యుమెంట్ నెం. 2963/2020, తేది.05.08.2020 (సమీప డోర్ నెం.25-27-37) ప్రకారం **శ్రీమతి కాటమరెడ్డి వెంకట లక్ష్మి, భర్త : బలిజి శ్రీనివాసరావు** గారికి చెందినది.
హద్దులు : తూర్పు: ముయాల సాంబ శివ రావు మరియు ఇతరులు 113'-6", **దక్షిణం :** 30 అ॥ల వెడల్పు గల రోడ్ 72'-0", **పడమర :** శ్రీ పొలపాల కన్స్ట్రక్షన్స్ కి చెందిన ఆస్తి 113'-3", **ఉత్తరం :** శ్రీ పొలపాల కన్స్ట్రక్షన్స్ కి చెందిన ఆస్తి 163'-6".
పై హద్దుల మధ్య విస్తీర్ణం 851 చ॥గ॥లు లేదా 711.53 చ॥మీ॥లు స్థలం ఉన్నది.
షెడ్యూలు -బి : పైన పేర్కొన్న 'ఎ' షెడ్యూలు స్థలం నందు **"గరుడాద్రి మైఫేయిర్"** అపార్ట్మెంట్ నిర్మాణం నందు 42 చ॥గ॥లు లేదా 35.11 చ॥మీ॥లు స్థలం అవిభాజ్యమైన మరియు అనిర్దేశ్యపు వాటా కలిగి, మొత్తం విస్తీర్ణం పైన పేర్కొన్న 'ఎ' షెడ్యూలు స్థలం నందు ప్లింత్ ఏరియా 1060 చ॥అ॥లు (కామన్ ఏరియాలతో కలిపి) ఉన్న అపార్ట్మెంట్, 4వ అంతస్తు, ఒక ఫుల్-ఫినిష్డ్ ఫ్లాట్ నెం 502 యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు :** కామన్ కారిడార్, **దక్షిణం :** లిఫ్ట్ & ఓపెన్ టు స్కై, **పడమర :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై.
ఈ హద్దుల మధ్య చెప్పబడిన **"గరుడాద్రి మైఫేయిర్"** అపార్ట్మెంట్, 4వ అంతస్తు, ఒక ఫుల్-ఫినిష్డ్ ఫ్లాట్ నెం 502 అనగా స్టిల్ట్, మొదటి, రెండవ, మూడవ అంతస్తు నందు అన్ని సౌకర్యాలు మరియు అన్ని సాధారణ మరియు ఉమ్మడి హక్కులు, అనుభవించు హక్కులు, ఈజుమెంటరీ హక్కులు మొ॥నవి వాటితో కలిపి మరియు ఒక కార్ పార్కింగ్ ఏరియాతో స్టిల్ట్ ఫ్లోర్ పార్కింగ్ ఏరియాతో కలిపి ఉన్నది.
మీరు బ్యాంకునకు బాకీవున్న మొత్తమునకు పైన ఉదహరించిన మీకు చెందిన ఆస్తులను తనఖా పెట్టినారు. పైన పేర్కొనబడిన చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **డిమాండ్ నోటీసును ది.19-01-2024** న బ్యాంకు మీకు జారీచేసినది. కాని మీకు పంపినట్టి నోటీసులు మీకు చేరక తిరిగి వెనుకకు వచ్చినది.
అందువల్ల ఈ పత్రికా ప్రకటన ఇవ్వబడినది. మా జారీ షరతులు మరియు నిబంధనలు పాటించుటలో మీరు విఫలమైనందున మీ ఖాతా క్రమము తప్పి ఆర్.బి.ఐ మార్గదర్శకాల ప్రకారం **తేది.31-12-2023 ఎన్.పి.ఎ** గా వర్గీకరించబడినది. ఈ నోటీసు ప్రకటన తేది నుండి కాంట్రాక్టువల్ రేటు ప్రకారం వడ్డీ & ఇతర ఖర్చులు మరియు ఛార్జీలతో కలిపి పైన తెలిపిన సదరు మొత్తమును 60 దినములలో తిరిగి చెల్లించవలసినదిగా మిమ్మల్ని కోరడమైనది. లేనియెడలా ఎటువంటి తదుపరి ప్రకటన లేకుండా సెక్షన్ 13(4) క్రింద పైన తెలిపిన సెక్యూరిటీ పైన SARFAESI చట్టంలోని నిబంధనలు అమలు చేసేందుకు చర్యలు చేపట్టుటకు సెక్యూర్డ్ క్రెడిటర్ అగు దిగువ సంతకందారు సంసిద్ధులౌతారు.
ఉద్దేశించబడిన చట్టంలో మరియు లేదా అమలులో ఉన్న ఏ ఇతర చట్టం క్రింద మాకు లభించే ఏ ఇతర హక్కులకు భంగం కలుగకుండా ఇవి జారీచేయడమైనది.

ప్రదేశం : ఎన్.యు. క్యాంపస్ — **సం/- అధీకృత అధికారి**
తేది : 29-02-2024 — **స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

సందేశ్‌ఖలి అల్లర్ల కేసులో

షాజహాన్ ఎట్టకేలకు అరెస్టు

- బేడీలు కూడా వేయని బెంగాల్ పోలీసులు
- 10 రోజుల కస్టడీ విధించిన కోర్టు
- గ్రామస్తుల సంబరాలు

కోల్‌కతా : అన్నివైపుల నుంచి విమర్శలు రావడంతో సందేశ్‌ఖలి కేసులో ప్రధాన నిందితుడు, తృణమూల్ కాంగ్రెస్ నాయకుడు షేక్ షాజహాన్‌ను బెంగాల్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు. ఉత్తర 24 పరగణాల జిల్లాలో మినాఖాహ బ్లాక్‌లో గురువారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్న పోలీసులు బసిర్‌హత్ కోర్టులో హాజరుపరచగా, ది రోజుల పోలీసు కస్టడీకి కోర్టు అప్పగించింది. సందేశ్‌ఖలీలో హింసకు కారకుడైన ఈ ఘరానా నాయకుణ్ణి ఇన్ని రోజులు కాపాడుకొచ్చిన తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు కంటి తుడుపు చర్యగా పార్టీ నుంచి ఆరేళ్లపాటు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సస్పెన్షన్‌ను చాలా మంది ఇప్పటికే ఎగతాళి చేయనారంభించారు. ఈ కేసును ప్రభుత్వం తన కనుసన్నల్లోని సిఐడి దర్యాప్తునకు అప్పగించింది. సందేశ్‌ఖలి మహిళలపై అత్యాచారం, దహనం, దోపిడి, హత్యలు, భూములను అక్రమించుకోవడం వంటి తీవ్ర అభియోగాలతో 10కి పైగా కేసుల్లో నిందితుడిగా ఉన్నప్పటికీ షాజహాన్ జోలికి పోవడానికి పోలీసులు సంకోచించారు. కారణం అతనికి తృణమూల్ కాంగ్రెస్ పార్టీ దన్నుగా నిలవడమే. ప్రజా ఉద్యమాల నుంచి ఒత్తిడి, కోర్టు చీవాట్లు వీటన్నిటి నేపథ్యంలో ప్రభుత్వం అతడిని అరెస్టు చేయక తప్పలేదు. ఇందుకు 2 నెలల సమయం పట్టింది. గురువారం కోర్టుకు తీసుకొచ్చిన సమయంలో పోలీసులు అతనికి ఎలాంటి సంకెళ్లు వేయలేదు. కనీసం పోలీసులు అతన్ని పట్టుకోనూ లేదు. దర్జాగా కోర్టు హల్లోకి షాజహాన్ నడుచుకుంటూ వెళ్లాడు. షాజహాన్, కోబ్రా బృందంగా పిలవబడే సుమారు 70 మంది అతని మద్దతుదారులు తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని, తమ భూములు బలవంతంగా అక్రమించుకున్నారని సందేశ్‌ఖలిలో మహిళలు కొన్ని రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. షాజహాన్‌పై నేరాభియోగాల తీవ్రతను తగ్గించి చూపేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. గురువారం మీడియా సమావేశంలో శాంతి భద్రతల ఎడిజి సుప్రతిమ్ సర్కార్ మాట్లాడుతూ షాజహాన్‌పై ప్రస్తుతానికి కేవలం రెండు కేసులు మాత్రమే నమోదై ఉన్నాయని అన్నారు మిగిలిన కేసులన్నీ ఫిర్యాదు దశలోనే ఉన్నాయని తెలిపారు.కాగా, షాజహాన్ అరెస్టు వార్తతో సందేశ్‌ఖలిలో గ్రామస్తులు సంబరాల్లో మునిగిపోయారు. మహిళలు వివిధ రంగులతో హోలీ అడగా, పురుషులు నృత్యాలు, చిన్నారులు బాణా సంచా కాల్చడం వంటి పనులతో తమ ఆనందం వ్యక్తం చేశారు. అయితే టిఎంసి ప్రభుత్వం మాత్రం శాంతిభద్రతల పేరుతో సందేశ్‌ఖలి గ్రామంలో 144 సెక్షన్ విధించింది.

ఉద్యమం కొనసాగుతుంది: సలీం

సందేశ్ ఖలిలో పోలీసు నిర్బంధం నడుమ సిపిఎం గురువారం భారీ ర్యాలీ నిర్వహించింది. సందేశ్‌ఖలీలో జరిగిన ఘోరానికి బాధ్యులైన వారిని శిక్షించేవరకు పోరాటం కొనసాగుతుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం అన్నారు. ప్రభుత్వం ఎన్ని ఆంక్షలు పెట్టినా, అవరోధాలు కల్పించినా ఫిబ్రవరి29న సర్దార్‌తో కలిసి తాను సందేశ్ ఖలీకి వెళ్లడం ఖాయమని సలీం ముందే ప్రకటించారు. దానికి అనుగుణంగానే గురువారం అక్కడ భారీ ర్యాలీ నిర్వహించారు. సందేశ్ ఖలీ బాధితులకు న్యాయం చేకూర్చేదాకా వామపక్షాలు పోరాడతాయని అన్నారు. ఈ ర్యాలీలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు సుజన్ చక్రవర్తి, సందేశ్ ఖలీ మాజీ ఎమ్మెల్యే సఫ్ సర్దార్ తదితరులు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం నజాత్‌లో సభ నిర్వహించారు. సందేశ్ ఖలీలో తృణమూల్, బిజెపి సంయుక్తంగా పంచాయితీ నిర్వహించి సిపిఐ(ఎం) కార్యకర్తలను హత్యచేసిందని సలీం అన్నారు. ఇప్పుడు తృణమూల్ దుష్ట పాలనపై తానే పోరాడుతున్నట్టు బిజెపి పోజు పెడుతోందని చెప్పారు. షాజహాన్ అరెస్టు తరువాత సందేశ్‌ఖలీలో 144 సెక్షన్ విధించారు. తృణమూల్ నేతల ఇళ్లకు రక్షణ కల్పించేందుకు, ప్రజా ఉద్యమాన్ని అణచేందుకే ఈ చర్య అని సలీం విమర్శించారు.



సందేశ్‌ఖలిలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి సలీం

తూతుకుడి ప్లాంట్‌పై పిటీషన్ కొట్టివేసిన సుప్రీం

న్యూఢిల్లీ : తమిళనాడులోని తూతుకుడి స్టెరిలైట్ కాపర్ ప్లాంట్‌ను పున:ప్రారంభించాలని కోరుతూ వేదాంత సంస్థ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటీషన్‌ను గురువారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. పర్యావరణ నిబంధనలను ఉల్లంఘిస్తున్న తూతుకుడి ప్లాంట్‌ను శాశ్వతంగా మూసివేయాలన్న తమిళనాడు ప్రభుత్వం, తమిళనాడు కాలుష్య నియంత్రణ బోర్డు నిర్ణయాన్ని ధృవీకరిస్తూ 2020 ఆగస్టులో మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు గురువారం సమర్థించింది. తూతుకుడి ప్లాంట్‌లో ఉత్పత్తి, ఉపాధి జరుగుతున్నప్పటికీ సుస్థిర అభివృద్ధి, పర్యావరణం, ప్రజారోగ్యం వంటి అత్యవసరమైన, ముఖ్యమైన అంశాలను సమర్థిస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిందని సుప్రీంకోర్టు పేర్కొంది. స్థానిక ప్రజల ఆరోగ్య సమస్య అన్నింటికంటే ముఖ్యమని, ప్రజలను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేసింది. తూతుకుడిలో నదికి ఆనుకుని ఉన్న ప్రైవేటు భూములతో సహా 11 క్షేత్రాల్లో కాపర్ స్లాగ్‌ను డంపింగ్ చేయడంతోపాటు అనేక పర్యావరణ నిబంధనలను ఈ ప్లాంట్ యాజమాన్యం పదేపదే ఉల్లంఘించింది.

పశ్చిమ దేశాల ఆటలు సాగవు పుతిన్

మాస్కో : రష్యాను మరో ఉక్రెయిన్ లాగా మార్చాలని అమెరికా, దాని మిత్ర దేశాలు కుతంత్రాలు పన్నుతున్నాయని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. మాస్కోలోని గోస్టినీ డ్వోర్‌లో ఫెడరల్ అసెంబ్లీలో వార్షిక ప్రసంగం చేస్తూ, పశ్చిమ దేశాల కుతంత్రాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఉక్రెయిన్‌తో పాటు అనేక ఇతర దేశాలను ధ్వంసం చేసినట్టే రష్యాను ధ్వంసం చేయాలని పశ్చిమదేశాలు చూస్తున్నాయి. అటువంటి ఆటలు ఇక్కడ సాగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. అవి తమ వలసవాద అలవాట్లను మానుకోలేదు, ప్రపంచవ్యాప్తంగా జాతుల మధ్య ఘర్షణలను రేకెత్తించి తమ ప్రపంచ ఆధిపత్యానికి తిరుగులేకుండా చూసుకోవాలని చూస్తున్నాయి అని రష్యా నాయకుడు ఫెడరల్ అసెంబ్లీకి చెప్పారు, రష్యాను వారికి అణగిమణిగి ఉండే ప్రదేశంగా మార్చాలనుకుంటున్నారు. మన అంతర్గత వ్యవహారాల్లో ఎవరినీ జోక్యం చేసుకోవడానికి అనుమతించే ప్రశ్నే లేదు అని పుతిన్ ఉద్ఘాటించారు. రష్యాపై అమెరికా, దాని మిత్రదేశాలు ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. ఇందులో ఉక్రెయిన్ వివాదం ఒక అంశం మాత్రమే.కొత్త బహుళ ధ్రువ ప్రపంచం ఉద్భవిస్తున్నదనే విషయాన్ని పశ్చిమ దేశాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఆర్థిక పరిమితుల నుండి సైనిక శక్తిని పూర్తిగా ఉపయోగించడం వరకు అన్ని విధాలుగా రష్యాతో సహా ఎదుగుతున్న శక్తులను తొక్కేయాలని పాశ్చాత్య దేశాలు చూస్తున్నాయి. ఉక్రెయిన్ రష్యన్ పౌరులపై హింసను ప్రయోగించినందున ఆ దేశంపై చర్య తీసుకోవడం మినహా తమకు "వేరే మార్గం లేదు" అని పుతిన్ పేర్కొన్నారు. అమెరికా నేతత్వంలోని సైనిక కూటమి తమ అభ్యంతరాలను పట్టించుకోకుండా రష్యా సరిహద్దుల వైపు నాటో దళాలను విస్తరిస్తూనే ఉందని పుతిన్ చెప్పారు.

శరద్ పవార్ విందుకు 'విరోధు'లకు ఆహ్వానం

ముంబయి:మార్చి 2న ఎన్‌సిపి వ్యవస్థాపకులు శరద్ పవార్ తన నివాసంలో ఇచ్చే విందుకు ఆయన రాజకీయ ప్రత్యర్థులకు ఆహ్వానం పంపడం సంచలనంగా మారింది. ముంబయిలోని బరాబతిలోని శరద్ పవార్ నివాసంలో శనివారం విందు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ విందుకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉపముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవిస్, అజిత్ పవార్‌లకు ఆహ్వానం అందింది. ఎన్‌సిపిలో కొంతమంది ఎమ్మెల్యేలను చీల్చి బిజెపి నేతృత్వంలోని మహారాష్ట్ర ప్రభుత్వంలో అజిత్ పవార్ గ్రూపు చేరిన సంగతి తెలిసిందే. అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రి కూడా అయ్యారు. ప్రస్తుతం ఎన్‌సిపి పేరు, గుర్తులపై శరద్‌పవార్, అజిత్ పవార్ గ్రూపుల మధ్య వివాదం కూడా నడుస్తోంది. ఇలాంటి సమయంలో శరద్ పవార్ విందుకు వీరికి ఆహ్వానం రావడం విశేషంగా మారింది.

హక్కుల సాధనకు

కదంతొక్కిన రైతులు, ఆదివాసీలు

- నాసిక్ కలెక్టరేట్ వద్ద వేలాదిగా బైఠాయింపు
- అటవీ భూముల హక్కుల కోసం, ఉల్లికి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్



నాసిక్ కలెక్టరేట్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న వేలాది మంది రైతులు, ఆదివాసీలు

నాసిక్ : నాసిక్ కలెక్టరేట్ వద్ద వేలాదిమంది రైతులు, ఆదివాసీలు బైఠాయించారు. మహారాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను నెరవేర్చకపోతే మార్చి 2 నుంచి ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఏళ్ల తరబడి అటవీ భూమిని సాగుచేస్తున్న గిరిజన రైతులకు యాజమాన్య హక్కు కల్పించాలని, ఉల్లికి కింటాకు రూ.2,000 కనీస మద్దతు ధర ప్రవేశపెట్టాలని, ఉల్లి ఎగుమతులపై నిషేధాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన నాసిక్ జిల్లా కలెక్టరేట్ ఎదుట గిరిజనులు, రైతులు చేపట్టిన నిరవధిక ఆందోళన గురువారం నాలుగోరోజూ కొనసాగింది. నాసిక్ జిల్లా 15 తాలూకాలకు చెందిన 25 వేల మందికిపైగా రైతులు, గిరిజనులు నిరసనలో పాల్గొన్నారు.

గాజాలో ఊచకోతకు

లైసెన్స్ ఇచ్చింది అమెరికానే!

- ఐరాస సహాయక సంస్థల వెల్లడి

న్యూయార్క్: పాలస్తీనీయులను చంపేందుకు ఇజ్రాయిల్‌కు లైసెన్స్ ఇచ్చింది అమెరికాయేనని ఐక్యరాజ్య సమితికి చెందిన మూడు సంస్థలు విమర్శించాయి. పాలస్తీనీయులకు మానవతా సాయం అందకుండా చేయడం, కాల్పుల విరమణకు అడ్డు పడడంలో ఇజ్రాయిల్‌కు ఎంత పాత్ర ఉందో, అమెరికాకు కూడా అంతే పాత్ర ఉందని ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి), మానవతా వ్యవహారాల సమన్వయ కార్యాలయం (ఓసిహెచ్‌ఎ), ఆహార, వ్యవసాయక సంస్థ (ఎఫ్‌ఎఓ) చెప్పాయి. గాజాలో తాజా పరిస్థితిపై ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి (యుఎన్‌ఎస్‌సి)కి ఈ సంస్థలు మంగళవారం ఇచ్చిన రిపోర్టులో ఈ మేరకు అభిప్రాయపడ్డాయి. గుయానా, స్విట్జర్లాండ్, అల్జీరియా, స్లొవేనియా అభ్యర్థన మేరకు ఐరాస భద్రతా మండలి దీనిపై ప్రత్యేక సమావేశం నిర్వహించింది. గాజాలో మొత్తం 22 లక్షల మంది పాలస్తీనీయులకు గాను చాలా మంది ఇప్పటికే ఇతర ప్రాంతాలకు శరణార్థులుగా వెళ్లిపోగా, మిగిలినవారిలో 5 లక్షల మంది ఇప్పుడు తీవ్రమైన క్షామాన్ని ఎదుర్కొంటున్నారని డబ్ల్యుఎఫ్‌పి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కార్ల్ స్కువా భద్రతామండలికి తెలిపారు. ఆరేళ్లలోపు పిల్లల్లో పౌష్టికాహార లోపం చాలా తీవ్రంగా ఉందని స్కువా తెలిపారు. ఆసుపత్రులకు విద్యుత్, మంచినీరు సరఫరా చేయడం, పారిశుధ్య సేవలను పునరుద్ధరించడం, మానవతా సాయం సరఫరాలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా చూడడం తక్షణం చేపట్టాలని స్కువా తెలిపారు. ఇజ్రాయిల్ దళాలు విచక్షణా రహితంగా జరుపుతున్న వైమానిక దాడుల్లో ప్రజా పంపిణీ వ్యవస్థ మొత్తం దెబ్బతినిపోయింది, ఆసుపత్రులను, ఐరాస సహాయక శిబిరాలను కూడా వారు వదల్లేదు. 5 మాసాలుగా సాగుతున్న ఈ దాడుల్లో గాజాలో వైద్య, ఆరోగ్య రంగానికి సంబంధించిన అన్ని మౌలిక సదుపాయాలు ధ్వంసమయ్యాయని చెప్పారు. ఇజ్రాయిల్ చర్యలను అమెరికన్ ప్రతినిధి రాబర్ట్ వుడ్ వెనకేసుకొచ్చారు. ఐక్యరాజ్య సమితి సహాయక చర్యల సంస్థ (యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎ)ను గాజాలో తిరిగి పనిచేసుకునేందుకు అనుమతించాలని చైనా, రష్యాతో సహా పలు ప్రపంచ దేశాలు డిమాండ్ చేశాయి.



సహాయం కోసం నిరీక్షిస్తున్న వారిపై బాంబు దాడులు : 70 మంది మృతి

వెస్ట్ గాజా సిటీలోని కోస్టల్ రోడ్డులో ఆహార పొట్లాల కోసం ఎదురు చూస్తున్న పాలస్తీనా పౌరులపై గురువారం ఇజ్రాయిల్ జరిపిన బాంబు దాడుల్లో 70 మంది చనిపోయారని పాలస్తీనియన్ వైద్య సిబ్బంది, ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

స్టే ఆర్డర్ ఆటోమేటిక్‌గా రద్దు కాదు : సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: సివిల్, క్రిమినల్ కేసుల్లో దిగువ కోర్టు లేదా హైకోర్టు ఇచ్చిన స్టే ఆర్డర్ ఉత్తర్వులు ఆరు నెలల తర్వాత ఆటోమేటిక్‌గా రద్దు కావని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయ మూర్తులతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. దిగువ కోర్టుల స్టే ఆర్డర్‌లను ప్రత్యేకంగా పొడిగించకపోతే అవి రద్దు అవుతాయన్న 2018 నాటి సుప్రీంకోర్టు తీర్పుతో తాము ఏకీభవించడం లేదని రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. కేసుల పరిష్కారానికి కాలక్రమాన్ని నిర్ణయించడం రాజ్యాంగ ధర్మాసనం, సుప్రీంకోర్టు, హైకోర్టులు మానుకోవాలని రాజ్యాంగ ధర్మాసనం సూచించింది. అసాధారణ పరిస్థితులలో మాత్రమే అలా చేయవచ్చని పేర్కొంది. ఈ మేరకు వేర్వేరుగా రెండు ఏకకాల తీర్పులను గురువారం ప్రకటించింది. సివిల్, క్రిమినల్ కేసుల్లో స్టే ఆర్డర్ ఆటోమేటిక్‌గా రద్దు కాదని న్యాయమూర్తి ఎఎస్ ఒకా తెలిపారు. మార్గదర్శకాలకు సంబంధించి విడిగా, ఏకకాలిక తీర్పును న్యాయమూర్తి పంకజ్ మిథాల్ వెల్లడించారు.

పాస్‌పోర్టులు, వీసాలు రద్దు

- ఆందోళన చేసిన రైతులపై హర్యానా సర్కారు కక్షసాధింపు
- ఖనౌరీ సరిహద్దు వద్ద శుభకరన్ భౌతిక కాయానికి ఘన నివాళి
- హత్య కేసు నమోదు చేసిన పంజాబ్ పోలీసులు
- 17వ రోజూ రైతుల ఆందోళన



శుభకరన్‌కు నివాళులర్పిస్తూ నినాదాలు చేస్తున్న రైతులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ సరిహద్దుల్లో నిరసనలు చేపట్టిన రైతులపై హర్యానా పోలీసులు కుట్ర పూరిత, బెదిరింపు చర్యలకు సిద్ధమయ్యారు. పంటలకు కనీస మద్దతు ధరసహా పలు డిమాండ్ల సాధనకు జరుగుతున్న ఆందోళనలో పాల్గొన్న పలువురు రైతులను గుర్తించి, వారి పాస్‌పోర్టులు, వీసాలను రద్దు చేయాలని హర్యానా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంపై రైతులు, నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఫిబ్రవరి 21న ఖనౌరీ సరిహద్దులో సిఆర్‌పిఎఫ్ బలగాలు, హర్యానా పోలీసులు రబ్బరు బుల్లెట్లు, పెల్లెట్ గన్‌లతో దాడి చేయడంతో యువరైతు శుభకరన్ సింగ్ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ఎట్టకేలకు పంజాబ్ పోలీసులు కేసు నమోదు చేయడంతో ఆయన భౌతిక కాయానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు రైతులు, కుటుంబ సభ్యులు అంగీకరించారు. బుధవారం రాత్రి పోస్టుమార్టం చేశారు. రాజింద్ర ఆస్పత్రి నుంచి ఖనౌరీ సరిహద్దుకు శుభకరన్ సింగ్ భౌతిక కాయాన్ని అంబులెన్స్‌లో తీసుకొచ్చారు. అక్కడ రైతులు, నాయకులు నివాళు లర్పించారు. ఆయన భౌతికకాయంపై తమ సంఘాల జెండాను కప్పారు. గురువారం మధ్యాహ్నం బటిండాలోని ఆయన స్వగ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. అంబులెన్స్ వెంట నడిచిన రైతులు 'అమర్ షహీద్ శుభకరన్ సింగ్ జిందాబాద్' అంటూ నినాదాలు చేశారు. ఆయన మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

17వ రోజూ కొనసాగిన రైతుల ఆందోళన

రైతులు పండించిన అన్ని పంటలకు సి2ప్లస్50 శాతంతో కూడిన ఎంఎస్‌పి హామీతో పంట సేకరణ చట్టం తీసుకురావాలని, రైతులకు రుణ విముక్తి కోసం రైతు రుణమాఫీ చేయాలని, బీమా సదుపాయం కల్పించాలని, పెన్షన్ ఇవ్వాలని, ఇన్‌పుట్ సబ్సిడీ పలు పెంచాలని, విద్యుత్ బిల్లును ఉపసంహరించుకోవాలని తదితర డిమాండ్ల సాధన కోసం రైతులు చేపట్టే ఆందోళన గురువారానికి 17 రోజుకు చేరుకుంది. హర్యానా-పంజాబ్ సరిహద్దులు శంభూ, ఖానౌరీ ప్రాంతాల్లో రైతుల ఆందోళన కొనసాగుతోంది. టెంట్లు, ట్రాలీ వాహనాల్లో ఉంటూ, రోడ్లపైనే రాత్రింబవళ్లు ఆందోళన చేస్తున్నారు.

కేరళ లోకాయుక్త బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం

- ఇది ప్రభుత్వ విజయం : సిపిఐ(ఎం)

తిరువనంతపురం : కేరళ లోకాయుక్త (సవరణ) బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేయడంపై కేరళలోని అధికార ఎల్‌డిఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. కేరళ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై సంతకం చేయడానికి 'మొండిగా నిరాకరిస్తున్న' గవర్నర్ ఆరిఫ్ మహ్మద్ ఖాన్ వైఖరికి ఇది విరుద్ధంగా ఉందని స్పష్టం చేసింది. కేరళ న్యాయశాఖ మంత్రి పి.రాజీవ్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఎం వి గోవిందన్ మాట్లాడుతూ ఈ బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం లభించడాన్ని ప్రభుత్వ విజయంగా అభివర్ణించారు. గవర్నర్ ఖాన్‌కు ఇదొక గుణపాఠం అని చెప్పారు.

అసెంబ్లీ అమోదించిన బిల్లులపై సంతకం చేయకుండా గవర్నర్ ఖాన్ తన వద్దే నిలిపిఉంచుకోవడాన్ని వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టును కేరళ ప్రభుత్వం ఆశ్రయించిన సంగతి తెలిసిందే. దీంతో ఏడు బిల్లులను రాష్ట్రపతి పరిశీలన కోసం ఖాన్ పంపారు. వీటిలో కేరళ లోకాయుక్త (సవరణ)బిల్లు కూడా ఒకటి.

చెట్టుకు వేలాడుతూ బాలికల మృతదేహాలు

- యుపిలో మరో ఘోరం
- సామూహిక అత్యాచారం చేశారు : కుటుంబ సభ్యుల ఫిర్యాదు

లక్నో : సామూహిక అత్యాచారానికి గురైనట్లు భావిస్తున్న ఇద్దరు బాలికల మృతదేహాలు చెట్టుకు వేలాడుతూ కనిపించాయి. వారితో బలవంతంగా మద్యం తాగించి, ఆపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాలికల కుటుంబం ఫిర్యాదు చేసింది. నిందితులైన ఇద్దరు యువకులతోపాటు కాంట్రాక్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు.

ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ జిల్లా కొత్వాలి ప్రాంతంలోని గ్రామంలో బుధవారం అర్ధరాత్రి చెట్టుకు వేలాడుతున్న 16, 14 ఏళ్ల వయసున్న బాలికల మృతదేహాలను స్థానికులు గుర్తించారు. కాంట్రాక్టర్ కుమారుడు, మేనల్లుడు బాలికలతో మద్యం తాగించి, అత్యాచారానికి పాల్పడ్డారని ఇటుక బట్టీలో పని చేసే బాలికల కుటుంబం ఆరోపించింది. దీనిని వీడియో తీయడంతో అవమానం తట్టుకోలేక ఇద్దరు బాలికలు చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలో ఉన్న వీడియో క్లిప్స్‌ను పరిశీలిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఇటుక బట్టీకి సుమారు 400 మీటర్ల దూరంలోని చెట్టుకు వేలాడుతూ బాలికల మతదేహాలు కనిపించాయని వెల్లడించారు.

సిబిఐ విచారణకు హాజరుకాని అఖిలేష్ యాదవ్

లక్నో : సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షులు, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ గురువారం సిబిఐ విచారణకు హాజరుకాలేదు. మైనర్ ఖనిజాల అక్రమ మైనింగ్ కేసులో గురువారం విచారణకు హాజరుకావాలని అఖిలేష్‌కు బుధవారం సిబిఐ సమన్లు జారీ చేసిన సంగతి తెలిసిందే. ముందుగా నిర్ణయించుకున్న కార్యక్రమాల కారణంగా గురువారం విచారణకు హాజరుకాలేనని, విచారణకు అన్ని విధాల సహకరిస్తానని తన న్యాయవాది ద్వారా సిబిఐకి అఖిలేష్ యాదవ్ సమాచారం ఇచ్చారు.

సిబిఐని ఎదుర్కోవడం కొత్త కాదు : అఖిలేష్

గురువారం లక్నోలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో అఖిలేష్ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికల ముందు సమన్లు జారీ చేస్తూ బిజెపి విభాగంలా వ్యవహరిస్తారంటూ సిబిఐపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలను బిజెపి కొనుగోలు చేయవచ్చునని, ప్రజలను కొనుగోలు చేయలేరని అన్నారు. 'మా కుటుంబానికి సిబిఐను ఎదుర్కోవడం కొత్త కాదు, ములాయం సింగ్ యాదవ్ ఎన్నేళ్లు సిబిఐను ఎదుర్కొన్నారో గుర్తు చేసుకోండి. దళితులు, అల్పసంఖ్యాక వర్గాల వారి కోసం పోరాడటం కోసం ఇటువంటి హింసలను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాం' అని చెప్పారు. దేశంలోని బడా పారిశ్రామికవేత్తలకు రూ.15 లక్షల కోట్లు మాఫీ చేసిన కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రైతు రుణాలను మాత్రం మాఫీ చేయలేకపోతోందని విమర్శించారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో యుపిలోని మొత్తం 80 సీట్లనూ ఇండియా వేదిక గెలుచుకుంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

'రూఫ్ టాప్ సోలార్ స్కీమ్'కు కేంద్ర కేబినెట్ ఆమోదం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

'రూఫ్ టాప్ సోలార్ స్కీమ్'కు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన గురువారం నాడిక్కడ జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈమేరకు నిర్ణయం తీసుకున్నారు. మంత్రివర్గ నిర్ణయాలను కేంద్ర మంత్రులు అనురాగ్ ఠాకూర్, అశ్వినీ వైష్ణవ్ కేంద్ర మీడియాకు వెల్లడిస్తూ, "పిఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన" పేరుతో రూఫ్ టాప్ సోలార్ స్కీమ్ కింద కోటి కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల దాకా విద్యుత్‌ను ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందన్నారు. 2025 నాటికి అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలపై రూఫ్ టాప్ సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. ఈ సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు వెబ్‌సైట్‌లో గృహ వినియోగదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

మూడు సెమీకండక్టర్స్ యూనిట్ల ఏర్పాటు

దేశంలో సెమీకండక్టర్స్ అండ్ డిస్‌ప్లే మాన్యుఫ్యాక్చరింగ్ ఎకోసిస్టమ్స్ డెవలప్‌మెంట్ కింద మూడు సెమీకండక్టర్ యూనిట్ల ఏర్పాటుకు ఆమోదం లభించినట్లు మంత్రులు తెలిపారు. 2024 ఏప్రిల్ 1 నుండి సెప్టెంబర్ 30 వరకు) ఫాస్ఫేటిక్, పొటాసిక్ (పికె) కోసం పోషకాల ఆధారిత సబ్సిడీ (ఎన్బిఎస్) రేట్లను నిర్ణయించడానికి కేంద్ర ఎరువుల శాఖ ప్రతిపాదనకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఎరువులు, ఎన్‌బిఎస్ పథకం కింద మూడు కొత్త ఎరువుల గ్రేడ్‌లను చేర్చే ప్రతిపాదనను ఆమోదించింది. గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) చట్టం, 1957కి బెరీలియం, కాడ్మియం, కోబాల్ట్, గాలియం, ఇండియం, రెనియం, సెలీనియం, టాంటాలమ్, టెల్లూరియం, టైటానియం, టంగ్‌స్టన్, వనాడియం వంటి 12 కీలకమైన, వ్యూహాత్మక ఖనిజాలకు సంబంధించి రాయల్టీ రేటును పేర్కొనడానికి రెండో షెడ్యూల్ సవరణకు కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. నాగ్‌పూర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వన్ హెల్త్ డైరెక్టర్‌గా సైంటిస్ట్ హెచ్ స్థాయిలో (పే లెవెల్ 15లో) ఒక పోస్టును పెట్టే ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది.

1993 బాంబు పేలుళ్ల కేసులో తుండా నిర్దోషి

అజ్మీర్ : 1993 వరుస బాంబు పేలుళ్ల కేసులో ప్రధాన నిందితుడు 81 ఏళ్ల అద్దుల్ కరీం తుండాను ఇక్కడి టాడా ప్రత్యేక కోర్టు గురువారం సరైన ఆధారాలు లేని కారణంగా నిర్దోషిగా పేర్కొంది. ఇదే కేసులో మరో ఇద్దరికి జీవితఖైదు విధించింది. 1993 డిసెంబరు 6న ముంబయి, లక్నో, కాన్పూర్, హైదరాబాద్ వంటి నగరాలతో సహా దేశవ్యాప్తంగా రాజధాని ఎక్స్‌ప్రెస్‌లలో వరుస పేలుళ్ల సంభవించాయి. ఈ పేలుళ్లలో ఇద్దరు మరణించగా, అనేకమంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ కేసులో మాస్టర్‌మైండ్‌గా ఆరోపిస్తూ అబ్దుల్ కరీం తుండాను 2014 జనవరిలో నేపాల్ సరిహద్దులో సిబిఐ అరెస్టు చేసింది. తాజాగా కరీంను టాడా కోర్టు నిర్దోషిగా పేర్కొంది. ఈ కేసులో 70 ఏళ్ల ఇర్ఫాన్ అలియాస్ పప్పు, 44 ఏళ్ల హమిదుద్దీన్‌కు కోర్టు జీవితఖైదు విధించింది. కరీం మరో కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్నారు.

జైళ్లలో కుల ఆధారిత వివక్ష, విభజన వద్దు

- సుప్రీం తీర్పుతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆదేశాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఖైదీలను వారి కులం, మతం ఆధారంగా వేరు చేయడానికి అందించే "వివక్షపూరిత" నిబంధనలు వారి సంబంధిత జైలు మాన్యువల్, చట్టంలో లేవని నిర్ధారించుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పేర్కొంది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల(యుటి)లోని జైలు పరిపాలనలను విభాగాలకు మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఇటువంటి జైలు మాన్యువల్‌లు, చర్యలు తమ దృష్టికి వచ్చాయని, ఇది రాజ్యాంగానికి విరుద్ధమని మంత్రిత్వ శాఖ పేర్కొంది. కుల ఆధారిత వివక్ష, జైళ్లలో ఖైదీలను వేరుచేస్తున్నారని ఆరోపించిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిఐఎల్)పై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వంతో పాటు 11 రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసిన రెండు నెలల తరువాత కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ చర్య తీసుకుంది.

ముడుపుల కుంభకోణంపై జపాన్ ప్రధాని క్షమాపణలు

టోక్యో: పాలక ఎల్‌డిపి కొన్ని సంస్థల నుంచి రహస్యంగా ముడుపులు స్వీకరించినందుకు జపాన్ ప్రధాని కిషిదా పార్లమెంటరీ ప్యానెల్ ఎదుట క్షమాపణలు చెప్పారు. రాజకీయ పార్టీలకు నిధులపై నియంత్రణకు సంబంధించిన చట్టాలను సంస్కరించేందుకు తాను కృషి చేస్తానని అన్నారు. గురువారం పార్లమెంటరీ ఎథిక్స్ కమిటీ ముందు కిషిదా హాజరయ్యారు.



మీ కోసం

ఆమ్లెట్ వేసేముందు పెనం మీద కొంచెం ఉప్పు చల్లితే అంటుకోకుండా ఉంటుంది.

జీవన సౌరభం

వృథా చేసే ప్రతి క్షణం భవిష్యత్తు లక్ష్యాలను తారుమారు చేస్తుంది.

రోలు మొర.. మద్దెల చుర చుర



అనగనగా ఒక ఊళ్ళో సీతాపతి అనే మద్దెల వాయిద్య కళాకారుడు ఉండేవాడు. నిత్యం కార్యక్రమాల్లో పాల్గొంటూ తన అసమాన ప్రతిభతో అందరి మెప్పు పొందేవాడు. వారు ఇచ్చిన డబ్బుతో జీవనం సాగించేవాడు.

సీతాపతి ఇంట్లో కర్రతో చేసిన రోలు, రోకలి ఉండేవి. ఆ ఊరి మొత్తం మీద అదొక్కటే రోలు, రోకలి. ఒకసారి పొరుగూరిలో కార్యక్రమాన్ని ముగించుకుని ఇంటికి చేరుకున్నాడు సీతాపతి.

గుమ్మంలో ఉన్న రోలు పక్కనే మద్దెలను ఉంచి విశ్రాంతి తీసుకోవడానికి గదిలోకి వెళ్ళాడు. ఇదే అదనుగా భావించి రోలు 'ఎన్ని రోజులయ్యింది మిత్రమా నిన్ను కలిసి. పక్కనించే వెళ్తావు కానీ తలతిప్పి చూడవు, పలకరించవు. నీ పని బాగుంది, రోజుకో ఊరికి షికారు చేసి వస్తున్నావు. నేను ఈ ఊరు దాటలేదు. అయినా ఎన్ని అనుకుని ఏం లాభం చేసుకున్నవారికి చేసుకున్నంత' అంది నిట్టూరుస్తూ.

'ఏమైంది మిత్రమా... అంత బాధ పడుతున్నావు?' అని అడిగింది మద్దెల.

'ఏమని చెప్పను? ఊరు మొత్తానికి నేనొక్క దాన్నే అవడంతో పసుపు దంచడానికి, వడ్లు దంచడానికి నన్ను వాడి నా ఒళ్లు హూనం చేస్తున్నారు. అన్నట్టు మర్చిపోయాను కారం దంచిన రోజు అయితే నా ముక్కు పుటాలు అదురుతాయి. ఊపిరి ఆడదు. తుమ్ములే తుమ్ములు. నా కష్టాలు ఎన్నని చెప్పను?' అని మద్దెల దగ్గర వాపోయింది రోలు.

'మిత్రమా నీటిలో మునిగిపోతున్న వాడి మెడను మరొకడు పట్టుకున్నట్టు, నీ కష్టాలు నాకే చెప్పు..' అంది మద్దెల.

'ఎందుకలా అన్నావు" అని అడిగింది రోలు. 'నీకు ఒక వైపే వాయింపు. నాకు గూబలు గుయ్యి మన్నట్లు రెండు పక్కలా వాయింపే. ఆ శబ్దాన్ని నేను భరించలేకున్నాను. నేను ఎవరితో చెప్పుకోను?' అంది మద్దెల బాధగా.

'రోలు వెళ్ళి మద్దెలతో మొరపెట్టుకుంది చూడు... భలే భలే' అని పకపక నవ్వింది రోకలి.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.

లెక్క చేయండి

పిల్లలూ, కింద ఇచ్చిన లెక్కల వరుసల్లో ఖాళీగా ఉన్న బాక్సుల్లో సరైన అంకెలు వేయండి. సమాధానాలు సరిచూడండి.

1. 13 + □ - 7 = 8
2. 5 + 4 + 3 = □
3. □ + 6 - 4 = 5
4. 8 - 1 + □ = 11
5. 10 - □ - 3 = 0

నేను గీసిన బొమ్మ





పవని కృష్ణ సాయి లాస్య,
4వ తరగతి,
సెయింట్ ఆన్స్ పాఠశాల,
చీరాల.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఉపాధికి బాసటగా .. భాషా శిక్షణ

జీవన నైపుణ్యాలకు తోడు భాషలపై పట్టుంటే ఏ రంగంలోనైనా రాణించొచ్చు. ఇప్పుడు ఉద్యోగ పరీక్షలు రాయాలంటే ఆంగ్లంలో పట్టు చాలా అవసరం. అందుకే చాలామంది డిగ్రీలు పూర్తి చేసిన తర్వాత స్పోకెన్ ఇంగ్లీషు తరగతులకు హాజరవుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో ఇంగ్లీషు భాషా నైపుణ్యం పెంపొందించటమే లక్ష్యంగా కృష్ణా విశ్వ విద్యాలయం ఇంగ్లీషు అధ్యాపకులు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు కృషి చేస్తున్నారు. గత ఐదేళ్లుగా వందలాదిమంది విద్యార్థులకు తన సహకారం అందించారు.





మచిలీపట్నంలోని కృష్ణా విశ్వవిద్యాలయం ఇంగ్లీషు అధ్యాపకులు డాక్టర్ ఎం.కోటేశ్వరరావు ఎంఎ ఇంగ్లీషు, ఎంఫిల్, పిహెచ్‌డి చేశారు. ఎంఎస్‌సి సైకాలజీ, డిప్లమో ఇన్ కెరీర్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పూర్తిచేశారు. చిన్నప్పుడు ఆయనకు ఇంగ్లీష్ అంటే భయం. సరిగ్గా అర్థమయ్యేది కాదు. ఇంటర్‌లో బాగా ఇబ్బంది పడ్డారు. డిగ్రీలోనూ, ఆ తర్వాత ఇంగ్లీషుపై పట్టు సాధించారు. మన చుట్టూ ఉన్న సమాజంలో తనలాంటి వారు ఎంతమంది ఉన్నారో తెలుసుకోవటం కోసం మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లోని అన్ని మురికివాడల్లో ఆయన పర్యటించారు. ప్రత్యేక ప్రశ్నావళి రూపొందించి ఇంటింటికీ వెళ్లి 2013 నుంచి 2017 వరకూ సమస్యలపై అధ్యయనం చేశారు. ఎక్కువగా ఆడపిల్లలు చదువుకు దూరంగా ఉండటం, బాల్యవివాహాలు, మహిళలపై వేధింపులు, చదువుకుంటున్న ఆడపిల్లల్లో ఎక్కువ మంది ఇంగ్లీషులో వెనుకబడి ఉండటాన్ని గమనించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కూడా ఇలాంటి సర్వే నిర్వహించారు. అక్కడ కూడా విద్యార్థినులు ఇంగ్లీషులో మాట్లాడటం, చదవటంలోనూ నెమ్మదిగా ఉండటాన్ని గమనించారు. దీనిని సరిదిద్దటానికి తనవంతుగా ప్రయత్నాన్ని మొదలు పెట్టారు. చిన్నప్పుడు ఆయనకు కుటుంబపరంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురుకావటంతో ఇంగ్లీషు నేర్చుకోలేకపోయారు. పేదరికంతో ఎవ్వరూ ఇంగ్లీషుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు ప్రారంభించారు. ఇంగ్లీషు టైపింగ్ కూడా నేర్చుకోవాలని ప్రోత్సహిస్తున్నారు.

2018లో మచిలీపట్నం మండలంలోని ఎస్ఎన్ గొల్లపాలెంలోనూ విద్యార్థినుల కోసం తొలుత ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు తరగతులు ప్రారంభించారు. ఆయన శిష్యులు కూడా ఈ తరగతులకు సహకారం అందిస్తూ బోధిస్తున్నారు.

ఆ తర్వాత 2019లో లేడీ యాంప్తిల్ హైస్కూల్, రుద్రవరం గురుకుల పాఠశాలలో రెండు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. కోవిడ్ రావటంతో తరగతులు ఆగిపోయాయి. 2021లో రుస్తుంబాద హైస్కూల్, చిలకలపూడిలోని పాండురంగ హైస్కూలు, పద్మావతి మహిళా కళాశాలల్లో కూడా రెండు బ్యాచ్‌లుగా తరగతులు నిర్వహించారు.

2023-24లో కృష్ణా విశ్వవిద్యాలయంలో చదువుకుంటూ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థినులకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకూ 11 బ్యాచ్‌ల్లో సుమారు 1000 మందికి శిక్షణ ఇచ్చారు. తన వద్ద చదువుకుంటున్న విద్యార్థులకు తర్ఫీదు ఇచ్చి వారి ద్వారా కూడా బోధన సాగిస్తున్నారు. వారికి తన సొంత ఖర్చులతోనూ, దాతల ద్వారా కొంత పారితోషికం కూడా ఇస్తున్నారు.

పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో ...

ప్రభుత్వ వసతిగృహాలు, పాఠశాలల్లో చదువుకునే గ్రామీణ ప్రాంత విద్యార్థినుల ఇంగ్లీషు నైపుణ్యాలను పెంపొందించటానికిగాను ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీషు తరగతులను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల విద్యార్థినులకు మాత్రమే కోటేశ్వరరావు ఈ బోధన చేస్తారు. అంబేద్కర్, పూలే స్ఫూర్తితో ఉచిత విద్యాబోధన చేస్తున్నట్టు ఆయన చెప్పారు. తొలుత ఎంచుకున్న పాఠశాల, కళాశాలలో ఆంగ్ల విభాగానికి సంబంధించిన అంశాలపై విద్యార్థినులకు పరీక్ష పెడతారు. వచ్చిన మార్కులను బట్టి వారి శక్తి సామర్థ్యాలను భాషపై అంచనా వేస్తారు. వారి స్థాయిలకు తగినట్టుగా మూడు నెలల స్పోకెన్ ఇంగ్లీషు తరగతులకు సిలబస్ తయారు చేస్తారు. దానిని ప్రతిరోజు రివైజ్ చేస్తుంటారు. పాఠశాలలు, కళాశాలల జరిగే సమయంలోనే ఈ తరగతులు జరుగుతాయి. వసతి గృహాల్లో ఉదయం లేదా రాత్రి సమయాల్లో కొనసాగుతాయి. విద్యార్థులను జట్లుగా విభజిస్తారు. వారి స్థాయిలకు తగ్గట్టుగా ఆయా కృత్యాలకు ఎంపిక చేసి రైమ్స్, పదాలు, పాటలు, నృత్యాలు వంటివి ఇంగ్లీషు అంశాలను జోడించి నేర్పిస్తారు. ఇలా నేర్చుకున్న వారిలో ప్రతిరోజూ ఇద్దరికి తగ్గకుండా తిరిగి తరగతిలో చెప్పాల్సి వుంటుంది. ఇలా మరింత ప్రావీణ్యత చూపించిన వారికి మిగతా క్లాసుల్లో కూడా బోధించటానికి అవకాశం కల్పిస్తుంటారు. స్టూడెంట్ సెంటర్ మెథడ్‌తో ప్రతి విద్యార్థిని కృత్యంలో పాల్గొనటం ద్వారా భాషలో ప్రావీణ్యత సాధించేలా కృషి చేస్తున్నారు.

- కొల్లూరి జాకబ్, మచిలీపట్నం రూరల్,
సెల్ : 8125432290

భయం పోగొట్టి ...భరోసానిస్తూ...



ఇంగ్లీషు అంటే భయం ఉన్న వారికి కూడా ఆటపాటలతో నేర్చుకోవటం పట్ల ఆసక్తి కలిగించి, వారిలో మనోవికాసానికి బాటలు వేస్తున్నాం. అథమస్థితి నుంచి అత్యున్నత స్థాయిలో నిలిచిన మహిళామణుల జీవితగాథలను ఇంగ్లీషులో స్టోరీలుగా చెబుతున్నాం. తద్వారా వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతోంది. గతంలో మచిలీపట్నం, రుద్రవరం, విజయవాడ రూరల్, నున్న, మైలవరం తదితర ప్రాంతాల్లో సదస్సులు, సెమినార్లు నిర్వహించాం. ఆయా పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసే అధ్యాపకులకు మొదటగా శిక్షణ ఇచ్చి ఆ తర్వాత తరగతులు వారే కొనసాగించేలా కూడా ప్రోత్సహిస్తున్నాం.

- డాక్టర్ ఎం.కోటేశ్వరరావు,
ఇంగ్లీష్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, కృష్ణా విశ్వవిద్యాలయం, మచిలీపట్నం


బెటర్‌స్థాయికి చేరుకున్నా ...



మొదటి నుంచి ఇంగ్లీష్ సబ్జెక్టును బట్టీపట్టి చదవటం వల్ల పూర్తిగా అర్థంకాక ఇబ్బంది పడ్డాను. స్పోకెన్ ఇంగ్లీషు తరగతులకు హాజరయ్యాక స్పష్టంగా చదవటం, మాట్లాడుతున్నాను. మార్కులు కూడా ఈ సబ్జెక్టులో పెరిగాయి. యావరేజ్ స్థాయిలో ఉన్న నేను ఇప్పుడు బెటర్‌స్థాయికి వచ్చాను.

- సిహెచ్.సింధూర

ఆట, పాటలతో బోధన



ఇంగ్లీషులో పదాలు, వాక్యాలు ఎలా పలకాలో ఆట పాటల ద్వారా నేర్పిస్తున్నారు. స్నేహపూర్వకమైన వాతావరణంలో బోధన ఉండటంతో ఇంకా నేర్చుకోవాలనే ఆసక్తి పెరుగుతోంది. రైమ్స్‌ను డ్యాన్స్ ద్వారా బోధిస్తుండటంతో ఏ మాత్రం ఒత్తిడి లేకుండా సరదాగా నేర్చుకుంటున్నాం.

- జి.జ్యోత్స్న



ఆ మాటలు వెనక్కి తీసుకుంటున్నా

నాగబాబు

సోషల్ మీడియా వేదికగా నటుడు నాగబాబు క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు ఓ నోట్‌ను విడుదల చేశారు. ఇటీవల జరిగిన 'ఆపరేషన్ వాలెంటైన్' ప్రీరిలీజ్ ఈవెంట్‌లో తాను మాట్లాడిన మాటలను వెనక్కి తీసుకుంటున్నట్లుగా నాగబాబు తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా క్షమాపణలు చెబుతూ నోట్‌ను విడుదల చేశారు. 'పోలీస్ పాత్ర 6 అడుగుల 3 అంగుళాలు ఉండే వ్యక్తులు చేస్తే బాగుంటుంది. 5 అడుగుల 3 అంగుళాలు ఉండే వ్యక్తులు చేస్తే బాగుండదు' అని నాగబాబు వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. 'ఎవరైనా నా మాటలకు నొచ్చుకుని ఉంటే క్షమించండి.. అవి యాదృచ్ఛికంగా వచ్చినవే కానీ...కావాలని అన్న మాటలు కాదు. అందరూ అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నా' అంటూ రాసుకొచ్చారు. ఎత్తుకు సంబంధించిన తన తండ్రి చేసిన వ్యాఖ్యలు ఎవ్వరినీ ఉద్దేశించినవి కావని హీరో వరుణ్‌తేజ్ కూడా పేర్కొన్నారు. తన హైట్‌ను దృష్టిలో పెట్టుకుని చిన్న పోలిక చేశారనీ, ఏ హీరోను కించపర్చే ఉద్దేశ్యం లేదన్నారు.

హాలీవుడ్‌కు 'దృశ్యం' ; తొలి భారతీయ చిత్రంగా రికార్డు



తెలుగు, మలయాళ, హిందీ భాషల్లో ఘన విజయం సాధించిన చిత్రం 'దృశ్యం'. ఇప్పటికే పలు రికార్డులను సొంతం చేసుకున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ చిత్రం రీమేక్‌లలో మరో ఘనత సాధించింది. ఏకంగా హాలీవుడ్ నిర్మాణ సంస్థ ఈ చిత్రాన్ని ఇంగ్లీష్, స్పానిష్‌లలో రీమేక్ చేయనున్నట్లుగా ప్రకటించింది. దీంతో హాలీవుడ్‌లో రీమేక్ కానున్న మొదటి భారతీయ చిత్రంగా 'దృశ్యం' నిలిచింది. ముందుగా ఈ సినిమాను మోహన్‌లాల్, మీనా ప్రధాన పాత్రల్లో దర్శకుడు జీతూ జోసెఫ్ తెరకెక్కించారు. తెలుగులో వెంకటేష్ హీరోగా శ్రీప్రియ పార్ట్ 1 తెరకెక్కించగా, పార్ట్ 2ను జీతూ జోసెఫ్ తీశారు. హిందీలో అజయ్‌దేవ్‌గణ్, శ్రియ ప్రధాన పాత్రల్లో నటించారు. వేర్వేరు దర్శకులు వాటిని రూపొందించారు. తమిళ్‌లో కమల్‌హాసన్, గౌతమి ప్రధాన పాత్రల్లో నటించారు. త్వరలోనే మలయాళంలో 'దృశ్యం'3 రానుంది.

సెట్స్‌పైకి ధృవ్ కొత్త చిత్రం



తమిళ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రానికి సెల్వరాజ్ దర్శకత్వం వహించనున్నారు. స్పోర్ట్స్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా త్వరలో సెట్‌పైకి వెళ్లనున్నట్లు సమాచారం. కబడ్డీ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా కోసం ధవ్ ప్రత్యేక శిక్షణ పొందుతున్నాడు. ఈ సినిమాలో హీరోకు జోడిగా దర్శనా రాజేంద్రన్ నటించనున్నారు. ఈ చిత్ర షూటింగ్ మార్చి 15 నుంచి ప్రారంభం కానుంది. తూత్తుకుడిలో ప్రారంభించి 80 రోజులలో షూటింగ్‌ను పూర్తి చేసెయ్యాలని డైరెక్టర్ ప్లాన్ చేస్తున్నారు.

అమ్మాయే పుట్టాలి : రణ్‌వీర్



బాలీవుడ్ జంట రణ్‌వీర్‌సింగ్, దీపికా దంపతులు త్వరలో తల్లిదండ్రులు కాబోతున్నారు. ఈ విషయాన్ని వారు మీడియా సమక్షంలో వెల్లడించారు. 'మేము త్వరలోనే తల్లిదండ్రులం కాబోతున్నాం. నాకు దీపిక లాంటి ఆడపిల్ల కావాలని ఆశపడుతున్నా. అది చాలు నా జీవితానికి. నేను రోజూ ఆమె చిన్ననాటి ఫొటోలు చూస్తుంటాను. అందులో ఆమె దేవతలా ఉంటుంది. నాకు పుట్టబోయే పాప పేరు 'శౌర్యవీర్‌సింగ్' పెడతామనుకున్నా' అంటూ వ్యాఖ్యానించారు. రణ్‌వీర్, దీపిక దంపతులకు విక్రాంత్ మస్సే, కృతి సనన్, ప్రియాంకా చోప్రా, ఆలియాభట్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

కొత్త కాన్సెప్ట్‌తో 'స్వాగ్' గ్లింప్స్



శ్రీవిష్ణు హీరోగా దర్శకుడు హసిత్ గోలి తెరకెక్కిస్తున్న కొత్త చిత్రం 'స్వాగ్'. తాజాగా ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ని చిత్రబృందం విడుదల చేసింది. ఈ గ్లింప్స్‌లో అడవిలో జంతువులు మాట్లాడుకున్నట్టు చూపించారు. సునీల్, గంగవ్వ.. వాయిస్‌లు వినిపించాయి. ఈ సినిమాని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తోంది. వివేక్ సాగర్ సంగీతం అందిస్తున్నారు.

ఇంద్రగంటి దర్శకత్వంలో ప్రియదర్శి



ప్రియదర్శి హీరోగా మోహన్ కృష్ణ ఇంద్రగంటి ఓ సినిమా తెరకెక్కించనున్నారు. శ్రీ దేవి మూవీస్ బ్యానర్‌పై శివలెంక కృష్ణ ప్రసాద్ ఈ సినిమాను నిర్మించబోతున్నారు. రూపా కొడువాయూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. త్వరలోనే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల ప్రకటన వెలువడనుంది.

మంధాన మెరుపులు వృధా

- ఢిల్లీ చేతిలో బెంగళూరు చిత్తు
- మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)



బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యుపిఎల్)లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) మరో మ్యాచ్‌లో ఓటమిపాలైంది. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు నిర్దేశించిన 195పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో బెంగళూరు కెప్టెన్ స్మృతి మంధాన(74; 43బంతుల్లో 10ఫోర్లు, 3సిక్సర్లు) మెరుపు ఇన్నింగ్స్ ఆడినా ప్రయోజనం లేకపోయింది. మేఘన(36), సోఫీ డివైన్(23), రీచా(19) మాత్రమే రెండక్కెల స్కోర్ చేశారు. ఆ తర్వాత వచ్చిన బ్యాటర్లందరూ సింగిల్ డిజిట్‌కే ఔట్ కావడంతో బెంగళూరు జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 9వికెట్లు కోల్పోయి 169పరుగులే చేసింది. తొలుత ఢిల్లీ ఓపెనర్ షెఫాలీ వర్మ అర్ధశతకానికి తోడు క్యాప్సీ కూడా బ్యాట్ ఝుళిపించడంతో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల జట్టు నిర్ణీత 20 ఓవర్లు ముగిసేసరికి ఐదు వికెట్ల నష్టానికి 194 పరుగుల భారీస్కోర్‌ను చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీకి శుభారంభం దక్కలేదు. ఓపెనర్, కెప్టెన్ లానింగ్(11) త్వరగా పెవీలియన్‌కు చేరింది. ఆ తర్వాత షెఫాలీ-కాప్సే కలిసి 2వ వికెట్‌కు 82పరుగులు జతచేశారు. వీరిద్దరి నిష్క్రమణ తర్వాత రోడ్రిగ్(0) కూడా ఔట్ కావడంతో ఢిల్లీ జట్టు 124పరుగులకే 4వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో కాప్(32; 16బంతుల్లో 2ఫోర్లు, 3సిక్సర్లు), జొన్నాసెన్(36నాటౌట్; 16బంతుల్లో 4ఫోర్లు, 2సిక్సర్లు) ధనా ధన్ ఇన్నింగ్స్ ఆడారు. చివర్లో జొన్నాసెన్ ఆకాశమే హద్దుగా చెలరేగి ఆడడంతో ఢిల్లీ జట్టు నిర్ణీత ఓవర్లు పూర్తయ్యేసరికి భారీస్కోర్‌ను నమోదు చేసింది. బెంగళూరు బౌలర్లు సోఫీ డివైన్, క్లార్క్‌కు రెండేసి, శ్రేయాంక పాటిల్‌కు ఒక వికెట్ దక్కాయి.

స్కోర్‌బోర్డు..

ఢిల్లీ క్యాపిటల్స్ మహిళల ఇన్నింగ్స్: లానింగ్ (సి)వారేహామ్ (బి)సోఫీ డివైన్ 11, షెఫాలీ వర్మ (సి)వారేహామ్ (బి)శ్రేయాంక పాటిల్ 50, క్యాప్సే (బి)నడిన్-డి-క్లార్క్ 46, రోడ్రిగ్స్ (సి)సిమ్రన్ బహదూర్ (బి)నిడెన్ క్లార్క్ 0, మారిజానే కాప్ (సి)సిమ్రన్ బహదూర్ (బి)సోఫీ డివైన్ 32, జెస్ జొన్నాసెన్ (నాటౌట్) 36, అరుంధతి రెడ్డి (నాటౌట్) 10, అదనం 9. (20 ఓవర్లలో 5వికెట్ల నష్టానికి) 194పరుగులు. **వికెట్ల పతనం:** 1/28, 2/110, 3/111, 4/124, 5/172 **బౌలింగ్:** రేణుక సింగ్ 4-0-28-0, సోఫీ డివైన్ 3-0-23-2, సోఫీ మోలినెక్స్ 3-0-23-0, శోభన 2-0-30-0, వారేహామ్ 1-0-13-0, నడిన్-డి-క్లార్క్ 4-0-35-2, శ్రేయాంక పాటిల్ 3-0-40-1.

బెంగళూరు మహిళల ఇన్నింగ్స్: మంధాన (బి)కాప్ 74, సోఫీ డివైన్ (సి)జొన్నాసెన్ (బి)అరుంధతి రెడ్డి 23, మేఘన (రనౌట్)తానియా భాటియా/అరుంధతి రెడ్డి 36, రీచా ఘోష్ (సి)జొన్నాసెన్ (బి)కాప్ 19, వారేహామ్ (సి)కాప్సే (బి)శిఖా పాండే 6, డి-క్లార్క్ (సి-సబ్)సథర్లాండ్ (బి)అరుంధతి రెడ్డి 1, సిమ్రన్ బహదూర్ (సి)లానింగ్ (బి)జొన్నాసెన్ 2, సోఫీ మొలినెక్స్ (సి)రాధా యాదవ్ (బి)జొన్నాసెన్ 0, శ్రేయాంక పాటిల్ (నాటౌట్) 1, శోభన (సి)సథర్లాండ్ (బి)జొన్నాసెన్ 0, రేణుక (నాటౌట్) 1, అదనం 5. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 169పరుగులు. **వికెట్ల పతనం:** 1/77, 2/112, 3/138, 4/150, 5/164, 6/164, 7/167, 8/168, 9/168 **బౌలింగ్:** కాప్ 4-0-35-2, మిన్ను 2-0-28-0, జొన్నాసెన్ 4-0-21-1, శిఖా పాండే 4-0-27-1, అరుంధతి రెడ్డి 4-0-38-2, రాధా 2-0-19-0.

కెఎల్ రాహుల్ ఔట్.. బుమ్రా ఇన్..

ఐదోటెస్ట్‌కు జట్టును ప్రకటించిన బిసిసిఐ



ముంబయి: ఇంగ్లండ్‌తో జరగనున్న ఐదో, చివరి టెస్ట్‌కు భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు (బిసిసిఐ) వారం రోజుల ముందే జట్టును ప్రకటించింది. గాయపడ్డ కెఎల్ రాహుల్ ఐదో టెస్ట్‌కు దూరం కాగా.. మూడు, నాలుగు టెస్టులకు విశ్రాంతి తీసుకున్న జస్ప్రీత్ బుమ్రా తిరిగి చోటు దక్కించుకున్నాడు. గాయపడ్డ కెఎల్ రాహుల్ కోలుకొనేందుకు మరికొంత సమయం పడుతుందని, చికిత్స నిమిత్తం లండన్‌కు వెళ్లనున్నట్లు టీమ్ మేనేజ్‌మెంట్ పేర్కొంది. తొడ కండరాల గాయంతో ఇబ్బందిపడు తుండటంతో బిసిసిఐ అతడిని ఈ టెస్టులో కూడా పరిగణనలోకి తీసుకోలేదు. ఇక పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఫిట్‌నెస్ సాధించడంతో అతడు చోటు దక్కించుకున్నట్లు బిసిసిఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ రెండు మార్పులతో పాటు నాలుగో టెస్టు వరకూ జట్టుతోనే ఉన్న వాషింగ్టన్ సుందర్‌ను బిసిసిఐ రిలీజ్ చేసింది. అతడు రంజీట్రోఫీలో భాగంగా మార్చి 2 నుంచి ముంబయితో జరుగబోయే సెమీస్ మ్యాచ్ కొరకు తమిళనాడుకు ఆడనున్నాడు. ఈ మూడు మార్పులు తప్ప భారత జట్టులో మార్పులేమీ లేవు. ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భారతజట్టు 3-1 ఆధిక్యతలో ఉన్న సంగతి తెలిసిందే. ధర్మశాల వేదికగా మార్చి 7 నుంచి ఐదోటెస్ట్ ప్రారంభం కానుంది.

చివరి టెస్ట్‌కు భారత జట్టు..

రోహిత్(కెప్టెన్), బుమ్రా(వైస్ కెప్టెన్), జైస్వాల్, శుభ్‌మన్, పటీధర్, సర్ఫరాజ్, ధృవ్ జురెల్, శ్రీకర్ భరత్(వికెట్ కీపర్లు), దేవదత్ పడిక్కల్, అశ్విన్, జడేజా, అక్షర్, కుల్దీప్, సిరాజ్, ముఖేష్ కుమార్, ఆకాశ్‌దీప్.

సెమీస్‌కు బాంబ్రీ జోడీ

క్వార్టర్స్‌లో ఓడిన బొప్పన్న-ఎబ్డెన్

దుబాయ్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్



దుబాయ్: దుబాయ్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ పురుషుల డబుల్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు దక్కాయి. క్వార్టర్‌ఫైనల్‌కు చేరిన యుకీ బాంబ్రీ-ఆర్. హాస్ జంట సెమీస్‌కు చేరగా.. టాప్‌సీడ్ రోహన్ బొప్పన్న-ఎబ్డెన్ జంట పావ్లాసెక్(చెక్)-బెహర్(గ్రీక్) చేతిలో ఓటమిపాలయ్యారు. గురువారం జరిగిన తొలి క్వార్టర్‌ఫైనల్లో బాంబ్రీ-హాస్ జంట 6-4, 7-61(7-1)తో అన్‌సీడెడ్ ముర్రే-వీనస్‌పై సునాయాసంగా నెగ్గారు. తొలి గేమ్‌లో ఒక బ్రేక్ పాయింట్ సాధించి ఆ సెట్‌ను కైవసం చేసుకోగా.. రెండో గేమ్ టైబ్రేక్‌లో చేజిక్కించుకున్నారు. ఇక టాప్‌సీడ్ ఎబ్డెన్(ఆస్ట్రేలియా)- బొప్పన్న (భారత్) జంట 6-3, 3-6, (8-10)తో పరాజయాన్ని చవిచూశారు. చివర్లో టైబ్రేక్‌లో ఓ దశలో 8-6తో ఆధిక్యతలో నిలిచి ఓటమిపాలవ్వడం గమనార్హం. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో బాంబ్రీ-హాస్ జంట 2వ సీడ్ క్రాజిసెక్(అమెరికా)-డోడిగ్(క్రొయేషియా)తో తలపడనున్నారు.

క్వార్టర్స్‌కు మణిపూర్

ఇటానగర్: సంతోష్ ట్రోఫీ 2023-24 సీజన్ క్వార్టర్‌ఫైనల్లోకి మణిపూర్, రైల్వేస్ జట్లు దూసుకెళ్లాయి. గురువారం జరిగిన పోటీల్లో మణిపూర్ జట్టు 4-1గోల్స్ తేడాతో మిజోరాంను, రైల్వేస్ జట్టు 1-0తో డిఫెండింగ్ ఛాంపియన్ కర్ణాటకను చిత్తుచేశాయి. గోల్డెన్ జూబ్లీ స్టేడియంలో జరిగిన హోరాహోరీ మ్యాచ్‌లో రైల్వేస్ తరఫున ఏకైక గోల్‌ను సుబ్రత ముర్ము(53వ ని.)లో రెండో అర్ధభాగంలో చేశాడు. ఇక మణిపూర్ తరఫున లిమంజన్ రెండు గోల్స్ చేయగా.. ఫిలామ్, పేబమ్ రెనెడే సింగ్ ఒక్కో గోల్ కొట్టారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68